
'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50 | సంపుటి: 15 | సంచిక: 359

మంగళవారం 21-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




జీవజాలానికి ఉరితాళ్లు!
గ్లోబల్ వార్మింగ్‌తో సముద్రాల అంతర్భాగాల్లోనూ తీవ్రమైన విధ్వంసం -6లో



సూచీలకు బ్యాంకింగ్ భయాలు
17 వేల దిగువకు నిఫ్టీ.. సెన్సెక్స్ నష్టం 361 పాయింట్లు -13లో



జపాన్‌తో బంధం బలోపేతం
ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసేందుకు ప్రధాని మోదీ, జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదాలు ఢిల్లీలో చర్చలు జరిపారు.
- వివరాలు 6లో



'సహజీవనం' పిల్ కొట్టివేత
సహజీవన బంధాన్ని గుర్తించాలంటూ దాఖలైన పిల్‌ను తెలివితక్కువ వ్యాజ్యంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.
- వివరాలు 6లో



ఏమిటీ సీల్డ్ కవర్ సంస్కృతి?
వన్ ర్యాంక్.. వన్ పెన్షన్ బకాయిలపై కేంద్రం సీల్డ్ కవర్లో నోట్ సమర్పించడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది.
- వివరాలు 6లో



రష్యాలో జిన్‌పింగ్ పర్యటన
అధికారిక పర్యటన నిమిత్తం రష్యా రాజధాని మాస్కోకు చేరుకున్న చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు ఘన స్వాగతం లభించింది.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

ఎంసెట్‌కు దరఖాస్తుల వరద



ఎంసెట్‌కు 1,23,780 దరఖాస్తులు అందినట్లు ఎంసెట్ కన్వీనర్ డీన్ కుమార్ తెలిపారు. 79,420 మంది ఇంజనీరింగ్ విభాగానికి, 44,230 మంది అగ్రికల్చర్, మెడికల్ విభాగానికి దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.
- వివరాలు 3లో

అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధం: భాస్కరరెడ్డి



మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఆదేశించినట్టుగా ఏ–4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడని, అతన్ని అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధమని వైఎస్ భాస్కర రెడ్డి తెలంగాణ హైకోర్టుకు నివేదించారు.
- వివరాలు 10లో

వీసాల జారీ సులభతరం



నానక్‌రామ్‌గూడలోని కొత్త, శాశ్వత అమెరికన్ కాన్సులేట్ భవనంలో సోమవారం కార్యకలాపాలు మొదలయ్యాయని కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ ప్రకటించారు. వీసాల జారీని సులభతరం చేసేందుకు ఇక్కడ అధికారుల సంఖ్య పెంచుతున్నామని తెలిపారు.
- వివరాలు 2లో

మళ్లీ భావోద్వేగాలను రెచ్చగొట్టే కుట్ర: బండి



'బీఆర్‌ఎస్ నాయకత్వంపై ప్రజలకు నమ్మకం సడలింది. ఏనాడూ కార్యకర్తలను పట్టించుకోని కేసీఆర్ ఈరోజు వారినుద్దేశించి లేఖ రాయడం వెనుక పెద్దకుట్ర దాగి ఉంది' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి మండిపడ్డారు.
- వివరాలు 2లో

నేడు మళ్లీ విచారణ

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవితకు సమన్లు జారీ చేసిన ఈడీ

- సోమవారం సుదీర్ఘంగా విచారించిన అధికారులు
- సౌత్ గ్రూప్ లావాదేవీలపై ఆరా
- హోటళ్లలో భేటీ ఆరోపణలపైనా ప్రశ్నలు
- కేజ్రీవాల్, సిసోడియాతో ఏం చర్చించారని అడిగిన ఈడీ



ఈడీ విచారణ అనంతరం తిరిగివెళ్తున్న ఎమ్మెల్సీ కవిత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు మంగళవారం ఉదయం మళ్లీ విచారించనున్నారు. ఈ మేరకు ఈడీ సమన్లు జారీ చేసింది. కాగా ఈ కేసుకు సంబంధించి తొలిసారిగా ఈ నెల 11న కవితను విచారించిన ఈడీ అధికారులు, రెండోసారి సోమవారం సుదీర్ఘంగా ప్రశ్నించారు. 11న జరిగిన విచారణకు కొనసాగింపుగా పలు అంశాలపై ప్రశ్నించినట్లు తెలిసింది. ముఖ్యంగా సౌత్ గ్రూపు లావాదేవీలు, ఈ కేసులో నిందితులుగా ఉన్న వారితో హైదరాబాద్, ఢిల్లీ హోటళ్లలో సమావేశమయ్యారనే ఆరోపణలపై ప్రశ్నించినట్లు తెలిసింది.

కవిత ఒక్కరినే..!

ఉదయం కవిత బినామీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అరుణ్ పిళ్లైతో కలిపి, ఆ తర్వాత ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, ఆప్ కమ్యూనికేషన్ల ఇన్‌చార్జి విజయ్ నాయర్‌లతో కలిపి విచారించారనే వార్తలు వచ్చినప్పటికీ.. కవిత ఒక్కరినే ప్రశ్నించినట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి. అరుణ్ పిళ్లైనుంచి పదిసార్లకు పైగా వాంగ్మూలాలు సేకరించిన ఈడీ.. ఆయా వాంగ్మూలాల్లో కవిత ప్రస్తావన ఉన్న అంశాలపై ఆమెను ప్రశ్నించినట్లు సమాచారం. మద్యం వ్యాపారంలో పిళ్లై వాటా 32.5 శాతానికి గానూ ఎంత పెట్టుబడి పెట్టారు? కిక్ బ్యాక్‌ల రూపంలో వెనక్కి మిగతా 2వ పేజీలో ▶

11 గంటలు .. 14 ప్రశ్నలు

- కవితకు ఈడీ ప్రశ్నల తీరిది
- తానెలాంటి తప్పూ చేయలేదన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ
- అధికారులకు పలు ప్రశ్నలు
- విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని వెల్లడి
- కవిత విజ్ఞప్తి మేరకు విచారణ పూర్తిగా వీడియో రికార్డింగ్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సోమవారం దాదాపు 11 గంటల పాటు ఎమ్మెల్సీ కవితను విచారించిన ఈడీ అధికారులు.. 14 ప్రశ్నలు అడిగారని తెలిసింది. విచారణ మొత్తాన్ని ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలంటూ కవిత చేసిన విజ్ఞప్తి మేరకు.. అధికారులు విచారణను పూర్తిగా వీడియో రికార్డింగ్ చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఆధారాలు మిగతా 2వ పేజీలో ▶

హస్తినలో హైటెన్షన్

- కవిత ఈడీ విచారణకు హాజరైన నేపథ్యంలో ఉత్కంఠ
- రాత్రి 9.15 గంటల వరకు కొనసాగిన విచారణ

2లో

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలం.. బలగం

పార్టీ శ్రేణులకు సీఎం కేసీఆర్ ఆత్మీయ సందేశం

- రాష్ట్రాన్ని సాధించిన ఘనత కార్యకర్తలకే దక్కుతుంది
- కొత్త రాష్ట్రాన్ని కోటి కాంతులు విరజిమ్మే నేలగా తీర్చిదిద్దుకున్నాం... తెలంగాణ సమాజానికి పొత్తుల సద్దిమూటగా బీఆర్‌ఎస్ అవతరణ
- రాజకీయాలు ఇతరులకు గేమ్.. బీఆర్‌ఎస్‌కు ఒక టాస్క్
- పురిటిగడ్డపై మరోమారు విజయం తథ్యం
- బరితెగింపు దాడులతో రాష్ట్ర ప్రగతిని బీజేపీ అడ్డుకుంటోందని ఆగ్రహం
- నిరంతరం ప్రజల్లో ఉంటూ విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు



సాక్షి, హైదరాబాద్: 'అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్' నినాదంతో దేశం కోసం బయలుదేరిన బీఆర్‌ఎస్ పార్టీపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బరితెగింపు దాడులు చేస్తూ తెలంగాణ అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటోందని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు, కుట్రలను ఛేదిస్తూ సాహసమే ఊపిరిగా సాగుతున్న తన ప్రయాణంలో పార్టీ కార్యకర్తలే బలం, బలగం అని స్పష్టం చేశారు. 'భారత్ రాష్ట్ర సమితి కుటుంబసభ్యులకు నమస్తే' అంటూ.. పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి సీఎం కేసీఆర్ సోమవారం ఒక ఆత్మీయ సందేశాన్ని విడుదల చేశారు.

బీఆర్‌ఎస్ గట్టి సిపాయి

'14 ఏళ్ల పాటు అధికారంలో లేకున్నా కేసులు, జైళ్లకు వెరవకుండా జెండా భుజాన వేసుకుని, పార్టీని కాపాడుకుని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కార్యకర్తలకే దక్కుతుంది. ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల కృషితోనే రెండు పర్యాయాలు తెలంగాణలో బీఆర్‌ఎస్ అధికారం చేపట్టింది. 21 ఏళ్ల ప్రయాణంలో పంచాయతీ నుంచి పార్లమెంటు దాకా ఏకపక్ష విజయాలు సాధించి రికార్డులను మిగతా 2వ పేజీలో ▶

'వడగళ్ల' ప్రభావిత జిల్లాలకు సీఎం

సాక్షి, హైదరాబాద్: వడగళ్ల వానతో తీవ్రంగా పంట నష్టం జరిగిన జిల్లాల్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మంగళ లేదా బుధవారాల్లో పర్యటించనున్నారు. నష్టం వివరాలను తెప్పించాలని సంబంధిత జిల్లా మంత్రులను, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. మంగళవారం నివేదికల పరిశీలన తర్వాత నిర్ణయం తీసుకొని ఎక్కువ నష్టం వాటిల్లిన జిల్లాల పర్యటనకు ముఖ్యమంత్రి కేసీఆర్ బయలుదేరి వెళ్లనున్నారు.

'స్కిల్డ్' క్రిమినల్ స్కామ్!

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంపై అసెంబ్లీలో సీఎం జగన్

- గత సర్కారు అక్రమాలు ఆధారాలతో బహిర్గతం
- యువతకు స్కిల్ ట్రైనింగ్ పేరిట ప్రజాధనం దోపిడీ
- ఓ ప్రైవేట్ కంపెనీ రూ.3 వేల కోట్ల గ్రాంట్ ఇస్తుందా?
- సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ఒప్పందం
- షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు రూ.371 కోట్లు
- ఇదీ ఆయన అవినీతి విజన్... దీనిపై ఎల్లో మీడియా రాయదు... దత్తపుత్రుడూ ప్రశ్నించడు



సాక్షి, అమరావతి: 'స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో ప్రధాన ముద్దాయి చంద్రబాబే. స్కిల్డ్ క్రిమినల్ చంద్రబాబు చేసిన స్కామ్ ఇది. ఉద్యోగులు, విద్యార్థులకు స్కిల్ ట్రైనింగ్ పేరుతో టీడీపీ ప్రభుత్వం అతిపెద్ద స్కామ్‌కు పాల్పడింది' అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాసనసభ వేదికగా ప్రజలకు వాస్తవాలను బహిర్గతం చేశారు. చంద్రబాబు, ఆయన మనుషులు ఓ దొంగల ముఠాగా ఏర్పడి లోపాయికారీ ఒప్పందంతో రూ.371 కోట్లను షెల్ కంపెనీల ద్వారా కాజేశారని ఆధారాలతో సహా వెల్లడించారు. ఈ స్కామ్‌పై ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 ఎందుకు నోరు మెదపలేదు..? దత్తపుత్రుడు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ''సీమెన్స్ కంపెనీకే తెలియకుండా ఆ సంస్థ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం ఈ ప్రాజెక్టును సృష్టించింది. కేబినెట్ తీర్మానం, జీవోలకు విరుద్ధంగా ఒప్పందం చేసుకుంది. చంద్రబాబు అవినీతి స్కిల్ ఇదీ' అని మండిపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో టీడీపీ హయాంలో జరిగిన కుంభకోణంపై శాసనసభలో సోమవారం చర్చలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. ఈ స్కామ్ జరిగిన తీరును వివరిస్తూ జీవోలు, ఎంవోయూలను సభలో స్లైడ్స్ ద్వారా ప్రదర్శిస్తూ మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ ప్రసంగం వివరాలు ఇవీ..

'షెల్' డబ్బులు బాబు ఇంటికి

రాష్ట్ర చరిత్రలోనే కాకుండా, దేశ చరిత్రలోనే నిరుద్యోగులు, విద్యార్థుల పేరిట జరిగిన అతిపెద్ద స్కామ్ ఇది. స్కిల్లింగ్ పేరుతో డబ్బులు దోచేయడం చంద్రబాబుకు మాత్రమే తెలిసిన గొప్ప స్కిల్. వంద రూపాయల పని చేస్తామని చెప్పి రూ.10 అడ్వాన్స్‌గా తీసుకుని ఆ పది కూడా దోచుకున్న మాదిరిగా ఈ వ్యవహారం ఉంది. అమెరికా, యూరప్‌లో లాటరీ తగిలింది.. 10 మిలియన్ డాలర్లు మీ పేరు మీద వచ్చాయి. అర్జెంట్‌గా రూ.10 లక్షలు కట్టండి.. ఆ తరువాత 10 వేల మిలియన్ డాలర్లు వస్తాయని చెబుతుంటారు. అదే మాదిరిగా మిగతా 10వ పేజీలో ▶



ఏపీ శాసనసభలో స్పీకర్ తమ్మినేని సీతారాంపై టీడీపీ సభ్యులు విసురుతున్న పేపర్లు

స్పీకర్‌పై వికృత చేష్టలు.. దాడి

ఏపీ అసెంబ్లీకి బ్లాక్ డే

- శాసనసభలో పరాకాష్టకు చేరిన టీడీపీ ఎమ్మెల్యేల అరాచకం
- అడ్డుకోబోయిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ ఎమ్మెల్యేలు ఎలిజా, సుధాకర్‌బాబుపైనా దాడి
- దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన మంత్రులు, అధికార పార్టీ సభ్యులపైనా దౌర్జన్యం... తనపై టీడీపీ సభ్యుల దాడి, వికృత చేష్టలపై స్పీకర్ మనస్తాపం
- కొద్దిసేపు సభ నుంచి తన చాంబర్లోకి వెళ్లిపోయిన తమ్మినేని

10లో

పంట నష్టపోయిన రైతులకు భరోసా ఇవ్వండి

బీఆర్‌ఎస్ నేతలకు మంత్రి కేటీఆర్ సూచన

- వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించండి
- కేసీఆర్ సందేశం ప్రతి కార్యకర్తకు చేరేలా చూడండి



సాక్షి, హైదరాబాద్: స్థానిక వ్యవసాయ అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించడం ద్వారా అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు భరోసా కల్పించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు పార్టీ నేతలకు సూచించారు. ఎమ్మెల్యేలు ప్రభుత్వ కార్యక్రమాల అమలును పర్యవేక్షించడంతో పాటు పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతు పనులు వర్షాకాలం లోపు పూర్తయ్యేలా సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఉపాధి హామీ, పంచాయతీరాజ్, పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా చేసిన పనులకు బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి కేంద్రం నుంచి రూ.1,300 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నందునే బిల్లుల చెల్లింపు ఆలస్యమైందని వివరించారు. సీఎం కేసీఆర్ సందేశాన్ని ప్రతి కార్యకర్తకు చేరేలా చూడాలని కేటీఆర్ ఆదేశించారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు, పార్టీ ఇన్‌చార్జీలతో సోమవారం ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఏప్రిల్ 27న జెండా పండుగ

పార్టీ జిల్లా ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నాటికి ఆత్మీయ సమ్మేళనాలు పూర్తి చేయడంతో పాటు బీఆర్‌ఎస్ కార్యకలాపాలు విస్తృతంగా కొనసాగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్ తన సందేశంలో పేర్కొన్నట్టుగా.. ఉద్యమకాలం నుంచి పార్టీకి అండగా ఉంటూ రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు చేసిన కృషిని, పార్టీతో వారి అనుబంధాన్ని గుర్తు చేస్తూ.. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానం అందరికీ అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్రం పట్ల చూపిస్తున్న వివక్షపై ఆత్మీయ సమ్మేళనాల్లో ప్రత్యేకంగా చర్చించాలన్నారు. ఏప్రిల్ 20 నాటికి ఆత్మీయ సమ్మేళనాలు పూర్తి చేసి, 25న నియోజకవర్గ స్థాయిలో బీఆర్‌ఎస్ ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. 1,000 నుంచి 1,500 మంది పార్టీ ప్రతినిధులతో ఈ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాలు, వార్డుల్లో జెండా పండుగ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్లీనరీకి ఆహ్వానం అందిన ప్రతినిధులు హాజరు కావాలని కేటీఆర్ సూచించారు.

ఇంకాచెప్పాలంటే



చూస్తున్నాం... బాగానే ఎదుర్కొన్నావు కానీ.. మా వెంట రా.. రాకుంటే తర్వాత నీకే నష్టం

అన్నీ కొత్తగానే..!



రద్దయిన, వాయిదా పడిన పరీక్షల నిర్వహణపై టీఎస్‌పీఎస్సీ కసరత్తు

- పరీక్షా కేంద్రాలు, హాల్‌టికెట్లు, ప్రశ్నపత్రాలన్నీ మార్చాలని నిర్ణయం... జంబ్లింగ్ విధానంలో ప్రశ్నపత్రాల రూపకల్పనపై పరిశీలన
- అభ్యర్థులకు వారం ముందే హాల్‌టికెట్ల జారీ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి సంబంధించిన అర్హత పరీక్షల నిర్వహణపై తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటివరకు రద్దు చేసిన పరీక్షలు, వాయిదా వేసిన పరీక్షల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో ఇదివరకే నిర్వహించిన నాలుగు పరీక్షలు రద్దు కాగా... మరో రెండు పరీక్షలను చివరి నిమిషంలో వాయిదా వేసింది. ఈ పరీక్షలను తిరిగి నిర్వహించేందుకు ఎలాంటి విధానాలను అనుసరించాలనే అంశంపై ఇప్పటికే పలు రకాల సమీక్షలు నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంది. అతి త్వరలో ఈ పరీక్షల తేదీలను ప్రకటించేందుకు సన్నద్ధమవుతోంది. కాగా పరీక్షల నిర్వహణ విషయంలో సమూల మార్పులు చేయనున్నట్లు కమిషన్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

హాల్ టికెట్లు మొదలు..

టీఎస్‌పీఎస్సీ ఇప్పటివరకు ఏడు అర్హత పరీక్షలను నిర్వహించింది. ప్రశ్నపత్రాల లీకేజీతో గతేడాది అక్టోబర్‌లో నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేసిన కమిషన్... వరుసగా ఏఈఈ, డీఏఓ, ఏఈ అర్హత పరీక్షలను కూడా రద్దు చేసింది. ఈ నెల 12న జరగాల్సిన టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్షను వాయిదా వేయగా... ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించాల్సిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పరీక్షలను సైతం వాయిదా వేసింది. దీంతో ఆరు పరీక్షలను టీఎస్‌పీఎస్సీ తిరిగి నిర్వహించాల్సి వస్తోంది. ఈ పరీక్షలకు సంబంధించి ఇప్పటికే అభ్యర్థుల వద్ద హాల్‌టికెట్లు, పరీక్షా కేంద్రాల వివరాలు ఉన్నాయి. అయితే వీటన్నింటినీ సమూలంగా మార్చి కొత్తగా పరీక్షలు నిర్వహించేందుకు మిగతా 3వ పేజీలో ▶

నా భర్తను చిత్రహింసలు పెడుతున్నారు

హైకోర్టులో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ నిందితుడు రాజశేఖర్ భార్య సుచరిత పిటిషన్

కేటీఆర్‌కు సమన్లు జారీ చేయాలి....

- లీకేజీపై విచారణ జరగకముందే తప్పు ఇద్దరిదని ఎలా తేలుస్తాడు
- సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: రేవంత్‌రెడ్డి

సీబీఐకి అప్పగించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్

- వివరాలు 3లో

అనుబంధ సంఘాలపై 'దృష్టి'



కాంగ్రెస్ అనుబంధ సంఘాలను పటిష్టం చేసే పనిలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి ఠాక్రే

- ఇప్పటికే పలుమార్లు సంఘాలతో భేటీ
- ఈసారి పర్యటనలోనూ అదే షెడ్యూల్
- ఈనెల 23 నుంచి 26 వరకు రాష్ట్రంలోనే.
- 26న ఖమ్మంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రకు హాజరు

సాక్షి, హైదరాబాద్: పార్టీ అనుబంధ సంఘాల బలోపేతంపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ప్రత్యేక దృష్టి సారించారు. పార్టీ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇప్పటికే పలుమార్లు అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు హాజరైన ఆయన వచ్చే పర్యటనలో కూడా అనుబంధ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. పార్టీకి అనుబంధంగా పనిచేసే యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్‌లతో పాటు మహిళా కాంగ్రెస్ నేతలతో మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

'క్యూనెట్' బాధితులకు ప్రభుత్వం అండ: తలసాని

ఆ సంస్థ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం



సాక్షి, హైదరాబాద్/సనత్‌నగర్: క్యూనెట్ సంస్థ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, న్యాయం జరిగేవిధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ భరోసా ఇచ్చారు. సోమవారం క్యూనెట్ బాధితులు మంత్రిని కలిసి న్యాయం చేయాలని కోరారు. ఇటీవల స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆరుగురు క్యూనెట్ ఉద్యోగులు మరణించిన విషయం తెలిసిందే. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామనిచెప్పి వరంగల్, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్ తదితర జిల్లాలకు చెందిన 60 మంది వద్ద లక్షన్నర నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేశారని మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి వెంటనే క్యూనెట్ నిర్వాహకులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మహంకాళి పోలీసులను ఆదేశించారు.

25 నుంచి సీపీఐ పాదయాత్ర: కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని. చిత్రంలో సయ్యద్ అజీజ్ పాషా, చాడ వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం మేరకు తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర వైఫల్యాన్ని ఎండగడుతూ ఈ నెల 25 నుంచి సీపీఐ ఆధ్వర్యంలో బయ్యారం నుండి హన్మకొండ వరకు 'ప్రజా పోరు యాత్ర'పేరుతో పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. మొత్తం 12 రోజులు 770 కిలోమీటర్ల పాటు ఈ పాదయాత్ర సాగుతుందని వెల్లడించారు. హైదరాబాద్ లో సోమవారం పార్టీ నేతలు సయ్యద్ అజీజ్ పాషా, చాడ వెంకట్ రెడ్డి, పశ్య పద్మ, తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ నెల 25న బయ్యారంలో మధ్యాహ్నం 3 గంటలకు పాదయాత్ర ప్రారంభ సూచికగా బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రంజాన్ మాసంలో గంట ముందే వెళ్లవచ్చు..

సాక్షి, హైదరాబాద్: రంజాన్ మాసం సందర్భంగా ప్రార్థనల కోసం ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు ఒక గంట ముందే కార్యాలయాలు, పాఠశాలల నుంచి వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 23 నుంచి వచ్చే నెల 23 వరకు ఈ వెసులుబాటును కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, బోర్డులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు ఈ వెసులుబాటు లభించనుంది.

కొత్త పేస్కేల్‌తో సెర్ప్ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు

సాక్షి, హైదరాబాద్: తమకు కొత్త పేస్కేల్ వర్తింపజేస్తూ జీవో జారీచేయడంపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆదేశాలు రావడానికి తోడ్పడిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎర్రబెల్లిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు సోమవారం తమ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిశారు. అనంతరం ఎర్రబెల్లి సెర్ప్ ఉద్యోగులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎర్రబెల్లి మాట్లాడుతూ కొత్త పేస్కేల్ ఇవ్వడం సీఎం ఉదారతకు నిదర్శనమని కొనియాడారు. ఓపికతో ఉన్న వారికి తప్పకుండా కేసీఆర్ న్యాయం చేస్తారనడానికి సెర్ప్ ఉద్యోగుల పేస్కేల్ నిదర్శనమన్నారు. పాతికేళ్లుగా ఎదురు చూస్తున్న సెర్ప్ ఉద్యోగులకు ఏ ప్రభుత్వం చేయని విధంగా వేతనాలు పెంచారని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రిని సెర్ప్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఉద్యోగుల సంఘం నేతలు సుదర్శన్, వెంకట్, సువర్ణ పాల్గొన్నారు.

11 గంటలు.. 14 ప్రశ్నలు

▶ మొదటి పేజీ తరువాయి

లేకుండా కేవలం రాజకీయ ఒత్తిడిలో భాగంగానే విచారణకు పిలిచారని ఈడీ అధికారులతో కవిత అన్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఇది కేవలం రాజకీయ కుట్ర అని స్పష్టం చేశారు. రాజకీయ ఒత్తిడితో ఈడీలో పారదర్శకత లోపించిందని చెప్పారు. 'ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో నన్ను నిందితురాలిగా పిలిచారా?' అని ప్రశ్నించారు. 'కాదు..' అని అధికారులు సమాధానం ఇచ్చారని తెలిసింది. సుప్రీంకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉండగా ఇంత తొందరగా విచారించాల్సిన అవసరం ఏముందని కవిత ప్రశ్నించారని సమాచారం. అలాగే తను ఫోన్ ధ్వంసం చేసినట్టు మీడియాకు లీకులెవరిచ్చారని కూడా కవిత ప్రశ్నించారు. గత విచారణలో స్వాధీనం చేసుకున్న తన ఫోన్ పూర్తిగా చెక్ చేసుకోవచ్చని అన్నారు. పూర్తిగా రాజకీయ దురుద్దేశంతోనే అధికారులు విచారిస్తున్నారని, అయినా విచారణకు తాను పూర్తిగా సహకరిస్తున్నానని చెప్పారు. కాగా సోమవారం కవిత ఈడీ కార్యాలయానికి చేరుకున్న గంట తర్వాత అధికారులు వచ్చారని, చాలాసేపు కవిత ఒక్కరినే రూమ్ కూర్చోబెట్టారని సమాచారం.

'నాటు' టేస్టు.. విదేశాల్లో హిట్టు..

నాటుకోడితో నోరూరించే పచ్చడి.. కమ్మని రుచికి కేరాఫ్ జగిత్యాల రైతు

జగిత్యాల అగ్రికల్చర్: ఎంత బ్రాయిలర్ కాలమైనా నాటు కోడి రుచే వేరు. అందుకే ఓ రైతు రొటీన్‌కు భిన్నంగా ఆలోచించారు.. అందరిలా కాకుండా నాటుకోళ్లు పెంచుతూ వాటి మాంసంతో పచ్చళ్లు తయారు చేస్తున్నారు. కమ్మని రుచితో అందరి మనసు దోచుకుంటున్నారు. ఆయన చేతి పచ్చళ్లు రుచి చూసిన గ్రేటర్ హైదరాబాద్ వాసులే కాదు.. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో ఉండే మనవారు కూడా ఇక్కడ ఉండే తమ బంధువుల ద్వారా ఆర్డర్లపై ఆర్డర్లు ఇచ్చేస్తున్నారు.

- మామిడితోటలో నాటుకోళ్ల పెంపకం
- పుంజు మాంసంతో పచ్చడి తయారీ
- రాష్ట్రంతో పాటు విదేశాల్లోనూ గిరాకీ







మామిడితోటలో నాటుకోళ్ల ఫారం

జగిత్యాల జిల్లా రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఎద్మల మల్లారెడ్డికి గ్రామ శివారులో ఐదెకరాల మామిడితోట ఉంది. అందులో రెండు షెడ్లు నిర్మించారు. ఒక్కో బ్యాచ్‌లో 500 నాటుకోళ్ల పెంపకం చేపట్టారు. ఒక్కోటి 1.5 కేజీల నుంచి 2 కేజీల బరువు అయ్యే వరకూ దాణా అందిస్తున్నారు. పెట్టని కేజీకి రూ.400 చొప్పున వినియోగదారులకు నేరుగా విక్రయిస్తున్నారు. పుంజు మాంసంతో చికెన్ పకోడి వంటి ఆహార పదార్థాలు తయారు చేస్తూ వాటినీ నేరుగా వినియోగదారులకే అమ్ముతున్నారు.

ఆర్డర్‌రాగానే..

మల్లారెడ్డి నాటుకోడి మాంసంతో తయారు చేసే ఆహార పదార్థాల్లో పచ్చడి అతి ప్రధానమైంది. కస్టమర్ల నుంచి ఆర్డర్ రాగానే పచ్చడి తయారీ ప్రక్రియ ప్రారంభిస్తున్నారు. ఇందు కోసం ముగ్గురు కూలీల సాయం తీసుకుంటున్నారు. పచ్చడి కోసం కోడి పుంజును వినియోగిస్తున్నారు. గ్యాస్ వాడకుండా కట్టెల మీద కాల్చడం మరో విశేషం. బోన్‌లెస్ ముక్కలను ఉడికించి, నూనెలో వేపడం ద్వారా ప్రత్యేకంగా తయారు చేసుకున్న మసాలాలతో పచ్చడి తయారు చేస్తున్నారు.

పెరిగిన ఆర్డర్లు..

నాటుకోడి పచ్చడి రుచిచూసిన కస్టమర్లు.. తమ బంధువులు, స్నేహితుల కోసం ఆర్డర్లు ఇస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాలతోపాటు విదేశాల్లోని తమవారికీ పంపిస్తున్నారు. ఆర్డర్లు భారీగా వస్తుండటంతో మల్లారెడ్డి ఇతర రైతుల నుంచి కూడా కోడిపుంజులను హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తున్నారు.

ఏదైనా కొత్తగా ఉంటేనే ఆదరణ

ఏదైనా వినూత్నంగా ఆలోచించి వినియోగదారులను ఆకర్షించగలగాలి. అదే ఉద్దేశంతో నేను నాటు కోడి పచ్చడి తయారీ ప్రారంభించా. కోళ్లను నేరుగా విక్రయించే బదులు పచ్చడి తయారుచేసి అమ్మడం లాభదాయకం. ఇందులో శ్రమ ఉంటుంది, ఖర్చూ ఉంటుంది. అలాగే లాభమూ వస్తుంది.

–ఎద్మల మల్లారెడ్డి



బంధువులే తొలి కస్టమర్లు..

ఈ పచ్చడిని అరకిలో, కిలో చొప్పున ప్యాక్ చేస్తున్నారు. ఆరు నెలలుగా 'ఏఎంఆర్ ఇంటిగ్రేటెడ్ ఫామ్'బ్రాండ్ పేరిట అర్ధకిలో రూ.700, కిలో రూ.1,400 చొప్పున విక్రయిస్తున్నారు. తొలుత బంధువులు, పరిచయస్తుల్లో ప్రాచుర్యం పొందింది. క్రమంగా వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. కావాలనుకున్న వారు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేశాక ఒక్కరోజులోనే పచ్చడి తయారు చేసి అందజేస్తున్నారు.

గుడ్ మార్నింగ్..

ఇదొక్క అందమైన మార్నింగ్!

సాక్షి CELEBRATING 15 YEARS

ఈ శుభోదయపు పలకరింపుతోనే సరిగ్గా పదిహేనేళ్ల క్రితం.. రంగుల హరివిల్లులా.. 'సాక్షి' దిన పత్రిక ఆవిర్భవించింది. 'సత్యమేవ జయతే..' అంటూ నిఖార్సైన జర్నలిజానికి శంఖం పూరించింది. నాటి నుంచీ అంచెలంచెలుగా ఎదుగుతూ విలువలకు కట్టుబడిన పాత్రికేయ ధర్మాన్ని నిబద్ధతతో కొనసాగిస్తూ వస్తోంది. ఈ మహాయజ్ఞం ఇప్పుడు పదహారవ యేటలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో 'సాక్షి' తన పాఠకులకు చిన్న క్విజ్ పెట్టి, కానుకలను ఇవ్వదలచింది. వివరాల కోసం ఇప్పుడే sakshi.com ఓపెన్ చేయండి, జవాబు చెప్పండి.. బహుమతి గెలుచుకోండి అన్న లింకును క్లిక్ చేయండి.

ఈరోజు ప్రశ్న	సాక్షి ఒక నవశకానికి సంకేతం అని ఆవిర్భావ సందేశం పంపిన క్రికెట్ దిగ్గజం ఎవరు?	ఎ) వీవీఎస్ లక్ష్మణ్	బి) రాహుల్ ద్రావిడ్
		సి) సచిన్ టెండూల్కర్	డి) ఎం.ఎస్.ధోనీ

అడవిపై గిరిజనులకే సర్వహక్కులు

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- కుమురంభీం జిల్లాలో కొనసాగిన పీపుల్స్ మార్చ్ యాత్ర

నార్నూర్(ఆసిఫాబాద్): ఏజెన్సీ ప్రాంతాల్లోని అడవులపై సర్వహక్కులు గిరిజనులకే ఉంటాయని, అడవిలోకి వెళ్లకుండా అడ్డుకోవడం అంటే వారి హక్కులను కాలరాయడమే అవుతుందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సోమవారం కుమురంభీం జిల్లా జైనూర్ మండలానికి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జల్, జంగల్, జమీన్ కోసం ఆనాడు కుమురంభీం నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసి సాధించిన హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను రూపొందించిందని పేర్కొన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం అటవీ చట్టాలను తుంగలో తొక్కుతోందని మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే పోడు భూముల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో రూ.42 వేల కోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం పెద్ద కుంభకోణమని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.40 వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు.



జైనూర్ మండలం పోచంలొద్ది వద్ద గిరిజన మహిళలతో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి

కవిత, కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలి..: లిక్కర్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఎమ్మెల్సీ కవితలను అరెస్ట్ చేయాలని భట్టి అన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలో బీఆర్ఎస్ నేతల హస్తం ఉందని, సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

హస్తినలో హైటెన్షన్

కవిత ఈడీ విచారణకు హాజరైన నేపథ్యంలో ఉత్కంఠ

- రాత్రి 9.15 గంటల వరకు కొనసాగిన విచారణ
- లోపల విచారణ.. బయట బీఆర్ఎస్ నేతల ఎదురుచూపులు.. పోలీసుల మోహరింపు
- సాయంత్రం న్యాయవాదులు, వైద్య బృందాల రాకతో మరింత టెన్షన్
- కవిత నవ్వుతూ బయటకు రావడంతో ఉత్కంఠకు తెర



ఈడీ కార్యాలయం ఎదుట భర్తతో కవిత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి ఎమ్మెల్సీ కవితను ఈడీ సోమవారం రాత్రి వరకు విచారించింది. ఈ నేపథ్యంలో సాయంత్రం నుంచి నెలకొన్న ఉత్కంఠకు.. పది గంటలకు పైగా సుదీర్ఘ విచారణ అనంతరం రాత్రి 9.15 గంటల సమయంలో కవిత బయటకు రావడంతో తెరపడింది. ఆమె కోసం బయట వేచి చూస్తున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. విక్టరీ సంకేతం చూపిస్తూ కారెక్కిన కవిత అక్కణ్నుంచి నేరుగా ఇంటికి వెళ్లిపోయారు. సోదరుడు, రాష్ట్ర మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. అనంతరం విచారణ జరిగిన తీరుపై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది.

అరగంట ముందే ఈడీ ఆఫీసుకు..

ఆదివారం రాత్రికే ఢిల్లీ చేరుకున్న కవిత సోమవారం అరగంట ముందే ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. అంతకుముందు మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, న్యాయవాదులతో భేటీ అయ్యారు. ఈడీ విచారణను ఎదుర్కొనే తీరుపై చర్చించారు. అనంతరం తుగ్లక్ రోడ్‌లోని నివాసం నుంచి బయటకు వచ్చిన కవిత, భర్త అనిల్‌తో కలిసి ఈడీ కార్యాలయానికి బయల్దేరారు. 10.30 గంటలకు అక్కడికి చేరుకున్న తర్వాత ఓసారి భర్తను హత్తుకొని లోనికివెళ్లారు.

ఉదయం మొదలుకుని రాత్రి వరకు..

కవిత విచారణకు హాజరైంది మొదలు..బయటకు వచ్చేంతవరకు పది గంటలకు పైగా ఢిల్లీలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఓ వైపు ఈడీ కార్యాలయం లోపల విచారణ, మరోవైపు ఉదయం నుంచి వర్షంలోనూ బయటే బీఆర్ఎస్ నేతల ఎదురుచూపులు, ఇంకోవైపు కేంద్ర బలగాల ఆంక్షలతో రోజంతా ఎడతెగని ఉత్కంఠ కొనసాగింది.

నవ్వుతూ బయటకు..

చివరకు 9.15 గంటల సమయంలో నవ్వుతూ బయటకు వచ్చిన కవిత వాహనం ఎక్కేముందు విక్టరీ సంకేతం చూపించారు. అందరికీ అభివాదం చేస్తూ తన నివాసానికి వెళ్లిపోయారు. ఈ సమయంలో కారులో కవితతో పాటు ఆమె భర్త అనిల్, న్యాయవాది సోమ భరత్ ఉన్నారు. కవిత ఇంటికి చేరగానే కార్యకర్తలు గుమ్మడికాయతో దిష్టి తీశారు. కవిత విచారణను దృష్టిలో పెట్టుకొని తుగ్లక్ రోడ్‌లో పోలీసులు 144 సెక్షన్ విధించగా, ఈడీ కార్యాలయానికి ఇరువైపులా ఢిల్లీ పోలీసులు బారికేడ్లు పెట్టి ఐడీ కార్డులు చూపిన వారినే కార్యాలయ ప్రాంతంలోకి అనుమతించారు. భారీగా పోలీసులను మోహరించారు.

సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన న్యాయవాదుల బృందం ఈడీ ఆఫీసుకు చేరుకోవడంతో టెన్షన్ పెరిగింది. న్యాయవాదులు వెళ్లిన కొద్ది సేపటికే.. ఆరు గంటల సమయంలో ముగ్గురు సభ్యుల మహిళా వైద్యుల బృందం లోపలికి వెళ్లింది. కవితకు వైద్య పరీక్షల నిమిత్తమే వారు లోనికి వెళ్లారన్న సమాచారంతో ఉత్కంఠ మరింత పెరిగిపోయింది. మరో పది నిమిషాల వ్యవధిలోనే ఢిల్లీ పోలీసులకు చెందిన ఎస్కార్ట్ వాహనం కూడా వెళ్లింది. అయితే 6.30 గంటల సమయంలో వైద్యుల బృందం బయటకు వెళ్లిపోయింది. ఈడీ విచారణలో ఉన్న ఇతరుల వైద్య పరీక్షలకే వారు వచ్చారని తెలిసింది.

మళ్లీ భావోద్వేగాలను రెచ్చగొట్టే మహాకుట్ర



సీఎం కేసీఆర్ బహిరంగలేఖకు కౌంటర్‌గా బండి సంజయ్ లేఖ

సాక్షి, హైదరాబాద్: 'బీఆర్ఎస్ నాయకత్వంపై, కల్వకుంట్ల కుటుంబంపై రాష్ట్ర ప్రజలతోపాటు పార్టీ నేతలు, కార్యకర్తలకు కూడా నమ్మకం సడలిందనడానికి సీఎం కేసీఆర్ రాసిన లేఖే ఉదాహరణ. ఏనాడూ కార్యకర్తలను పట్టించుకోని కేసీఆర్ ఈరోజు వారిని ఉద్దేశించి లేఖ రాయడం వెనుక పెద్దకుట్ర దాగి ఉంది'అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. దగాపడ్డ తెలంగాణ ప్రజలారా, మళ్లీ భావోద్వేగాలను రెచ్చగొట్టే మహాకుట్ర జరుగుతోంది. ఈసారి మోసపోతే గోస పడతాం. తస్మాత్ జాగ్రత్త. లిక్కర్ స్కామ్‌లో బిడ్డ, పేపర్ లీకేజీలో కొడుకు, అవినీతి స్కాంల నుంచి దారి మళ్లించే కుట్రలో భాగమే సీఎం లేఖ'అని పేర్కొంటూ సోమవారం రాత్రి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. 'సమస్యలు చెప్పుకుందామని ప్రగతిభవన్‌కు వస్తే పోలీసులను ఉసిగొల్పి లాఠీలు ఝుళిపించిన కేసీఆర్, ఫాంహౌస్‌కే పరిమితమై పాలన కొనసాగిస్తూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, కార్యకర్తల మనోభావాలను గాలికొదిలేశారు'అని మండిపడ్డారు. 'తన కుటుంబమే పరమావధిగా వేల కోట్ల రూపాయలు సంపాదించిన కేసీఆర్ అవినీతి కోటలు బద్దలయ్యే సమయం ఆసన్నమయ్యేసరికి అకస్మాత్తుగా కార్యకర్తలపై ప్రేమ పుట్టుకొచ్చింది'అని ఆరోపించారు. 'ఇప్పటికే కాళేశ్వరం స్కామ్, ఇంటర్మీడియట్ విద్యార్థుల మరణాలకు కారణమైన ఐటీ స్కాం, ధరణి స్కాం, రియల్ ఎస్టేట్ మాఫియా వంటివి అనేకం రాబోయే రోజుల్లో మరిన్ని బయటకు వస్తాయనే భయంతో తన కుటుంబంపైకి, తన పార్టీ కార్యకర్తలే తిరగబడకుండా వారిని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి ప్రతిపక్షాలపైకి ఉసిగొల్పే కుట్రకు తెరదీశారు'అని ధ్వజమెత్తారు. 'బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి ఏటా యూపీఎస్సీ తరహాలో జాబ్ కేలండర్ ప్రకటిస్తాం. పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇస్తాం. రైతులందరికీ ఫసల్‌బీమా యోజన కింద నష్టపరిహారం అందిస్తాం' అని సంజయ్ పేర్కొన్నారు. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మరో లేఖ రాశారు.

బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలం.. బలగం

▶ మొదటి పేజీ తరువాయి

తిరగరాసి గమ్యాన్ని ముద్దాడిన గట్టి సిపాయి బీఆర్ఎస్. కొత్త రాష్ట్రాన్ని కోటి కాంతులు విరజిమ్మేలా తీర్చిదిద్దుకున్నాం. ఇతరులకు రాజకీయాలు క్రీడలాంటివి. బీఆర్ఎస్‌కు మాత్రం ఒక టాస్క్..' అని కేసీఆర్ పేర్కొన్నారు.

అభివృద్ధిలో దేశం వెనుకబాటు

'కష్టాలు, కన్నీళ్లు, కరువుతో అల్లాడిన తెలంగాణ పచ్చని పంటలతో కళకళలాడుతోంది. ప్రభుత్వ పథకాలు ఆణిముత్యాల్లా దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. కలలో కూడా ఊహించని పనులను చేపట్టి దేశానికి నమూనాగా నిలబెట్టిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుంది. కుల మతాలకు అనుగుణంగా తెలంగాణ సమాజానికి పొత్తుల సద్దిమూటగా బీఆర్ఎస్ అవతరించింది. అయితే దేశంలో 75 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా కనీస వసతులు కరువయ్యాయి. అన్ని వనరులు ఉన్నా అభివృద్ధిలో దేశం వెనుకబాటుకు గురైంది. చైనా, సింగపూర్, దక్షిణ కొరియా లాంటి దేశాలు అద్భుతమైన ప్రగతిని సాధిస్తున్నా, కుల, మతాల కుమ్ములాటతో భారత్ అభివృద్ధి సాధించలేకపోతోంది. దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించిన కాంగ్రెస్, బీజేపీలకు తెలివి, విజన్ లేదు..'అని కేసీఆర్ దుయ్యబట్టారు.

తెలంగాణతో బీఆర్ఎస్‌ది పేగు బంధం

'కొత్త ఎజెండాతో జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసేందుకే బీఆర్ఎస్ మరో ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. ప్రజల సమస్యలు ఇతివృత్తంగా పనిచేస్తున్న బీఆర్ఎస్‌ను తెలంగాణ సమాజం వదులుకోదు. తెలంగాణతో బీఆర్ఎస్‌ది పేగు బంధం. పురిటిగడ్డపై మరోమారు విజయం తథ్యం..'అని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ఏడాదిలో ప్రజల్లోనే ఉంటూ విపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌ను బలోపేతం చేసే బాధ్యత పార్టీ కేడర్‌పైనే ఉందన్నారు. ధర్మమే జయిస్తుందంటూ సందేశాన్ని ముగించారు.

నేడు మళ్లీ విచారణ

▶ మొదటి పేజీ తరువాయి

ఏ మేరకు వచ్చింది? పిళ్లైతో కలిసి ఇతర రాష్ట్రాల్లోనూ వ్యాపారం విస్తరించాలనుకోవడం? తదితర ప్రశ్నలు వేసినట్లు తెలిసింది. ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించి సీఎం కేజ్రీవాల్, నాటి డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాలతో ఏయే అంశాలు చర్చించారని కూడా అడిగినట్లు సమాచారం. ఢిల్లీ, హైదరాబాద్ హోటళ్ల నుంచి తెప్పించిన పలు రికార్డులు ముందుపెట్టి, ఆయా సమావేశాల్లో ఏమేం మాట్లాడారని ప్రశ్నించినట్లు తెలిసింది.

తీహార్ జైలుకు పిళ్లై

కస్టడీ ముగియడంతో పిళ్లైను ఈడీ అధికారులు సోమవారం మధ్యాహ్నం రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అనుమతించారు. దీంతో అధికారులు పిళ్లైను తీహార్ జైలుకు తరలించారు.

ఈడీకి నోటీసులు

తన కుమారుడిని పాఠశాలలో చేర్చేందుకు తల్లిదండ్రులు హాజరు కావాల్సి ఉన్నందున బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అభిషేక్ బోయినపల్లి దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు ఈడీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 12కు వాయిదా వేసింది.

గవర్నర్‌కు నోటీసులు ఇవ్వం

- బిల్లుల పెండింగ్‌పై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణలో సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- రాజ్యాంగ వ్యవస్థలకు నోటీసులు అవసరంలేదన్న సొలిసిటర్ జనరల్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్‌కు నోటీసులు జారీ చేయబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తన వద్దకు పంపిన పలు బిల్లులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టారంటూ రాష్ట్ర గవర్నర్‌పై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పంజాబ్ రాష్ట్రానికి సంబంధించి కూడా ఇదే తరహా అంశాన్ని విచారణకు తీసుకున్నారని తెలంగాణ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో గవర్నర్ సెక్రటరీ, కేంద్రానికి నోటీసులు జారీచేయాలని ధర్మాసనాన్ని కోరారు. అయితే గవర్నర్‌కు నోటీసులు ఇవ్వబోమని, ప్రస్తుతం కేంద్రానికి మాత్రమే జారీచేస్తామని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. సాధారణంగా గవర్నర్‌కు నోటీసులు జారీచేయమని తెలిపారు. గవర్నర్‌కు కాకుండా సెక్రటరీకి జారీచేయాలని దవే మరోసారి కోరారు. తెలంగాణ గవర్నర్ బిల్లులు పెండింగ్‌లో ఉంచారని దాఖలైన ఈ పిటిషన్‌లో నోటీసులు జారీ చేయొచ్చా అని సీజేఐ ప్రశ్నించగా, అవసరం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. గవర్నర్ లాంటి రాజ్యాంగ వ్యవస్థలకు నోటీసులు జారీ చేయాల్సిన అవసరం లేదని మెహతా స్పష్టం చేశారు. దీంతో గవర్నర్‌కు నోటీసులు జారీ చేయడంలేదని జస్టిస్ పీఎస్ నరసింహ పేర్కొన్నారు. తాను ఇక్కడే ఉన్నందున పిటిషన్ కాపీని తనకు సర్వ్ చేయాలని మెహతా ధర్మాసనాన్ని కోరారు. అనంతరం ధర్మాసనం కేంద్రానికి నోటీసులు జారీచేస్తూ తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

వీసాల జారీ సులభతరానికి అధికారుల సంఖ్య పెంపు

వెల్లడించిన కాన్సుల్ జనరల్ జన్నిఫర్ లార్సెన్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ అత్యాధునిక హంగులతో నిర్మించిన సొంత భవనంలోకి మారిపోయింది. నానక్‌రామ్ గూడలోని కొత్త, శాశ్వత అమెరికన్ కాన్సులేట్ భవనంలో సోమవారం కార్యకలాపాలు మొదలయ్యాయని కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ ప్రకటించారు. భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఇదో మైలురాయి అని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. వీసాల జారీని సులభతరం చేసేందుకు ఇక్కడ అధికారుల సంఖ్య పెంచుతున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశాకు అమెరికా ప్రతినిధిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. 2008వ సంవత్సరంలో హైదరాబాద్‌లో తొలిసారి అమెరికన్ కాన్సులేట్ ప్రారంభం కాగా, ఇప్పటివరకూ అది బేగంపేటలోని పైగా ప్యాలెస్‌లో పనిచేసిన విషయం తెలిసిందే. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి శాశ్వత భవన నిర్మాణం కోసం నానక్‌రామ్ గూడలో సుమారు 12 ఎకరాల స్థలం కేటాయించారు. అందులోనే అమెరికా సుమారు 34 కోట్ల డాలర్ల (రూ.2,800 కోట్లు) వ్యయంతో కొత్త భవనాన్ని నిర్మించుకుంది.

చిరునామా: సర్వే నంబరు 115/1, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్ గూడ, హైదరాబాద్, తెలంగాణ, 500032.

- అత్యవసర కాన్సులర్ సేవల కోసం (అమెరికా పౌరులైతే) +91 040 6932 8000 నంబరులో సంప్రదించవచ్చు.
- సాధారణ సేవల కోసం ''HydACS@state.gov.''ఐడీకి మెయిల్ చేయవచ్చు.
- వీసా ఇంటర్వ్యూలు నిర్దిష్ట సమయాల్లో నానక్‌రామ్ గూడలోని కొత్త కార్యాలయంలో జరుగుతాయి.
- వీసాలకు సంబంధించిన ఇతర సర్వీసులు (బయోమెట్రిక్స్, అపాయింట్‌మెంట్స్, 'డ్రాప్ బాక్స్'పాస్‌పోర్ట్ పికప్, అపాయింట్‌మెంట్స్ (ఇంటర్వ్యూ వెయివర్)లు మాదాపూర్‌లోని హైటెక్ సిటీ మెట్రోస్టేషన్‌లో ఏర్పాటు చేసిన 'వీసా అప్లికేషన్ సెంటర్'లో కొనసాగుతాయి.
- కాన్సులర్ సేవలకు సంబంధించిన ప్రశ్నల కోసం +91 120 4844644 లేదా +91 22 62011000 నంబర్లను సంప్రదించవచ్చు.

అనుబంధ సంఘాలపై 'దృష్టి'

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే సమావేశమై వారికి దిశానిర్దేశం చేసిన ఆయన ఈసారి పర్యటనలో యూత్ కాంగ్రెస్, టీపీసీసీ ఫిషర్‌మెన్ కమిటీలతో సమావేశం కానున్నారు. అనుబంధ సంఘాలే పార్టీకి బలమని తన తొలి పర్యటన నుంచి చెపుతున్న ఆయన తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ ఆయా సంఘాల నేతలతో భేటీ అవుతున్నారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీల ఏర్పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేయాల్సిన పోరాటాలపై యూత్‌కాంగ్రెస్, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ నేతలకు భేటీల్లో ఠాక్రే దిశానిర్దేశం చేస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

ఈసారి నాలుగు రోజుల టూర్

మాణిక్‌రావ్ ఠాక్రే మరోమారు నాలుగు రోజుల పాటు తెలంగాణలో పర్యటించనున్నారు. ఈనెల 23న హైదరాబాద్ రానున్న ఆయన 26 వరకు ఇక్కడే ఉండనున్నారు. ఈనెల 23న పీసీసీ అధ్యక్షుడు రేవంత్, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, హాథ్‌సే హాథ్‌జోడో ఇన్‌చార్జులతో ఆయన భేటీ కానున్నారు. ఫిబ్రవరి ఆరోతేదీ నుంచి ప్రారంభమైన యాత్రలు సాగుతున్న తీరు, నాయకుల సహకారం, ప్రజల నుంచి వస్తున్న స్పందన లాంటి అంశాలపై చర్చించనున్నారు. ఇక, 24వ తేదీన యూత్‌కాంగ్రెస్, ఫిషర్‌మెన్ కమిటీలతో సమావేశం కానున్న ఠాక్రే ఈనెల 25న కీలక సమావేశం నిర్వహించనున్నారు. హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉందన్న అంచనాల నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన పార్టీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల మాజీ చైర్మన్లతో సమావేశం కానున్నారు. నగరంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ పునర్నియామకం తదితర అంశాలపై ఆయన చర్చించనున్నారు. ఆ తర్వాత 26న ఖమ్మంలో రేణుకాచౌదరి ఆధ్వర్యంలో హాథ్‌సే హాథ్‌జోడో యాత్రకు కూడా హాజరుకానున్నారు.

26 నుంచి మళ్లీ హాథ్‌సే హాథ్‌జోడో

రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలు చేపట్టిన హాథ్‌సే హాథ్‌జోడో యాత్రలకు సోమవారం నుంచి విరామం ఇవ్వనున్నారు. యాత్రల్లో భాగంగా రేవంత్‌రెడ్డి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో, భట్టి విక్రమార్క ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఉన్నారు. సోమవారం యాత్ర ముగిసిన తర్వాత ఇరువురు నేతలూ హైదరాబాద్ వస్తారని, ఉగాది విరామం తర్వాత ఈనెల 26 నుంచి మళ్లీ యాత్ర ప్రారంభిస్తారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.



వచ్చే నెల రాష్ట్రానికి ప్రియాంక

హాథ్‌సే హాథ్ జోడో యాత్రల్లో భాగంగా మహిళలతో కలిసి యాత్రలో పాల్గొనేందుకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ తెలంగాణకు వస్తారని, ఏప్రిల్ మొదటి వారంలో ఆమె హైదరాబాద్‌కు వచ్చే అవకాశముందని తెలుస్తోంది.

క్లుప్తంగా...

ఎంసెట్‌కు దరఖాస్తుల వరద

- 1.20 లక్షలు దాటిన అప్లికేషన్లు
- ఇంజనీరింగ్‌కు 79 వేలపైనే..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటి వరకూ మొత్తం 1,23,780 దరఖాస్తులు అందినట్టు ఎంసెట్ కన్వీనర్ డీన్ కుమార్ తెలిపారు. ఇందులో 79,420 మంది ఇంజనీరింగ్ విభాగానికి, 44,230 మంది అగ్రికల్చర్, మెడికల్ విభాగానికి జరిగే ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకున్నట్టు వెల్లడించారు. ఇంజనీరింగ్, మెడికల్ రెండు విభాగాలకూ 130 మంది దరఖాస్తు చేసుకున్నట్టు పేర్కొన్నారు. గత ఏడాది 1,61,552 మంది ఇంజనీరింగ్‌కు, 88,156 మంది మెడికల్, అగ్రికల్చర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఎంసెట్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఏప్రిల్ 10 వరకూ గడువుండటంతో దరఖాస్తులు గత ఏడాది సంఖ్యను మించిపోతాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకూ ఇతర రాష్ట్రాలకు చెందిన 10 వేల మంది దరఖాస్తు చేసినట్టు తెలిపారు. ఎంసెట్ పరీక్షలు మే 7 నుంచి 11 వరకూ జరుగుతాయి.

ఇంటర్ సబ్జెక్టు పరీక్షలు షురూ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఇంటర్ సబ్జెక్టులకు పరీక్ష జరిగింది. ఈ నెల 15 నుంచి పరీక్షలు ప్రారంభమైనా, ఇప్పటి వరకు లాంగ్వేజ్ పరీక్షలే జరిగాయి. మొదటి సంవత్సరం మేథ్స్, బాటనీ, పొలిటికల్ సైన్స్ పేపర్లకు మొత్తం 5,20,030 మంది దరఖాస్తు చేసుకుంటే, 4,95,044 మంది హాజరయ్యారు. 24, 986 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. సోమవారం జరిగిన పరీక్షలో నలుగురు మాల్ ప్రాక్టీసింగ్‌కు పాల్పడినట్టు ఇంటర్ బోర్డ్ తెలిపింది.

విద్యార్థులకు అండగా ఉంటాం

కాసాని జ్ఞానేశ్వర్



సాక్షి, హైదరాబాద్: విద్యార్థి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాలకు తెలంగాణ తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. తెలంగాణ విద్యార్థి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సభ్యులు సోమవారం ఎన్టీఆర్ భవన్‌లో జ్ఞానేశ్వర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మార్చి 25న నిర్వహించే చలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థి, నిరుద్యోగ యువత చేపట్టే కార్యక్రమాలకు టీటీడీపీ మద్దతుగా నిలిచి, తన సహకారం అందిస్తుందని అన్నారు.

లీకేజీ కేసులో ఏ4 నిందితుడి ఉద్యోగం తొలగింపు

కుల్కచర్ల: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో ఏ4గా ఉన్న డాక్యానాయక్‌ను విధుల నుంచి తొలగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పేపర్ లీకేజీలో కీలకంగా వ్యవహరించిన రేణుక భర్త డాక్యానాయక్ వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలో ఉపాధిహామీ విభాగంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా(కాంట్రాక్ట్) విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారుల ఆదేశానుసారం సోమవారం డాక్యానాయక్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఎంపీడీఓ నాగవేణి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అన్నీ కొత్తగానే..!

▶ మొదటి పేజీ తరువాయి

టీఎస్‌పీఎస్సీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో పరీక్షకు వారం ముందు కొత్త నంబర్లతో అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. అభ్యర్థులకు కొత్తగా పరీక్ష కేంద్రాలు కేటాయించనున్నారు. కొత్త ప్రశ్నపత్రాలను కూడా రూపొందించనున్నారు. కమిషన్ రహస్య కంప్యూటర్లలోని సమాచారం లీక్ కావడంతో అన్ని ప్రశ్నపత్రాలు మారనున్నాయి. ఈ మేరకు కొత్త ప్రశ్నలతో ప్రశ్నపత్రాల తయారీకి నిపుణులకు సూచనలు అందినట్లు సమాచారం. ప్రశ్నపత్రాల్లో జంబ్లింగ్ విధానాన్ని అనుసరించే అంశాన్నీ అధికారులు పరిశీలిస్తున్నారు. గత పరీక్షల తాలూకు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని... ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా అత్యంత గోప్యంగా ఈ ప్రక్రియ నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

‘లీకేజీ’లో పొలిటికల్ ట్విస్ట్

కేటీఆర్ పీఏపై ఆరోపణలు చేసిన రేవంత్‌రెడ్డికి సిట్ సమన్లు

- రేపు విచారణకు హాజరై ఆధారాలు సమర్పించాలని ఆదేశం
- రేవంత్ ఇంటి గోడకు సమన్లు అతికించిన పోలీసులు
- బండి సంజయ్‌తోపాటు ఇతర నేతలకూ సమన్లు జారీచేసే అవకాశం
- మూడోరోజూ నిందితులను విచారించిన సిట్ అధికారులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పరీక్ష పేపర్ల లీకేజీ స్కామ్‌లో పొలిటికల్ ట్విస్ట్ చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో అనేక ఆరోపణలు చేసిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సోమవారం సమన్లు జారీ చేసింది. ఆయన తన ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని, బుధవారం ఉదయం 11 గంటలకు సిట్ విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. లీకేజీ స్కామ్ వెలుగులోకి వచ్చిన నాటి నుంచి ఈ అంశంపై రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు వస్తూనే ఉన్నాయి. బీఆర్‌ఎస్–కాంగ్రెస్–బీజేపీ నేతలు ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. ఇందులో భాగంగా రేవంత్‌రెడ్డి సైతం ఆరోపణలు చేశారు. మంత్రి కేటీఆర్ పీఏ తిరుపతి రెడ్డి ప్రమేయాన్ని శంకించిన ఆయన.. విదేశాల నుంచి వచ్చి పరీక్ష రాసి ఉత్తీర్ణులైన వారిపైనా సందేహాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

గాంధారిలో విలేకరుల సమావేశం ఆధారంగా...

రేవంత్‌రెడ్డి ఆదివారం కామారెడ్డి జిల్లా గాంధారిలో మీడియాతో మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీలో పనిచేస్తున్న వాళ్లు పరీక్షలు రాయడంపై, 2016లో ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన 25 మందికి గ్రూప్–1 ఉద్యోగాలు రావడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. కేసులో రెండో నిందితుడిగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి.. కేటీఆర్ పీఏ తిరుపతి రెడ్డికి సన్నిహితుడని, సిట్ అధికారి కేటీఆర్ బావమరిదికి స్నేహితుడని ఆరోపించారు. అలాగే, జగిత్యాల జిల్లా మల్యాల మండలానికి చెందిన 100 మంది గ్రూప్–1 ప్రిలిమ్స్ రాశారని, వీరికి 103 కంటే ఎక్కువ మార్కులు వచ్చాయన్నారు. రాజశేఖర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి అదే ప్రాంతానికి చెందినవారని ఆరోపించారు. వీటిని పరిగణలోకి తీసుకున్న సిట్ సోమవారం రేవంత్‌కు సమన్లు జారీ చేసింది. సీఆర్పీసీ సెక్షన్ 91 కింద సిట్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఇచ్చిన సమన్లను పోలీసులు రేవంత్‌రెడ్డి ఇంటికి తీసుకెళ్లారు. రేవంత్ అందుబాటులో లేకపోవడంతో సమన్లను ఇంటి గోడకు అతికించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తోపాటు మరికొందరు నేతలకూ నోటీసులు, సమన్లు జారీ చేసేందుకు సిట్ సన్నాహాలు చేస్తోంది.

జూన్ నుంచి పేపర్ల కోసం ప్రయత్నాలు

పేపర్ల లీకేజీ నిందితులుగా ఉన్న 9 మందిని సోమవారం సీసీఎస్ నుంచి హిమాయత్‌నగర్‌లోని సిట్ కార్యాలయానికి తీసుకువెళ్లి 8 గంటలపాటు అధికారులు ప్రశ్నించారు. దీంతో పలు కీలకాంశాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. టీఎస్‌పీఎస్సీ సిస్టమ్ అడ్మిన్‌గా ఉన్న రాజశేఖర్‌రెడ్డి అక్కడి ఉద్యోగులు, అధికారులకు యూజర్ ఐడీలు తయారు చేసి ఇచ్చాడు. ఎవరికి ఇబ్బంది వచ్చినా ఇతడే వెళ్లి సరిచేసేవాడు. ఈ నేపథ్యంలోనే కస్టోడియన్ శంకరలక్ష్మి, మరికొందరి యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్స్ ఇతడికి తెలిశాయి. గ్రూప్–1 కోసం దరఖాస్తు చేసుకున్న ప్రవీణ్ ఆ ప్రశ్న పత్రం ఇవ్వాలని గత జూన్ నుంచి రాజశేఖర్‌ను కోరుతున్నాడు. అతడి కోసమే శంకరలక్ష్మి సిస్టమ్‌ను ల్యాన్ ద్వారా యాక్సెస్ చేయడం మొదలెట్టాడు. ఆమె లేని సమయంలో కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌లోకి వెళ్లి రాజశేఖర్ కంప్యూటర్ ఆన్ చేసి వచ్చేవాడు. ప్రవీణ్ కంప్యూటర్ నుంచి ల్యాన్ ద్వారా ఆ కంప్యూటర్‌ను యాక్సెస్ చేసి ప్రశ్నపత్రాల కోసం వెతికేవాడు. ఈ క్రమంలోనే గత అక్టోబర్ మొదటివారంలో గ్రూప్–1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రం, గత నెలలో మిగిలిన పరీక్షలకు ప్రవీణ్ చేతికి వచ్చాయి. దీంతో శంకరలక్ష్మి పుస్తకంలో యూజర్ ఐడీ, పాస్‌వర్డ్స్ తస్కరించామని అంతకుముందు ప్రవీణ్, రాజశేఖర్ చెప్పిన అంశం అవాస్తవమని అధికారులు నిర్ధారించారు. ఈ వ్యవహారంలో సాంకేతిక అంశాలకు సంబంధించి ఫోరెన్సిక్ నివేదికలు రాకపోవడంతో కీలకాంశాల్లో స్పష్టత రావట్లేదని అధికారులు చెప్తున్నారు. నివేదికల కోసం ఎదురుచూస్తున్నారు.

వంద మార్కులు ఎందరికి?

- పరీక్ష రాసిన ఉమ్మడి జిల్లా ఎన్‌ఆర్‌ఐలకు ముందుగానే ప్రశ్నపత్రం లీక్?
- ఆ దిశగా సిట్ విచారణ
- వివరాలు సేకరించిన బృందం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ సూత్రధారి రాజశేఖర్‌రెడ్డి స్వస్థలం జగిత్యాల పరిసర ప్రాంతాల్లో రోజుకో విషయం వెలుగులోకి వస్తోంది. పరీక్షరాసిన ఈ ప్రాంతాల్లోని ఎన్‌ఆర్‌ఐలకు పేపర్ ముందుగానే లీకైందని సిట్ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో వారిని కూడా పిలిపించే అవకాశాలు లేకపోలేదని సీనియర్ పోలీసు అధికారులు చెబుతున్నారు. నిందితులుగా పిలిస్తే, వారు ఇండియాకు వచ్చే అవకాశాలు చాలా తక్కువనీ అందుకే, వీరిని బాధితులుగా చూపించి, విచారణకు హాజరయ్యేలా వ్యూహం సిద్ధం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు వారికి నోటీసులు ఇస్తారని సమాచారం. ఇప్పటికే దాదాపు 28 మందితో కూడిన జాబితా రూపొందించినట్లు సమాచారం. వీరిలో మెజారిటీ అభ్యర్థులు జగిత్యాల జిల్లాకు చెందిన వారిగా ప్రచారం జరు గుతుండటంతో పోలీసులు ఆ దిశగా దృష్టి సారించారు. గతేడాది అక్టోబరులో ఎవరెవరు జగిత్యా లకు వచ్చారు? వారి పాస్‌పోర్టు, ప్రయాణ తేదీలకు సంబంధించిన వివరాలను జగిత్యాల పోలీసులు ఇప్పటికే సేకరించి సిట్‌కు పంపినట్లు తెలిసింది.

తక్కువ జీతానికి ఎందుకు వస్తారు?

లండన్, న్యూజిలాండ్, ఇతర యూరోప్, అరేబియా దేశాలకు వలస వెళ్లిన భారతీయుల్లో ఉన్నత విద్యావంతులు ఎంతలేదన్నా.. వారానికే 2,000 డాలర్ల వరకు సంపాదిస్తారు. మెరుగైన జీవితం కోసం ఒకసారి విదేశాలకు వెళ్లినవారంతా.. ఉన్నత ఉద్యోగాలు పొందాక.. తిరిగి తక్కువ (రూ.లక్ష లోపు) వేతనాలకు ఎందుకు తిరిగి మాతృదేశానికి వచ్చారు? అన్న విషయాలపై కూడా సిట్ దృష్టి పెట్టింది. వీరికి ఎవరైనా సర్కారు ఉద్యోగం గ్యారెంటీ అన్న అభయం ఇచ్చారా? అన్న కోణంలో కూపీ లాగుతున్నారు. రాజశేఖర్ మిత్రగణంలో అధిక శాతం ఎన్‌ఆర్‌ఐలే ఉండటం వల్ల గ్రూప్–1 పరీక్ష రాసి, 100 మార్కులకుపైగా తెచ్చుకున్న ఎన్‌ఆర్‌ఐలను పిలిపించి ప్రశ్నించాలన్న యోచనలో ఉన్నారు.

బండి వ్యాఖ్యలతో కలకలం

లీకేజీ వ్యవహారంలో బీఆర్‌ఎస్ సర్పంచుల కుమారులు, సింగిల్ విండో చైర్మన్ కుమారుడితోపాటు ఒక జడ్పీటీసీ బాడీగార్డ్ కుమారుడు క్వాలిఫై అయ్యారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో జగిత్యాల, కరీంనగర్‌లోని ఆయా పదవులు, పోస్టుల్లో ఉన్న వారంతా ఉలిక్కిపడుతున్నారు.

సిట్.. పారదర్శక దర్యాప్తు చేయలేదు

హైకోర్టులో కాంగ్రెస్ అడిషనల్ అఫిడవిట్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో మంత్రి కేటీఆర్ పీఏ తిరుపతి పాత్రపై దర్యాప్తు చేయాలని కోరుతూ హైకోర్టులో కాంగ్రెస్ పార్టీ అడిషనల్ అఫిడవిట్ దాఖలు చేసింది. పేపర్ లీక్ కేసును కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ) లేదా సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కు అప్పగించాలని కోరుతూ కాంగ్రెస్ హైకోర్టులో ఇప్పటికే పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనికి అనుబంధంగా ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ పిటిషన్ దాఖలు చేశారు. పేపర్ లీకేజీ కేసులో తిరుపతి పాత్రపై దర్యాప్తు జరిపించాలని కోరారు. గ్రూప్–1 పేపర్‌లో ఒకే జిల్లాకు చెందిన 20 మందికి అధిక మార్కులు రావడం అనుమానంగా ఉందని చెప్పారు. లీక్ ఘటనలో ఇద్దరి పాత్ర మాత్రమే ఉందని మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సిట్ దర్యాప్తును ప్రభావితం చేసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సిట్ పారదర్శక దర్యాప్తు చేసే అవకాశం లేదని చెప్పారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. అయితే పిటిషనర్ వాయిదా కోరడంతో మంగళవారానికి వాయిదా వేసింది.

కేటీఆర్‌కు సమన్లు జారీ చేయాలి

- లీకేజీపై విచారణ జరగకముందే తప్పు ఇద్దరిదని ఎలా తెలుస్తాడు
- ఏ అధికారంతో మాట్లాడారో తేల్చాలి
- తప్పులను ఎత్తి చూపిన నాకు నోటీసులిస్తారా
- సిట్ దర్యాప్తుపై అనుమానాలున్నాయి
- సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



మీడియా సమావేశంలో రేవంత్

సాక్షి, కామారెడ్డి: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలను లీకేజీ చేసిన వ్యవహారంలో ప్రభుత్వం అసలు నేరస్తులను కాపాడే ప్రయత్నం చేస్తోందని, విచారణ జరగకముందే ఇద్దరే నిందితులంటూ తీర్పు వెల్లడించిన మంత్రి కేటీఆర్‌కు సమన్లు జారీ చేసి విచారించాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా దుర్కిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నేరస్తులను కాపాడే ప్రయత్నం చేస్తున్న మంత్రి కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వాల్సిన సిట్, తప్పులను ఎత్తి చూపిన తనకు నోటీసులు ఇవ్వడం ఊహించిందేనన్నారు. సిట్ నోటీసులను స్వాగతిస్తున్నానని, రాజ్యాంగాన్ని గౌరవించి నోటీసులకు స్పందిస్తానని చెప్పారు. కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వకుంటే తాము న్యాయపోరాటం చేస్తామన్నారు. ఐటీ శాఖకు సంబంధం లేదంటూ కేటీఆర్, లీకేజీని తామే బయటపెట్టామని గంగుల కమలాకర్‌లు అంటున్నారని రేవంత్ పేర్కొన్నారు. లీకేజీ వ్యవహారం ఇద్దరు వ్యక్తులకు సంబంధించిందని కేటీఆర్ మాట్లాడుతున్నారని, ఇద్దరు వ్యక్తులు అంటే కేసీఆర్, కేటీఆరేనని వ్యాఖ్యానించారు.

ఆ ముగ్గురినీ ఎందుకు విచారించడం లేదు?

టీఎస్‌టీఎస్ చైర్మన్‌గా జగన్మోహన్‌రావును 2021లో కేటీఆర్ నియమించారని, రాజశేఖర్‌రెడ్డిని ఔట్‌సోర్సింగ్ ద్వారా టీఎస్‌టీఎస్ నియమించిందన్నారు. కేటీఆర్ పీఏనే రాజశేఖర్‌రెడ్డి నియామకానికి చొరవ చూపాడన్నారు. 2015 లో ఘంటా చక్రపాణి చైర్మన్‌గా ఉండగా మంత్రి కేటీఆర్ టీఎస్‌పీఎస్సీని విజిట్ చేశారంటూ అప్పటి ఫొటోలు చూపించారు. చైర్మన్, సెక్రెటరీ, సెక్షన్ ఆఫీసర్‌లకు తెలియకుండా రాజశేఖర్, ప్రవీణ్‌లు ప్రశ్నపత్రాలను ఎలా హ్యాక్ చేయగలిగారని రేవంత్ నిలదీశారు. ఈ కేసులో సెక్షన్ ఆఫీసర్ శంకర లక్ష్మి, చైర్మన్, సెక్రెటరీలను ఎందుకు విచారించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలన్నీ స్థానికులకు అని చెప్పిన సీఎం కేసీఆర్ రాజమండ్రికి చెందిన ప్రవీణ్ అనే వ్యక్తిని కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలోకి తీసుకుని కీలక బాధ్యతలు అప్పగించారని ఆరోపించారు. గతంలో సిట్‌కు అప్పగించిన కేసులన్నీ అటకెక్కాయని, అందుకే సిట్టింగు జడ్జితోనైనా, సీబీఐతోనైనా విచారణ జరిపించాలన్నారు.

బాన్సువాడలో పోచారం అక్రమాలు

కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఆరు నెలల్లో బోధన్ చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని రేవంత్‌రెడ్డి హామీనిచ్చారు. సోమవారం రాత్రి బాన్సువాడ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడలో స్పీకర్ పోచారం కుటుంబం అక్రమాలకు పాల్పడుతోందని, వచ్చే ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. సభలో మాజీ మంత్రులు షబ్బీర్‌అలీ, సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీలు సురేశ్‌షెట్కార్, రాజయ్య, అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే గంగారం, నాయకులు కైలాస్ శ్రీనివాస్, మానాల మోహన్‌రెడ్డి, కాసుల బాలరాజు తదితరులున్నారు.

తెలుగుభాషలోనూ జేఎల్ ప్రశ్నపత్రం

ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ కాలేజీల లెక్చరర్ పోస్టుల నియామక పరీక్షల్లో రెండోపేపర్‌కు సంబంధించిన ప్రశ్నపత్రాన్ని ఆంగ్లంతోపాటు తెలుగుభాషలోనూ ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. పరీక్ష విధానాన్ని మార్చే అధికారం కమిషన్‌కు లేదని స్పష్టం చేసింది. జూనియర్ లెక్చరర్ పోస్టుల నియామక పరీక్షల్లో పేపర్–2 ప్రశ్నపత్రాన్ని తెలుగులో ఇవ్వడంలేదని పేర్కొంటూ ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలానికి చెందిన విజయ్‌కుమార్, మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. టీఎస్పీఎస్సీ నిర్ణయం కారణంగా తెలుగు మాధ్యమ అభ్యర్థులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది బూర రమేశ్ వాదనలు వినిపిస్తూ 2004, 2008 నోటిఫికేషన్లలో రెండు భాషల్లోనూ ప్రశ్నపత్రం ఇచ్చారని, కాలేజీల్లో మాధ్యమం పరంగా ఖాళీలను వెల్లడించలేదన్నారు. మొత్తం 16 సబ్జెక్టులకు తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రశ్నపత్రాలు ఇవ్వడం కష్టసాధ్యమైన పని అని కమిషన్ తరఫు న్యాయవాది ఎం.రాంగోపాల్‌రావు వెల్లడించారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. గతంలో రెండు భాషల్లో పరీక్షలు నిర్వ హించి, ఇప్పుడు సాధ్యంకాదనడాన్ని తప్పుబట్టారు. అభ్యర్థుల ఎంపికకు ఎక్కువ మార్కులున్న పేపర్ 2 ప్రశ్నప్రతం ప్రధానం కానుందన్నారు. ఈ నేపథ్యంలో దాన్ని తెలుగు, ఆంగ్ల భాషల్లో ఇవ్వాలని ఉత్తర్వులిచ్చారు.

నా భర్తను చిత్రహింసలు పెడుతున్నారు

పేపర్ లీకేజీ నిందితుడు రాజశేఖర్ భార్య సుచరిత హైకోర్టులో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో తన భర్త రాజశేఖర్‌ను నేరం ఒప్పుకోవాలని పోలీసులు చిత్రహింసలు పెడుతున్నారని అతని భార్య సుచరిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ‘నా భర్తను ఈ నెల 11న పోలీసులు అరెస్ట్ చేశారు. 14వ తేదీ వరకు రిమాండ్ చేయలేదు. నేరం ఒప్పుకోమని పోలీసులు నా భర్తపై ఒత్తిడి తెస్తున్నారు. నా భర్తను పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. అక్కడ ఆయనను చూసి దిగ్భ్రాంతి చెందాను. ఆ సమావేశం నుంచి వెళ్లేటప్పుడు నా భర్త కుంటుతూ నడుస్తున్నారు. పోలీసుల చిత్రహింసల కారణంగానే ఆ పరిస్థితి వచ్చింది. ఆరోగ్య పరిస్థితి తెలుకునేందుకు రాజశేఖర్‌ను ఆసుపత్రిలో చేర్చాలి. ఆయనను సిట్ విచారణ చేస్తోంది. ఆ వీడియోను బయటపెట్టాలి. పోలీసుల చిత్ర హింసలపై, పేపర్ లీక్‌పై స్వతంత్ర దర్యాప్తు సంస్థ లేదా కమిషన్‌తో విచారణ జరిపించాలి. నా భర్తపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించకుండా ఆదేశాలు ఇవ్వాలి’అని ఆమె పిటిషన్‌లో కోరారు. ప్రతివాదులుగా డీజీపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సిట్, హైదరాబాద్ నగర డీసీపీలను పేర్కొన్నారు. ఆమె పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. అభ్యంతరాలు ఉంటే సంబంధిత కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది.

24,25 తేదీల్లో నిరుద్యోగ నిరసన దీక్ష

ఓయూ వేదికగా కాంగ్రెస్ నిరసన



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేయనుంది. లీకేజీ ఉదంతంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈనెల 24, 25 తేదీల్లో ‘నిరుద్యోగ నిరసన దీక్ష’నిర్వహించాలని నిర్ణయించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద రెండు రోజుల పాటు ఈ ఆందోళన నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఆందోళనపై చర్చించేందుకు సోమవారం టీపీసీసీ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో ఉస్మానియా వర్సిటీ విద్యార్థి సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. నిరుద్యోగ నిరసన దీక్ష సమన్వయకర్త, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్, అధికార ప్రతినిధులు అద్దంకి దయాకర్, సుధీర్‌రెడ్డిలతోపాటు పలువురు ఓయూ విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి కొత్త కమిషన్ ఏర్పాటు చేయాలని మానవతారాయ్ అన్నారు. లీకేజీ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటు న్న వారికి, నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్న వారికి నోటీసులు ఇవ్వకుండా రేవంత్‌రెడ్డికి సిట్ నోటీసులు ఇవ్వడమేంటని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ ప్రశ్నించారు.

కేటీఆర్‌కు నోటీసులిచ్చే దమ్ముందా?

సిట్‌ను ప్రశ్నించిన బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కుట్ర వెనుక తనపాత్ర ఉందంటూ ఆరోపణలు చేస్తున్న మంత్రి కేటీఆర్‌కు.. ఆ ఆధారాలు సమర్పించాలని నోటీసులిచ్చే దమ్ము సిట్‌కు ఉందా? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ ప్రశ్నించారు. తనపై చేస్తున్న ఆరోపణలకు సంబంధించి కేటీఆర్‌ను పిలిచి విచారించే ధైర్యముందా అని నిలదీశారు. ఈ లీకేజీ కేసులో సిట్ నోటీసుల పేరుతో ప్రతిపక్ష పార్టీల నేతల నోరు నొక్కేసే కుట్రకు సీఎం కేసీఆర్ తెరదీశారని సోమవారం ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ కుట్రకు కారకులైన వారిని వదిలేసి విపక్షాలకు నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. సిట్ నోటీసులకు, విచారణకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తన కొడుకు, బిడ్డ తప్పుచేసినా ఉపేక్షించబోనని అసెంబ్లీలో ప్రకటించిన కేసీఆర్‌కు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, విపక్షాలకు నోటీసులు ఇవ్వడం కంటే ముందే కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన కొడుకు తప్పు చేయలేదని కేసీఆర్ భావిస్తే తక్షణ మే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అప్పుడే తమవద్ద ఉన్న సమాచారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ జేబు సంస్థగా సిట్ మారిందని, గతంలో డ్రగ్స్, నయీం డైరీ, మియాపూర్ భూములపై సిట్‌లు జరిపిన విచా రణలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆ కేసులను నీరుగార్చడంతోపాటు కేసీఆర్‌కు ప్రయోజనం చేకూర్చేలా సిట్‌లు పనిచేశాయని ఆరోపించారు. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీ కేసును సీబీఐకి అప్పగించాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



చిక్కడపల్లి(హైదరాబాద్): టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసును స్వతంత్ర ప్రతిపత్తి గల సీబీఐకి అప్పగించాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడి త్యాగరాయ గానసభలో జరిగిన ‘నిరుద్యోగులకు భరోసా’సదస్సులో ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ అయినప్పుడు, దాని చైర్మన్, సభ్యులు స్పందించకుండా మంత్రి కేటీఆర్ ఎందుకు స్పందిస్తున్నారని ప్రవీణ్ ప్రశ్నించారు. 30 లక్షలమంది నిరుద్యోగ అభ్యర్థుల జీవితాలతో ముడిపడి ఉన్న సమస్య కాబట్టి ప్రశ్నపత్రాల లీకేజీ దోషులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ కుటుంబంపైనే ఆరోపణలు వస్తున్నందున సీఎం స్పందించి కేసును సీబీఐకి అప్పగించేలా ప్రకటన చేయాలని కోరారు. బోర్డు చైర్మన్ డాక్టర్ జనార్దన్‌రెడ్డిని, సభ్యులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కేసును ఎంతసేపూ ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిల చుట్టే తిప్పుతున్నారని, వారితోపాటు చాలామంది దోషులుగా ఉన్నారని ఆరోపించారు. జూనియర్ లెక్చరర్ నియామక పరీక్షల ప్రశ్నపత్రాలు కూడా లీకైనట్లు వదంతులు వస్తున్నాయని, వాటిని కూడా మార్చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను, 30 లక్షలమంది నిరుద్యోగులను పట్టించుకోకుండా, సీఎం తన కూతురు కవితను కాపాడుకోవడానికి మంత్రులు, ఎమ్మెల్యేలను ఢిల్లీకి పంపారని ఆరోపించారు.




తరగతి గదిలో మిర్చి ఆరబోత.. విద్యార్థులు బయట

పలిమెల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం పంకెన ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదిలో మిర్చి ఆరబోశారు. సోమవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు తమ తరగతి గదిలోకి వెళ్లగా నిండుగా మిర్చి ఉండడంతో అవాక్కయ్యారు. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో వారు పాఠశాలకు చేరుకుని ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. ఈ మిర్చి ఎవరిది అనేది హెచ్‌ఎం కూడా చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తరువాత సదరు వ్యక్తి వచ్చి మిర్చిని తీసుకెళ్లిపోయాడు. కాగా, మిర్చి అ పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌కు సంబంధించిందేనని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

డెడ్ స్టోరేజీకి ‘శ్రీశైలం’

- 36 టీఎంసీలకు పడిపోయిన నిల్వలు
- 813 అడుగులకు చేరిన నీటిమట్టం
- 855 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకున్న తెలుగు రాష్ట్రాలు



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం జలాశయంలో నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరువయ్యాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు పోటాపోటీగా సాగునీరు, విద్యుదుత్పత్తి అవసరాలకు జలాశయం నుంచి నీళ్లను వాడుకోవడంతో నిల్వలు అడుగంటిపోయాయి. జలాశయం గరిష్ఠ నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, సోమవారం ఉదయం నాటికి కేవలం 36.6 టీఎంసీలు మిగిలాయి. మరో 2 టీఎంసీల జలాలను వాడుకుంటే నీటిమట్టం 810 అడుగులకు చేరి నిల్వలు డెడ్ స్టోరేజీకి పడిపోనున్నాయి.

➡ జలాశయంలో నీటిమట్టం 810 అడుగులు, నిల్వలు 34 టీఎంసీలకు పడిపోతే డెడ్ స్టోరేజీకి చేరినట్టు భావిస్తారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 813.8 అడుగులకు పడిపోయింది. సాగునీటి అవసరాలకు 854 అడుగులు, విద్యుదుత్పత్తి అవసరాలకు 834 అడుగుల కనీస నీటి మట్టం ఉండాలని నిబంధనలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా తెలంగాణ 2,400 క్యూసెక్కులను, ఏపీ మల్యాల నుంచి హంద్రీ నీవా సుజల స్రవంతి(హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్)కి 960 క్యూసెక్కులు, ముచ్చుమర్రి నుంచి కేసీ కాల్వకు 490 క్యూసెక్కులను తరలించుకుంటున్నాయి. ఈ లెక్కన శ్రీశైలం నుంచి రెండు రాష్ట్రాలకు రోజుకు 3,850 క్యూసెక్కులు చొప్పున 3 రోజులకు 1 టీఎంసీ నీటిని తరలించుకుంటున్నాయి. నీటి వినియోగం ఇలానే కొనసాగితే మరో ఆరు రోజుల్లో శ్రీశైలం జలాశయంలో నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరుకోనున్నాయని నీటి పారుదల శాఖ అధికారవర్గాలు తెలిపాయి.

సాగర్ జలాశయంలోనూ అదే పరిస్థితి

నాగార్జున సాగర్ జలాశయంలోనూ నిల్వలు అడుగంటిపోతున్నాయి. సాగర్‌లో డెడ్ స్టోరేజీకి ఎగువన 54 టీఎంసీలు మాత్రమే మిగిలాయి. జలాశయం నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, సోమవారం నాటికి 178 టీఎంసీల నిల్వలు మాత్రమే మిగిలి ఉన్నాయి. సాగర్ కుడి, ఎడమ కాల్వల ద్వారా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు 16,255 క్యూసెక్కులను తరలించుకుంటున్నాయి.

భారీగా పెరిగిన జల వినియోగం !

శ్రీశైలం, సాగర్‌లలో మార్చి 10 నాటికి 979.28 టీఎంసీల జలాల లభ్యత ఉంది. అందులో ఏపీకి 646.99 టీఎంసీలు, తెలంగాణకు 333.09 టీఎంసీల వాటాలున్నాయి. ఏపీ 624.99 టీఎంసీలు (73 శాతం), తెలంగాణ 230.31 టీఎంసీలు(26 శాతం) కలిపి మొత్తం 855 టీఎంసీలను వాడుకున్నాయి. ఏపీకి 21.60 టీఎంసీలు, తెలంగాణకు 102.77 టీఎంసీల వాటాలు మిగిలి ఉన్నాయి.

హైకోర్టు తీర్పు అమలు చేసి ఉద్యోగాలివ్వండి

గజ్వేల్‌లో డీఎస్సీ–2008 మెరిట్ అభ్యర్థుల మహాధర్నా

గజ్వేల్: డీఎస్సీ–2008 మెరిట్ అభ్యర్థులకు సంబంధించి గతేడాది సెప్టెంబర్ 27న హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేసి తమకు ఉద్యోగాలివ్వాలని డీఎస్సీ–2008 రాష్ట బీఈడీ మెరిట్ అభ్యర్థుల అసోసియేషన్ అధ్వర్యంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సోమవారం మహాధర్నా చేపట్టారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్ ముందు నిర్వహించిన ఈ ధర్నాకు రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన అభ్యర్థులు తరలివచ్చారు. ముందుగా పట్టణంలోని ప్రధాన రహదారిపై నినాదాలు హోరెత్తిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి, అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించారు. ఆ తర్వాత నిర్వహించిన ధర్నాలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, కోశాధికారి కొమ్ము యాదయ్య, కార్యదర్శి మేరుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఫరీద్, మహిళా ప్రతినిధులు పరమేశ్వరి, పుష్ప, సుజాతలు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తమ సమస్యలను నేరుగా తెలియజేయడానికే ఆయన సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో మహాధర్నా నిర్వహించినట్లు తెలిపారు. డీఎస్సీ–2008లో మెరిట్ పొంది ఉద్యోగాలు పొందే సమయంలో దొంగచాటుగా ఎలాంటి చట్టబద్ధతలేని జీవోనెం. 28 తీసుకొచ్చి తమ నియామకాలు ఆపేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ జీఓ ప్రకారం ఎస్జీటీ పోస్టుల్లో 30 శాతం ప్రత్యేకంగా డీఈడీ అభ్యర్థులకు ఇవ్వాలని పేర్కొనడం, మిగిలిన 70 శాతంలోనూ తమతోపాటు డీఈడీ అభ్యర్థులకు అవకాశం ఇవ్వడం వల్ల తమకు అన్యాయం జరిగిందని వాపోయారు. తమకు వెంటనే ఉద్యోగాలివ్వాలని హైకోర్టు స్పష్టంగా తీర్పునిచ్చినా, ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. ధర్నాకు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు సంఘీభావం ప్రకటించారు.



“ ఒక దేశ సంస్కృతి అనేది దాని జనాల హృదయాలు, ఆత్మల్లో ఉంటుంది.
– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, మార్చి, 21

ఖలిస్తాన్ 2.0

శనివారం నుంచి మూడు రోజులుగా నిరంతర గాలింపు. అయినా దొరకలేదు. ఇప్పటికి వందమం దికిపైగా అతని సహచరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం పొద్దుగూకాక కూడా నిందితుడు పోలీసుల గస్తీ కళ్ళ నుంచి తప్పించుకొని, తిరుగుతూనే ఉన్నాడు. ‘వారిస్ పంజాబ్ దే’ సంస్థ అధినేత అమృత్‌పాల్ సింగ్ పరారీ, అందుకు దారి తీసిన పరిస్థితులు చూస్తే, నలభై ఏళ్ళ నాటి తీవ్రవాద సంక్షుభిత పంజాబ్ పరిస్థితులు పునరావృతమవుతున్నాయన్న ఆందో ళన కలుగుతోంది. సిక్కులకు సార్వభౌమాధికార దేశం కావాలన్న ఖలిస్తానీ జెండాను భుజానికెత్తు కున్న యువనేత అమృత్‌పాల్ ముఠా బలప్రదర్శన చేసి,అమృత్‌సర్‌లో పోలీస్‌స్టేషన్‌పై ఫిబ్రవరి 23న దాడి చేసి నెలవుతున్నా, నిన్నటి దాకా కళ్ళు తెరవని ‘ఆప్’ సర్కార్ వైఫల్యం వెక్కిరిస్తోంది.

గాలివార్తలు సుడిగాలిలా వైరల్ అవుతున్న వేళ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇంటర్నెట్ సేవల్ని మంగళవారం మధ్యాహ్నం దాకా పాలకులు నిలిపివేయాల్సి వచ్చిందంటే పరిస్థితిని ఊహిం చుకోవచ్చు. రూపం మార్చుకున్న సరికొత్త ఖలిస్తాన్ 2.0 విజృంభిస్తోందా? 1980–90ల్లోలా పంజాబ్ మళ్ళీ అగ్నిగుండం కానుందా? హత్యానేరం, పోలీసులపై దాడి సహా కనీసం 7 క్రిమినల్ నేరారోపణలున్న అమృత్‌పాల్ ఇప్పుడు పంజాబ్‌లో మళ్ళీ పుంజుకుంటున్న వేర్పాటువాదానికి కేంద్రబిందువయ్యాడు. మాదక ద్రవ్యాల అలవాటును మాన్పించడానికి పనిచేసే డీ-ఎడిక్షన్ కేంద్రాలనూ, అలాగే ఓ గురుద్వారానూ అమృత్‌పాల్ తన అడ్డాగా చేసుకున్నాడట. ఆ స్థావరాల్లో కత్తులు, తుపాకీలు, తూటాలు... పోగేసి, ఆత్మాహుతి దాడులకు యువతరాన్ని సిద్ధం చేస్తున్నాడని గూఢచారి వర్గాల సమాచారం. ఆయుధాలు – బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు దొరకడం, సాయుధ పోరాటం ఇష్టం లేదంటూనే ‘ఆనంద్‌పూర్ ఖల్సా ఫోర్స్’ (ఏకెఎఫ్) పేరును ప్రాచుర్యంలో పెట్టడం లాంటి అమృత్‌పాల్ సమాచారంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి.

బంధువుల సాయంతో 20 ఏళ్ళ వయసులో దుబాయ్ వెళ్ళి, భారీ వాహనాల డ్రైవర్‌గా పని చేసి, నిరుడు భారత్‌కు తిరిగొచ్చిన ఓ యువకుడు అనూహ్యంగా ఈ స్థాయికి చేరడం చిత్రమే. నిన్నటి దాకా ఆధునిక వేషభాషల్లో ఉన్న 30 ఏళ్ళ అమృత్‌పాల్ ఇవాళ సాంప్రదాయిక సిక్కు వస్త్రధారణలో, చేతిలో కృపాణంతో, ఖలిస్తానీ ఉద్యమానికి వేగుచుక్క కావడం సహజ పరిణామం అనుకోలేం. ఈ ఖలిస్తాన్ అనుకూల ఉద్యమం వెనుక పాకిస్తానీ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ప్రమేయం ఉందన్న అనుమానం బలపడుతున్నది అందుకే. అతనికి నిధులెక్కడివన్నదీ ఆరా తీయాల్సిందే! ఇక, పలాయితుడిపై జాతీయ భద్రతా చట్టం విధిస్తారన్న వార్త పరిస్థితి తీవ్రతకు ఉదాహరణ.

1980లు, 90లలో అకాలీలు తీవ్రవాద ఆరోపణలతో అరెస్టయిన తమ అనుయాయుల విడుదల కోసం వీధికెక్కినట్టే, ఈ 2023లో అమృత్‌పాల్, ఆయన తోటి ఖలిస్తానీ మద్దతుదారులు తమ సహచరుడి విడుదల కోసం గత నెలలో వీధికెక్కారు. ఏడేళ్ళ వయసు నుంచే సాంప్రదాయిక సిక్కు ధార్మిక శిక్షణ పొందిన ఒకప్పటి ఖలిస్తానీ నేత జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలేకు భిన్నంగా, అలాంటి శిక్షణేమీ లేకుండా ఉన్నట్టుండి అలాగే వేషం కట్టి, మాట్లాడుతున్నాడు అమృత్‌పాల్. స్వీయ ప్రచారం మాటెలా ఉన్నా అతనిని ‘భింద్రన్‌వాలే 2.0’ అనలేం. సాయుధ అంగరక్షకుల నడుమ ఊరూరా తిరుగుతూ, రెచ్చగొడుతున్నాడు. 1984లో అమృత్‌సర్ స్వర్ణాలయంలో ఆపరేషన్ బ్లూస్టార్‌లో భింద్రన్‌వాలేను హతమార్చిన తర్వాత నాటి ప్రధాని ఇందిర, పంజాబ్ సీఎం బియాంత్ సింగ్‌లకు పట్టిన గతి నేటి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పంజాబ్ సీఎం మాన్‌లకు పడుతుందని తొడకొడుతున్నాడు. మానిన పాత గాయాల్ని మళ్ళీ కెలుకుతున్నాడు.

భారత్ పట్ల ఖలిస్తానీల విద్వేషం బ్రిటన్, ఆస్ట్రేలియా సహా వివిధ దేశాల్లో ఉన్నట్టుండి వెల్లువె త్తడం మరింత ఆందోళనకరం. బరి తెగించిన ఖలిస్తానీ దుండగులు లండన్ తదితర ప్రాంతాల్లో భారత రాయబార కార్యాలయాలపై దాడి చేయడం, జాతీయ జెండాను తొలగించడం దుస్సహం. రాయబార కార్యాలయానికి కాపుండాల్సిన ఆయా దేశాల ఉదాసీన వైఖరీ ముమ్మాటికీ తప్పే. అసలు మన బంగారం మంచిదైతేగా! పంజాబ్ సంపన్న రాష్ట్రమే కానీ, గత పదిహేనేళ్ళలో తీవ్రనిరుద్యోగంతో యువత తప్పుదోవ పడుతోంది. రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలకు వ్యతిరే కంగా 2020 – 21లో పంజాబీ సోదరులు పోరాటం సాగిస్తున్నప్పుడు దాన్ని సుదీర్ఘంగా సాగదీసిన కేంద్ర ప్రభుత్వ ఉదాసీనత సైతం అసంతృప్తి ప్రబలడానికి ఓ కారణం. హిందూ రాష్ట్రమనే భావనను పైకి తెస్తున్న పిడి వాదులూ, పరోక్షంగా ఖలిస్తానీల సిక్కురాజ్య వాదనకు ప్రేరేపకులే!

నిరుద్యోగ యువత అసంతృప్తి, రైతుల ఆగ్రహం, ‘ఉడ్తా పంజాబ్’గా మారిన రాష్ట్రంలో ఇట్టే దొరుకుతున్న మాదక ద్రవ్యాలు, పాక్ సరిహద్దుల నుంచి ఆయుధ ప్రవాహం, పాలకుల నిస్తేజం... అన్నీ కలసిన పంచకూట కషాయమే – పంజాబ్‌లో ప్రబలుతున్న దేశవ్యతిరేక కార్యకలాపాలు. జనబాహుళ్య అసంతృప్తిని తెలివిగా వాడుకుంటూ తన పునాదిని విస్తరించుకుంటున్న అమృత్ పాల్‌కు పాక్ అండతో సాగుతున్న విదేశీ ఖలిస్తానీ మద్దతుదారులు తోడవడం అగ్నికి ఆజ్యమే. తనను తాను అతిగా ఊహించుకుంటున్న ఈ వేర్పాటువాదిని ఆదిలోనే అడ్డుకోవాలి. మొగ్గలోనే తుంచకపోతే విభజనవాదం బ్రహ్మరాక్షసిగా మారి మింగేస్తుంది. కదం తొక్కాల్సిన పాలకులు కాలహరణం చేస్తే పంజాబ్‌లో మళ్ళీ పాత చీకటి రోజులు ముందుకొస్తాయి. పారా హుషార్!

ప్రజాస్వామ్యం పతనం కాకుండా...



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

భారతదేశంలో ప్రజాస్వామ్య విలువలు దారుణంగా పతనమయ్యాయని స్వీడన్ యూనివర్సిటీ అనుబంధ సంస్థ ‘వి–డెమ్’ వెల్లడించింది. పాత్రికేయుల మీద వేధింపుల సంఖ్య పెరిగిందని కూడా నమోదు చేసింది. పారిశుద్ధ్య కార్మికులకు సరైన రక్షణ కవచాలు లేక వారు ప్రాణాలు విడుస్తున్న ఉదాహరణలను చూస్తూనే వున్నాం. విష వాయు మాళిగల్లోకి వారిని ‘తోసి’ ప్రాణాలు తీసే పరిస్థితి ప్రపంచంలో ఎక్కడా చూడం. ఇలాంటి పరిస్థితుల్లో పండుగలు, పబ్బాలు కూడా పేద వర్గాల జీవితాల్లో నామమాత్రం అయిపోయాయి. ఇన్ని సమస్యలు దేశంలో ఉండగా, పాలక వ్యవస్థను ప్రజావసరాలు తీర్చడానికి వినియోగించేందుకు నడుం బిగించడం మానేసి న్యాయ వ్యవస్థను తటస్థం చేసేందుకు పాలక పక్షం యత్నిస్తోంది.

“2014 తర్వాత భారతదేశంలో ప్రజాస్వామ్య విలువలు దారుణంగా పతనమైనాయి. ఈ పతన దశ 1975 నాటి ఎమర్జెన్సీ కాలం పరిస్థితుల స్థాయికి 2022లో చేరుకుంది. 2014-2022 మధ్య కాలంలో ఇండియాలో ప్రజాస్వామ్య విలువల పతనం గ్రీస్, బ్రెజిల్, పోలెండ్, ఫిలిప్పీన్స్‌లలో పతన దశకు సమాన స్థాయిలో నమోదయింది.''

– అమలులో ఉన్న వివిధ రకాల ప్రజాస్వామ్యాల గురించి గోథెన్‌బర్గ్ నగరంలోని స్వీడన్ యూనివర్సిటీ అనుబంధ సంస్థ ‘వెరైటీస్ ఆఫ్ డెమోక్రసీ’ (క్లుప్తంగా వి-డెమ్) పరిశోధనలో ఈ సత్యాలు వెల్లడయ్యాయి. ‘హిందూ’ పత్రిక ‘డేటా పాయింట్’ విశ్లేషకుడు విఘ్నేశ్ రాధాకృష్ణన్ ఈ వివరాలను పొందుపరిచారు. (20 మార్చ్ 2023)


ఈ వెల్లడి ఇలా ఉన్న సమయంలోనే బీజేపీ ప్రభుత్వ న్యాయశాఖా మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటన చేస్తూ (19 మార్చ్ 2023)– భారతదేశంలో కొందరు రిటైర్డ్ (విశ్రాంత) న్యాయమూర్తులు భారత వ్యతిరేక ముఠాతో చేతులు కలిపి పనిచేస్తున్నారనీ, వీరు భారత న్యాయ వ్యవస్థ ప్రతిపక్ష పార్టీ పాత్ర వహించాలని చూస్తున్నారనీ ఆరోపించారు. ఇది చెల్లుబాటు కాదని కూడా అన్నారు. ‘ఇది మంత్రి బెదిరింపు’ అని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ ఖండించారు!

అట్టే చూస్తుంటే ఈ పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణల తంతు ఎలా ఉందంటే, ‘అభిరుచి భేదాల’ గురించి రష్యన్ మహాకవి మయకోవస్కీ చెప్పిన వ్యంగ్య రచన గుర్తుకొస్తోంది: వెనకటికొక –

“గుర్రం ఒంటె వైపు చూపు సారించి అరిచింది,
ఛీ! ఇది సంకర జాతికి చెందిన గుర్రం' అని.
ఒంటె (తాను మాత్రం తక్కువ తిన్నానా అనుకుని)
అన్నది కదా
‘నువ్వు గుర్రానివి కావు
చిన్న సైజు ఒంటెవి
అంతే అనుకో' అని! కానీ
అసలు సంగతి
ఆ దేవునికే తెలుసు!
విశాల నక్షత్ర వీధుల్లో
ఆ విశ్వ ప్రభువుకి, ఈ
రెండూ రెండు విభిన్న జాతులకి
చెందిన మృగాలని తెలుసు"!

భారత లౌకిక రాజ్యాంగం గుర్తించి రూపొందించిన వాక్, సభా స్వాతంత్ర్యం లాంటి ప్రాథమిక హక్కులను నర్మగర్భంగా అణచివేసే పద్ధతుల్ని ఏ పాలకులు అనుసరిస్తున్నా, కనీస ప్రజాస్వామ్య విలువల్ని రకరకాల ‘మిష’ చాటు చేసుకుని గౌరవించని దశలోనే ఇలా ‘అభిరుచిలో భేదాలు’ బాహాటంగా చోటు చేసుకుంటాయని మరచి పోరాదు! అంతేగాదు, 2014-2022 మధ్య కాలంలో దేశంలో పెక్కు మంది పాత్రికేయుల మీద వేధింపుల సంఖ్య కూడా పెరిగిందని ‘వి-డెమ్’ సంస్థ నమోదు చేసింది. పశువులకు మేత లేక తిండి కరవుతో చస్తున్నా, ‘మతం’ పేరిట ముస్లిం యువకుల్నీ, వారి కుటుంబాలనూ వేధిస్తున్న ఘటనలకు అసాధారణ చొరవ చూపారు ఉత్తర ప్రదేశ్ పాలకులు. ‘గోరక్షణ’ పేరిట పలుచోట్ల జరిగిన దారుణమైన దాడులు సామాజిక అశాంతికి దారి తీశాయి. ఇలాంటి ఎన్నో ఘటనలను ‘హిందూ’ పత్రిక అనుబంధ విశిష్ట పక్ష పత్రిక ‘ఫ్రంట్‌లైన్’ (మార్చి 10, 2023) నమోదు చేసింది.

రెండో మాట



ఇదిలా ఉండగా– చివరికి పారిశుద్ధ్య కార్మికులకు సరైన రక్షణ కవచాలు లేక అనేక సీవేజ్ గుంటల్లో ప్రాణాలు విడుస్తున్న ఉదాహరణలను పేర్కొంటూ సుప్రీంకోర్టు చలించిపోయింది. దుర్గంధపూరిత విష వాయువుల మధ్య చనిపోతున్న పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితులను ప్రస్తావించి, ఇలా ‘విష వాయు మాళిగ (గ్యాస్ చాంబర్స్)ల్లోకి తోసి ప్రాణాలు తీసే పరిస్థితి ప్రపంచంలో ఎక్కడా చూడ బోమని' (2019లో) వ్యాఖ్యానించింది! పారిశుద్ధ్య కార్మికుల ఉద్యమ నాయకుడు బెజవాడ విల్సన్ దేశంలో వీరి పరిస్థితి ఎందుకు మెరుగవటం లేదో కారణాలు వివరంగా పేర్కొన్నారు: ''కుల వ్యవస్థ దేశంలో బలంగా ఉన్నందున, ఈ కార్మికుల ఆరోగ్య పరిస్థితుల్ని పట్టించుకోవడం లేదు. పాలకులు రాజ్యాంగ విధుల్ని పాటించడం మానేశారు. దేశంలో ప్రతి మూడవ రోజున ఒక పారిశుద్ధ్య కార్మికుడు చనిపోతున్నాడు. అయినా వారి రక్షణ గురించిన పల్లెత్తు హామీ లేదు.' (ఫ్రంట్‌లైన్, 10 మార్చ్ 2023)

ఇలాంటి పరిస్థితుల్లో చివరికి పండుగలు, పబ్బాలు కూడా పేద వర్గాల జీవితాల్లో నామ మాత్రం అయిపోయాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి ఇలాంటి దీన పరిస్థితుల్ని తలచుకున్నప్పుడల్లా ‘మాకు గాదులు లేవు, ఉగాదులు లేవ'ని పలుమార్లు ఎత్తిపొడుస్తూ వచ్చాడు. చివరికి ‘ఎంత పెద్ద పండుగ' వచ్చినా పేదసాదలు యథాలాపంగా జరుపుకోవడమేగానీ, వారి బతుకుల్లో నిజమైన వెలుగులు చూడలేక పోతున్నాం! అందుకే శ్రీశ్రీ కూడా ‘పండుగెవరికి? పబ్బమెవరికి?' అన్న పాటలో సమాధానాలు లేని ప్రశ్నల వర్షం కురిపించాల్సి వచ్చింది:

''పెద్ద పండుగ, పెద్ద పండుగ, పేరు దండగ!
పండుగెవరికి, పబ్బమెవరికి?
తిండి లేక, దిక్కు లేక
దేవులాడే దీన జనులకు
పండుగెక్కడ! పబ్బమెక్కడ?
ఎండు డొక్కల వుండు రెక్కల
బండ బతుకుల బానిసీంద్రకు
పండుగేమిటి? పబ్బమేమిటి?
ఉండటానికి గూడు లేకా
ఎండవానల దేబిరించే
హీన జనులకు పేద నరులకు
పండుగొకటా? పబ్బమొకటా?''

ఇన్ని ఈతిబాధలు పేద వర్గాలను నిత్యం వెంటాడుతుండగా– పాలక వ్యవస్థను ప్రజావసరాలు తీర్చడానికి వినియోగించేందుకు నడుం బిగించడం మానేసి న్యాయ వ్యవస్థను తటస్థం చేసేందుకు పాలక పక్షం యత్నిస్తోంది. అఖిల పక్ష– పాలక వర్గ, ప్రతిపక్ష, న్యాయ వ్యవస్థ ప్రతినిధులతో సమాన ఫాయాలో ఏర్పడే క్రియాశీల సంస్థ ఉంటేనే వివక్షకు తావుండదని న్యాయ వ్యవస్థ భావించింది. ఇది ఆచరణలోకి వస్తే పాలక వర్గ ఏకపక్ష నిర్ణయాలూ, ఆటలూ సాగవు. అలాంటి పరిణామానికి ప్రస్తుత క్రియాశీల అత్యున్నత ధర్మాసనం సానుకూలం. కేంద్రం ప్రతికూలం. ఈ వైరుధ్యం, రాజ్యాంగం ఉభయ శాఖలకు నిర్దేశించిన పరిధుల్ని గౌరవించి వ్యవహరించినంత కాలం తలెత్తదు. ఇప్పుడా పరిధిని పాలకులు అతిక్రమించడానికి ఘడియలు లెక్కపెడుతూ కూర్చున్నందుననే ప్రజలకు సమస్యలు ఎదురవుతున్నాయి! ప్రస్తుత పాలకవర్గానికి అసలు భయమంతా – 2024 జనరల్ ఎన్నికల వరకే గాక ఆ తరువాత కూడా ప్రస్తుత క్రియాశీల ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ మరికొంత కాలం పదవిలో ఉండ బోవడమే! ప్రస్తుతం కిరణ్ రిజిజు మనోవేదనంతా సుప్రీం చుట్టూనే తిరుగుతోంది!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎందుకు వద్దంటారు?



ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ క్రీడాకారుడు నోవాక్ జొకోవిచ్ కోవిడ్ టీకా వేసుకోని కారణంగా మయామి ఓపెన్‌లో పాల్గొన లేకపోతున్నాడని వార్త. ప్రపంచంలో అత్యంత ఆరోగ్యంగా ఉన్న ఆటగాడు వీళ్లకు ఆరోగ్య ప్రమాదంగా మారుతాడని కాబోలు పాల్గొననివ్వడం లేదు. ఇదీ ఇప్పటి సైన్సు!

– ఎలీ డేవిడ్, పరిశోధకుడు

ఏమీ జరగదు



భారత గణతంత్ర దినోత్సవాన జాతీయ పతాకాన్ని అగౌరవ పరిచినప్పుడు మీరు ఏమీచేయలేదు. అలాంటప్పుడు ఇప్పుడు తదుపరి ఏం జరుగుతుందని మీరు అంచనా వేస్తున్నారు? (లండన్‌లోని భారత రాయబార కార్యాలయంలో ఖలిస్తానీ వేర్పాటువాదుల వల్ల జాతీయ పతాకానికి జరిగిన అవమానం నేపథ్యంలో.)

– అభినవ్ అగర్వాల్, రచయిత

పెద్ద కుట్ర



దేవాలయాలు, దౌత్య కార్యాలయాల మీద ఖలిస్తానీయుల అన్ని దాడులు వెనుకా ఉన్నది ఒకటే ఎజెండా – ఏదో రకంగా భారత్‌లో ప్రతిస్పందనను రెచ్చగొట్టాలి; ఆ స్పందనను బాధిత కార్డుగా వాడుకోవాలి. ఇది సరిగ్గా ఖలిస్తాన్, ‘ఫైరస్ పంజాబ్ దె'లకు అక్రమ తండ్రి అయిన ఐఎస్ఐ(పాకిస్తాన్ గూఢచర్య సంస్థ) ప్లేబుక్ ప్రకారం సాగుతోంది.

– గౌరవ్ ఆర్యా, ఆర్మీ మేజర్ (రిటైర్డ్)

అతి స్పందన



పంజాబ్‌లో కొంతమంది జర్నలిస్టుల ట్విట్టర్ అకౌంట్లను నిలిపివేశారు. ఏమీలేని చోట ఏదో అతిగా జరుగుతున్నదని చూపించే ప్రయత్నం మొదలైపోయింది.

– హర్తోష్ సింగ్ బాల్, సంపాదకుడు

మేలుకుంటేనే మేలు



ఇది భారత ఎన్నికల తర్వాత అంతం కాదు, వాటి కోసమే మొదలు కాలేదు. ఇది దీర్ఘకాలంగా భారత దేశాన్ని అస్తవ్యస్తం చేయడం కోసం ఒక ‘ప్లేబుక్' ప్రకారం సాగుతోంది. ముందే మేల్కొంటే మేలు జరుగుతుంది. (ఖాలిస్తానీ ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని.)

– సారా ఎల్. గేట్స్, పరిశోధక విద్యార్థి

నిత్య వసంతాన్ని

నేను కవిని
కల్పన, వర్ణన నా నైజం.

గడవని చీకటి రాత్రుల్లో
కన్నీరు సంద్రమై పొంగుతోంటే
మదిలోతుల భావాలకు
శిల్ప రమణీయత నద్ది,
వర్ణశోభిత అక్షర ప్రతిమనై
ఒదిగిపోతాను.

ఒత్తిడికి గురైన వేళ
రాలిన ఆత్మవిశ్వాస శిశిరాన్ని
కిసలయాక్షరాలతో
వసంతంగా మారుస్తాను.

విశ్వాంతరాళాలలోని
అణువణువు స్పందనల గాథను
ఆర్ద్రంగా స్పృశించి,
అద్భుత అక్షరమాలికగా కూర్చుతాను.

అణగారిన చరితల బతుకు సీమను
అనునిత్యం సృజియిస్తూ,
చేతనా ఉషస్సులు పూయిస్తూ,
తిరుగుబాటు గొంతుకల్లో
విప్లవశంఖం పూరించే కంఠాన్నౌతాను.

కోయిలకు ఏడాదికి
ఒక్క వసంతం మాత్రమే...
కానీ, నేను మాత్రం
కాలచక్రపు కదలికలకు
స్పందిస్తూ, ప్రతిస్పందిస్తూ
భూత భవిష్యత్ వర్తమానాలలో
పరిభ్రమిస్తూ,
కవితాలాపన చేస్తూనే ఉంటాను.
కవిత్వమంటే నాకు చాలా ఇష్టం
నేను కవిని!

– వేమూరి శ్రీనివాస్ | 99121 28967
(నేడు ప్రపంచ కవితా దినోత్సవం)

పరీక్షల రద్దు వద్దు! ప్రత్యామ్నాయం ఉంది!

అభిప్రాయం



వంశీకృష్ణ జోషి

గత శుక్రవారం టీఎస్‌పీఎస్సీ... పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో గ్రూప్–1, ఏఈఈ, డీఏఓ పరీక్షలు రద్దుచేస్తూ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రభుత్వ సంస్థలు నిర్వహించే పరీక్షల ప్రశ్నా పత్రాలు లీక్ అవ్వడం, పరీక్షలు రద్దు చేయడం పరిపాటి అయింది. వివిధ తరగతులు చదివే విద్యార్థుల కోసం నిర్వహించే పరీక్షలకూ, ఉద్యోగార్థుల కోసం నిర్వహించే పోటీ పరీక్షలకూ తేడా ఉంది. ప్రభుత్వాలు మాత్రం అన్ని పరీక్షలకూ ఒకే విధానం పాటిస్తున్నాయి. పరీక్షల(రాసేవారూ, నిర్వహించేవారు)తో ఎటువంటి సంబంధం లేని వారికి ప్రభుత్వం పరీక్షలను రద్దు చేయడం సబబుగా తోచినప్పటికీ.. విజ్ఞతతో ఆలోచించినప్పుడు అతి క్రూరమైన చర్య ఇది.

ఒక జాబ్ క్యాలెండర్ అంటూ లేకపోవడం, సంవత్సరాల కొద్దీ పరీక్షల నిర్వహణ, ప్రతి ఉదారవాద గ్రూపు ఒత్తిడులకు తలొగ్గి దరఖాస్తు మొదలుకుని నిర్వహణ దాకా తేదీల పొడిగింపులు, వాయిదాలు, తరుచుగా లీకులు జరగడం, పరీక్షలు రద్దు చేయడం; కోర్టు కేసుల స్టేల నుండి తుది తీర్పుల వరకూ నియామక ప్రక్రియ పూర్తి అవ్వడానికి ఏళ్ల సమయం పట్టడం, అప్పటి వరకు అభ్యర్థులు ఇతర ఉద్యోగ అవకాశాలు అందు కోవడమా, లేక కోర్ట్ తీర్పు వచ్చేవరకు పరీక్షలకై ఎదురుచూడమా అని ఆలోచిస్తూ... త్రిశంకు స్వర్గంలో జీవించడం... ఇదీ నిరుద్యోగ పర్వంలో ఉన్నవారి దీన గాథ. జీవితంలో అతి ముఖ్యమైన 20–35 ఏళ్ల మధ్య ఉన్న 5 నుంచి 10 సంవత్సరాల విలువైన యౌవన కాలాన్నీ, కెరీర్‌నూ, ఉత్పాదకతా సామర్థ్యాన్నీ ప్రభుత్వ యంత్రాంగాల తీరుతో లక్షలాదిమంది యువత నాశనం చేసుకుంటున్నారు.

పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో పరీక్షలో పాస్ కాలేక పోయిన అభ్యర్థి ఊహాజనిత నష్టం కన్నా... అప్పటికే పాస్ అయిన అభ్యర్థికి జరిగే నిజమైన నష్టం గురించి ఎవ్వరూ మాట్లాడటం లేదు. ఇంతటి అన్యాయాన్ని నిలదీయాల్సిన ప్రతిపక్షాలు భావ దారిద్ర్యంతో పరీక్షల రద్దు కోరుతున్నాయి.

‘వంద మంది అపరాధులు తప్పించుకున్నా పర్వాలేదు కానీ ఒక్క నిరపరాధికీ అన్యాయం జరగవద్దు' అనేది మన న్యాయ వ్యవస్థ ముఖ్య భావన. మోసపూరితంగా పరీక్ష రాసి ఉత్తీర్ణులు అయిన కొద్ది మందిని శిక్షించడం కోసం నిజాయితీగా పరీక్షలు రాసిన వాడి హక్కులు, అవకాశాలు కాలరాయడం ఎంతవరకు న్యాయం? నిజానికి లక్షల మంది రాసే పరీక్షలకు లీకేజీల వల్ల లబ్ధి పొందే వారు చాలా పరిమితంగా ఉంటారు. నిజాయితీగా రాసి విజేతలుగా నిలిచిన నిరుద్యోగులకు నోటికాడి అన్నం లాక్కోవడం క్షంతవ్యం కాని నేరం. సహజ న్యాయానికి విరుద్ధం.

ఇప్పుడు జరిగిన సంఘటనలో రేణుక అనే ఆవిడ ఇద్దరికి పేపర్ అమ్మితేనే ఇంత రచ్చ జరిగింది. నిజంగా విస్తృత స్థాయిలో లీకేజీ జరిగితే నేటి సోషల్ మీడియా కాలంలో ఎప్పుడో వైరల్ అయ్యేది. ఏదైనా పేపర్ లీకైనప్పుడు అసలు పేపర్ ఎంతవరకు లీక్ అయ్యింది? పరీక్షార్థులలో ఎంత శాతం మందికి పరీక్షకు ముందే ప్రశ్నాపత్రం తెలుసు? అందులో ఎంత మంది ఉత్తీర్ణులయ్యారు?



అన్న కనీస విచారణ లేకుండా మన వ్యవస్థలు తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి ఇంగితం లేకుండా చేసే మొదటి పని పరీక్షలు రద్దు చేయడం.

టీఎస్‌పీఎస్సీ లీకేజీ వ్యవహారంలో హ్యాక్ అన్న పదం ఉపయోగించి సమస్యను తప్పుదారి పట్టిస్తున్నారు. ఒక మామూలు ఫోన్‌లో ఫోన్ తెరవడానికి ఫింగర్ సెన్సార్, వ్యక్తిగత ఫైల్‌కు ప్రత్యేక లాక్‌లు, పాస్‌వర్డ్‌లు అందరూ పెట్టుకుంటున్న ఈ కాలంలో... రాష్ట్ర స్థాయి పరీక్షలు నిర్వహిస్తున్న ఒక ప్రొఫెషనల్ సంస్థ ప్రశ్న పత్రాన్ని ఎంత కట్టుదిట్టంగా భద్రపరచాలి!?

పత్రికల్లో వచ్చిన సమాచారం ప్రకారం కస్టోడియన్ ఛాంబర్‌లో ఇతరులకు ప్రవేశం లేకుండా ప్రవేశ ద్వారం దగ్గర డిజిటల్ అథెంటికేషన్ వ్యవస్థ లేదు. కంప్యూటర్ లాగిన్‌కు కనీసం ఫింగర్ ప్రింట్ అథెంటికేషన్ అయినా అనుసంధానించబడలేదు. సర్వర్ కంప్యూటర్‌లో ప్రశ్నాపత్రాల ఫోల్డర్‌కు ప్రత్యేక పాస్ వర్డ్ లాక్ ఉండి ఉంటే వాళ్లు ప్రశ్నాపత్రాలు తస్కరించినప్పటికీ ఫైల్ ఓపెన్ అయ్యే అవకాశం లేదు. అసలు ఏదైనా కాన్ఫిడెన్షియల్ ఫైల్ కీ ఎన్‌స్క్రిప్షన్ రూపంలో భద్రపరిచి దాని ఎన్‌స్క్రిప్షన్ కీని ముఖ్యమైన అధికారి వద్ద అంటే టీఎస్‌పీఎస్సీ చైర్మన్ స్థాయి అధికారి వద్ద మాత్రమే ఉంచుతారు. ఒకవేళ వాళ్ళు పాస్‌వర్డ్ హ్యాక్ చేసినప్పటికీ సమాచారం ఎన్‌క్రిప్షన్ రూపంలో... అంటే క్రోడీకరించబడిన భాషలో ఉండటం వల్ల దానిని వారు చదవలేరు. ఈ పని టీఎస్‌పీఎస్సీ చేయలేదు. అలాగే ఏదైనా కాన్ఫిడెన్షియల్ సిస్టమ్‌లో పెన్ డ్రైవ్ లేదా సీడీ డ్రైవ్ లాంటి అవుట్ పుట్, ఇన్‌పుట్ డివైస్ డ్రైవర్స్ డిసేబుల్ చేసి ఉంచడం కనీస భద్రతా విధి. చిత్తుకాగితాలతో సహా ధ్వంసం చేయడానికి పేపర్ ట్రాషెర్ పయోగించాలి. కానీ ఇక్కడ ఉపయోగించలేదు. ఇటువంటి ఎన్నో తప్పులు చేసిన టీఎస్‌పీఎస్సీ... ఒక ముఖ్యమైన పరీక్షా పేపర్ భద్రతను గాలికొదిలేసి అదేదో సైబర్ నేరగాళ్లు సిస్టం సెక్యూరిటీ ఫైర్‌వాల్‌ను బ్రేక్ చేసి హ్యాకింగ్ చేసినట్టు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నది.

లీకేజీ జరిగేది అతి స్వల్ప మొత్తంలో కాబట్టి అందులో లీకేజీ వల్ల కటాఫ్ స్కోర్ పెరిగి నష్టపోయిన పై కేటగిరీకి చెందిన విద్యార్థుల సంఖ్య... మొత్తం మీద చూస్తే చాలా చాలా స్వల్పంగా ఉంటుంది. ఇందులో సంఖ్యతో సంబంధం లేకుండా ఒక్కడున్నా న్యాయం చేయవలసిందే. వాస్తవానికి నిజా యితీగా రాసి ఉత్తీర్ణులైన వారి సంఖ్య లీకేజీ వల్ల లబ్ధి పొందిన వారికంటే చాలా రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఇంతకు ముందు చెప్పి నట్టుగా సంఖ్యతో సంబంధం లేకుండా కనీసం ఒక్కడు నిజాయితీగా రాసి క్వాలిఫై అయినవాడు ఉన్నా ఆ అభ్యర్థికీ న్యాయం చేయవలసిందే. కాబట్టి టీఎస్‌పీఎస్సీ కానీ, ఇతర సంస్థలు కానీ పేపర్ లీకేజీ ఆరోపణలు వచ్చినప్పుడు క్వాలిఫై కానివాళ్ల కోసం ప్రత్యేకంగా ఇంకొకసారి ప్రిలిమ్స్ రాసే అవకాశం ఇవ్వాలి. అందులో క్వాలిఫై అయినవారికీ, అంతకు ముందు క్వాలిఫై అయిన వారికీ కలిపి మెయిన్ పరీక్షలు నిర్వహించాలి. మెయిన్ పరీక్ష పటిష్టంగా నిర్వహిస్తే... ఎటూ లీకేజీ వల్ల ప్రిలిమ్స్ పాసైనవారు మెయిన్స్‌లో పాస్‌కాలేరు కాబట్టి... ఈ విధానం వల్ల అందరికీ న్యాయం చేకూరినట్లవుతుంది. కాబట్టి ప్రభుత్వం ఈ సంగతి గట్టిగా ఆలోచించి ఎవరూ నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

వ్యాసకర్త పోటీ పరీక్షలు రాసే ఓ ఉద్యోగార్థి

ప్రియ భాషణం

సమయానికి తగుమాటలాడి ఆపదల నుండి గట్టెక్కే ప్రియ భాషణం జీవితంలో ఎంతో అవసరం. భారతంలో ‘దానధర్మాలు చేయడం, ప్రియంగా మాట్లాడడంలో ఏది గొప్పదని' ధర్మరాజు ప్రశ్నించగా భీష్ముడు చెప్పిన కథ ఇందుకు మంచి ఉదాహరణ.

ఒక బ్రాహ్మణుడు అడవి మార్గంలో వెళుతుండగా భయంకరమైన రాక్షసుడు అతడిని చంపి తినాలనే ఉద్దేశంతో పట్టుకున్నాడు. కానీ బ్రాహ్మణుడు అధైర్య పడలేదు. అతడి ధైర్యానికి ఆశ్చర్యపోయిన రాక్షసుడు ‘నా ప్రశ్నలకు జవాబు చెబితే నిన్ను వదిలేస్తా, లేదంటే తినేస్తా' అన్నాడు. బ్రాహ్మణుడు సరేనన్నాడు.

‘నా శరీరము డస్సిపోయింది. బాగా అలసిపోయింది. కారణమేమిటి' అని అడిగాడు రాక్షసుడు. అందుకు బ్రాహ్మణుడు ‘మహాత్మా! అందుకు ఎన్నో కారణాలు ఉంటాయి. చెడ్డవాడివని తెలిసి బంధువులంతా వదిలి వెళ్ళడం, దరిద్రంతో బాధపడుతూ లభించని ధనము గురించి చింతించడం, మొహమాటానికి పోయి ఇతరుల చేతిలో ఓడిపోగా ప్రత్యర్థులు దాన్ని తమ ప్రతాపమని పొంగిపోవడం చూసి ఓర్వలేక పోవడం, దుర్మార్గులు నిన్ను పొగడుతుంటే పండితులు కూడ పొగడలేదని మనసులో బాధపడడం, నీవు చేసిన పాడుపనులకు భార్య బాధపడుతుంటే ఆమెను అనునయించలేని దుఃస్థితిలో ఉండడం, సొమ్మును ఇతరులు ఎత్తుకు పోతున్నారని తెలిసీ రక్షించుకోలేక పోవడం, చాటు మాటుగా నీ గురించి చెప్పే మాటలను బంధువులు నిజమని నమ్మడం వలన కలిగే దుఃఖాన్ని మనసులో దాచుకోలేక, బయటకు చెప్పలేక కుమిలిపోవడం... ఇవన్నీ క్షీణతకు కారణాలు కావచ్చు. ఇంకా భార్యాబిడ్డల దుష్ప్రవర్తనతో ఇబ్బంది కలగడం, తల్లితండ్రులు, సోదరులు రోగములతో బాధపడడం, దేవుడి సొమ్మును అపహరించడం, బంధువులు చనిపోవడం వంటివీ కుంగి కృశించడానికి కారణమవుతాయ'ని చెప్పాడు.



ఆ మాటలతో ఊరట పొందిన ఆనందంలో బ్రాహ్మణుడిని వదిలిపెట్టాడు రాక్షసుడు.

– అమ్మాజీ ఉమామహేశ్వర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: అమావాస్య రా.11.38 వరకు, తదుపరి శోభకృత్ నామ చైత్ర శు.పాడ్యమి, నక్షత్రం:పూర్వాభాద్ర సా.6.04 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.3.14 నుండి 4.46 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.32 నుండి 9.20 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.44 వరకు, అమృతఘడియలు: లేవు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.08, **సూర్యాస్తమయం:** 6.07.

ఒంటిపై పెట్రోలు పోసుకుని

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం


బాధితురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ: తమ పక్క షాపు యజమాని తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన బట్టు సునీత సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఆమె హఠాత్తుగా ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. పక్కనే ఉన్న పోలీసులు వెంటనే అప్రమత్తమై పెట్రోల్ బాటిల్‌ను లాగేసుకొని ఆమె ఒంటిపై నీటిని పోశారు. ఆమెను నేరుగా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. తన బాధను సునీత కలెక్టర్‌కు వివరించారు. దీంతో ఆమెను ఎస్పీ దగ్గరకు తీసుకెళ్లాలన్న కలెక్టర్ ఆదేశాలతో పోలీసులు ఎస్పీ కార్యాలయానికి తీసుకువెళ్లారు. అక్కడ ఎస్పీకి ఆమె లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అసలేం జరిగిందంటే.. : మిర్యాలగూడ మండలం చింతపల్లికి చెందిన సునీత, భర్త రవితో కలిసి మిర్యాలగూడలోని హౌజింగ్ బోర్డు వద్ద ఓ గుడిసె వేసుకుని వినాయక విగ్రహాలు తయారు చేసి అమ్ముకుంటోంది. ఇటీవల భర్త రవికి కిడ్నీలు పాడై అనారోగ్యం పాలయ్యారు. సునీత ఒక్కరే తన ఇద్దరు బిడ్డలతో జీవనం వెళ్లదీస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పక్కనే ఉండే బాలస్వామి తనను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారనేది సునీత ఆరోపణ. వేధింపుల విషయంపై మిర్యాలగూడ సీఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, అందుకే కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశానని సునీత చెప్పారు.

రిజిస్ట్రేషన్ చేయకుంటే పెట్రోల్ పోస్తాం...

తహసీల్దార్‌కు బెదిరింపులు


తహసీల్దార్ మంజుల

నల్లబెల్లి: 'భూమి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్లాట్ బుక్ చేసుకున్నాం.. రిజిస్ట్రేషన్ చేయండి.. లేదంటే నీపై పెట్రోల్‌పోసి చంపుతాం'అని పోలీసుల సాక్షిగా కొందరు తహసీల్దార్‌ను బెదిరించారు. ఈ సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగింది. బాధిత తహసీల్దార్ దూలం మంజుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిల్‌నాయక్ తండాకు గుగులోత్ పద్మ అనే మహిళ భూమి రిజిస్ట్రేషన్ చేయాలని స్లాట్ బుక్ చేసుకుంది. ఈ భూమిపై బ్యాంకు లోన్ తీసుకున్నట్లు గుర్తించారు. అంతే కాకుండా పేపర్లు సక్రమంగా లేకపోవడంతో రిజిస్ట్రేషన్ చేసేందుకు నిరాకరిస్తూ బ్యాంక్ నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. ఈ విషయాన్ని పద్మ వారి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో బిల్‌నాయక్‌తండాకు చెందిన కొందరు వ్యక్తులు సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలోకి ప్రవేశించి 'స్లాట్ బుక్ చేసుకున్నాం..రిజిస్ట్రేషన్ చేయండి.. నోడ్యూస్ ఎందుకు తీసుకురావాలి'అంటూ నిలదీశారు. వెంటనే ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కార్యాలయానికి చేరుకోగా, వారి ముందే రిజిస్ట్రేషన్ చేయకపోతే నీపై పెట్రోల్ పోసి చంపేస్తామని తహసీల్దార్‌ను నానా దుర్భాషలాడారు. నల్లబెల్లి నుంచి నువ్వు స్వచ్ఛందంగా వెళ్లిపోవాలని, లేకుంటే నిన్ను చంపి జైలుకైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని భయభ్రాంతులకు గురిచేసినట్లు తహసీల్దార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

క్లుప్తంగా...

భార్యను చంపి.. భర్త ఆత్మహత్య


మల్లమ్మ (ఫైల్)

జోగిపేట(అందోల్): అనుమానం పెనుభూతమై కట్టుకున్న భార్యను గొడ్డలితో కడతేర్చాడు. ఆ పై భార్య చీరతోనే ఉరివేసుకొన్నాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నాదులాపూర్‌లో సోమవారం వెలుగుచూసింది. ముద్దాయిపేట నారాయణ(55), మల్లమ్మ(50) దంపతులు గచ్చిబౌలిలోని కొడుకు వద్ద ఉంటున్నారు. ఆదివారం టేక్మాల్ మండలం అచ్చన్నపల్లిలో ఓ వివాహ వేడుకకు హాజరై రాత్రికి స్వగ్రామమైన నాదులాపూర్‌కు వెళ్లారు. పెళ్లిలో ఒడి బియ్యం పోశారని, రాత్రి ఇక్కడ నిద్ర చేసి వెళతామంటూ నారాయణ తన తల్లి అంబమ్మను వేరే వారి ఇంటికి వెళ్లమని చెప్పాడు. దీంతో ఆమె తన బంధువుల ఇంటికి వెళ్లింది. సోమవారం ఉదయం అంబమ్మ తిరిగి ఇంటికి రాగా, రేకుల షెడ్‌కు చీరతో ఉరి వేసుకొని వేలాడుతూ కొడుకు మృతదేహం కనిపించింది. భయంతో కేకలు వేయగా ఇరుగుపొరుగు వారు వచ్చి చూడగా దంపతులు చనిపోయి ఉన్నారు. మల్లమ్మ నిద్రిస్తున్న సమయంలో గొడ్డలితో మెడపై బలంగా నరకడంతో ఆమె మృతి చెందిందని భావిస్తున్నారు. తల్లిదండ్రుల మధ్య మొదటి నుంచి ఘర్షణలు జరుగుతున్నాయని, తల్లిని అనుమానిస్తూ కొట్టేవాడని కుమారుడు చెబుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం రావడం లేదని యువతి ఆత్మహత్య


మేఘన(ఫైల్)

గీసుకొండ: డిగ్రీ వరకు చదివిన తనకు ఉద్యోగం రావట్లేదని మనస్తాపం చెందిన ఓ యువతి జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం గ్రేటర్ వరంగల్ పరిధిలో జరిగింది. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో ఊదరి రవికి ముగ్గురు కూతుళ్లు. ఇద్దరికి వివాహమైంది. చిన్న కూతురు మేఘన (23) డిగ్రీ వరకు చదివి ఇంటివద్దే ఉంటోంది. ఉదయం 11 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందంటూ మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.'డిగ్రీ వరకు చదివినా ఆర్థికంగా నా కుటుంబానికి ఏమీ చేయలేకపోతున్నా. నన్ను తల్లిదండ్రులు బాగా చూసుకున్నారు. నాకు జాబ్ రావడం లేదనే ఒత్తిడికి గురవుతున్నా. అందరూ జాబ్ కోసం ట్రై చేసి రిజల్ట్ వచ్చిన తర్వాత ఓడిపోతారు. కానీ నేను ప్రయత్నం చేయకుండానే ఓడిపోతున్నా. ఐ మిస్‌యూ అమ్మానాన్న.. సిస్టర్స్, కుటుంబ సభ్యులు బాగుండాలి'అని డైరీలో రాసి ఆత్మహత్య చేసుకుందని బంధువులు చెప్పారు. పోలీసులు డైరీని స్వాధీనం చేసుకున్నారు.

గ్రామ పంచాయతీ కారోబార్ ఆత్మహత్యాయత్నం

వార్డు సభ్యుడు వేధింపులే కారణం!

చండూరు: వార్డు సభ్యుడు అవమానిస్తూ, ఇబ్బందులకు గురిచేస్తున్నాడంటూ పంచాయతీ కారోబార్ సోమవారం ఆత్మహత్యాయత్నం చేసింది. నల్లగొండ జిల్లా కస్తాల గ్రామానికి చెందిన బొమ్మరబోయిన పుష్పలత ఇదే గ్రామ పంచాయతీ కార్యాలయంలో 2016లో కార్మికురాలిగా చేరింది. ప్రస్తుతం ఆమె పంచాతీయ కార్యదర్శి అనుమతితో కారోబార్ (బిల్ కలెక్టర్)గా పనిచేస్తోంది. అయితే, ఆమెను బిల్ కలెక్టర్‌గా కాకుండా పారిశుధ్య కార్మికురాలిగా కొనసాగాలని పంచాయతీ పాలకవర్గ సభ్యుడు జోగు వెంకన్న అంటున్నాడు. సోమవారం జరిగిన పాలకవర్గ సమావేశంలోనూ ఇదే విషయమై ఇరువురి మధ్య గొడవ జరిగింది. తనను వెంకన్న అవమానిస్తున్నాడంటూ పుష్పలత బయటకు వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసుకోగా, తోటి కార్మికులు ఆమెను అడ్డుకున్నారు.

తేజా మిర్చి @ రూ.25,550


జెండా పాటలో పాల్గొన్న మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం వ్యవసాయం: విదేశీ ఎగుమతికి అనుకూలమైన తేజా రకం మిర్చికి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఆల్‌టైం రికార్డ్ ధర నమోదైంది. సోమవారం నిర్వహించిన జెండా పాటలో రవాణా శాఖమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొనగా.. క్వింటాకు రూ.25,550 ధర పలికింది. పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామానికి చెందిన రైతు అచ్చా శ్రీను తెచ్చిన 94 బస్తాల మిర్చికి గరిష్ట ధర పలకడం.. చరిత్రలోనే ఈ ధర అత్యధికం కావడంతో రైతుల్లో ఆనందం వెల్లువెత్తింది.

యువత త్యాగాలతోనే తెలంగాణ

- ఇక్కడి యువతలో శక్తిసామర్థ్యాలు పుష్కలం
- వారికి రాజ్‌భవన్ ఎప్పుడూ అండగా ఉంటుంది
- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- రాజ్‌భవన్‌లో ఘనంగా శోభకృత్‌నామ ఉగాది వేడుకలు



రాజ్‌భవన్‌లో జరిగిన ఉగాది ఉత్సవాల్లో పాల్గొన్న గవర్నర్ తమిళిసై దంపతులు. చిత్రంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ దంపతులు. (ఇన్‌సెట్‌లో) పంచాంగ పఠనం చేస్తున్న కౌషిక్

సాక్షి, హైదరాబాద్: 'ఎంతోమంది యువతీయువకుల త్యాగాల వల్లనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించింది. తెలంగాణ యువతలో శక్తిసామర్థ్యాలు, సమస్యలపై పోరాడే తెగువ పుష్కలంగా ఉన్నాయి. అలాంటి యువతకు నా శాల్యూట్. రాజ్‌భవన్ ఎల్లవేళలా వారికి అండగా ఉంటుంది'అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ భరోసా ఇచ్చారు. సోమవారం రాత్రి రాజ్‌భవన్‌లో తెలుగు కొత్త సంవత్సరం శోభకృత్‌నామ ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరుకాగా, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఉగాది పంచాంగ పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ, ఈ ఉగాది వేడుకలను తాను యువ ఉగాది ఉత్సవాలుగా నిర్వహించాలని భావించి వివిధ విద్యా సంస్థల నుంచి యువతను ఆహ్వానించినట్టు వెల్లడించారు.

''నేను పిలిచినా వారు రారు''

''రాజ్‌భవన్‌లో ఎన్నో కార్యక్రమాలు జరుగుతుంటాయి. వాటికి నేను ఎంతోమంది వీఐపీలను ఆహ్వానిస్తుంటాను. కానీ కొంతమంది హాజరు కారు, వారికి ఉద్దేశించిన కుర్చీలు ఖాళీగానే ఉంటాయి. కానీ ఈ వేడుక ఓ ప్రత్యేకం. దీనికి వీఐపీలు యువతీయువకులే. అందుకే అన్ని కుర్చీలు నిండుగా ఈ ప్రాంగణం ప్రత్యేకతను సంతరించుకుంది'అని గవర్నర్ వ్యాఖ్యానించారు. కొత్తగా పుట్టిన తెలంగాణకు గవర్నర్‌గా ఎలా పనిచేస్తావో అని కొందరు నాతో అనేవారని, కానీ, స్వతహాగా గైనకాలజిస్టును అయిన తనకు అప్పుడే పుట్టిన పిల్లలను మేనేజ్ చేసే శక్తి ఉందని, అలాగే గవర్నర్‌గా పనిచేయగలనని చెప్పినట్టు పేర్కొన్నారు. గవర్నర్‌భర్త సౌందరరాజన్, ఆమె తండ్రి, కూతురు, రాజ్‌భవన్ సిబ్బంది కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువతీ యువకులకు ఉగాది పురస్కారాలు

వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువతీయువకులను ఆమె ఉగాది పరస్కారాలతో సత్కరించారు. కూరగాయలు అమ్ముతూ మార్షల్ ఆర్ట్స్‌లో తనదైన ముద్రను సొంతం చేసుకుంటూ పతకాలు సాధిస్తున్న రేపల్లి శ్రీనివాస్, సాహసయాత్రలతో అంతర్జాతీయ గుర్తింపు పొందుతున్న కొండా సత్యదేవ్, దివ్యాంగులకు కళల్లో తర్ఫీదునిప్పిస్తున్న గంధం సంతోష్, ఉన్నత విద్యను అభ్యసించి వ్యవసాయంలో నైపుణ్యం ప్రదర్శిస్తున్న రఘునాథ్‌రెడ్డి, యువ పారిశ్రామిక వేత్త రవికుమార్ సాగర్, వ్యవసాయ పనిముట్లతో నూతన ఆవిష్కరణలు చేస్తున్న శుభశ్రీసాహు, కూచిపూడి నృత్యంతో ప్రతిభ కనుబరుస్తూ పాడుబడ్డ దేవాలయాల పునరుద్ధరణపై అవగాహన కల్పిస్తున్న హిమాన్స్, నాట్యరంగంలో ప్రతిభ చూపుతున్న రోహిణి కందాల, ఐఐటీలో పీహెచ్‌డీ చేసి వేదాధ్యయనంలో ప్రతిభ చాటుకుంటున్న సాగి శివ శ్రీనివాస కౌశిక్, నాట్య పరిశోధనలో ఉన్న జ్యోత్స్న, సామాజికసేవలో సాగుతున్న పోతుకూచి సోమసుందర్‌తో పాటు మరికొందరిని ఆమె సన్మానించారు. అంతకుముందు యువ పండితులు సాగి శివ శ్రీనివాస ధీరేంద్ర కౌశిక్ శోభకృత్‌నామ సంవత్సరంలో పరిస్థితులు ఎలా ఉండబోతున్నాయో పంచాంగ పఠనం ద్వారా వివరించారు. ప్రజలకు–ప్రభుత్వానికి మధ్య సత్సంబంధాలుండటంతో రాష్ట్రంలో పాలన సాఫీగా సాగుతుందన్నారు. హిమాన్స్ కాట్రగడ్డ, కొత్తగూడెం సీతాలక్ష్మీ ప్రసాద్ శిష్య బృందం, రోహిణీ కందాల శిష్యబృందం, సురేంద్రనాథ్ దంపతులు.. తదితరుల నృత్య కార్యక్రమాలు అలరించాయి. సముద్రాల శృతిగ గానం ఆకట్టుకుంది. నాదస్వరం, డోలు బృందంలో ఇద్దరు మహిళా కళాకారిణులు ఉండటం విశేషం. కాగా, ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరు కాలేదు.

కొత్త పంటల బీమా పథకాన్ని ప్రకటించాలి: పల్లా



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకం రైతుల ప్రయోజనాల కోసం కాకుండా బీమా కంపెనీలకు ఉపయోగపడేలా ఉందని రైతుబంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫసల్ బీమా పథకం స్థానంలో రైతులకు మేలు జరిగేలా కొత్త పంటల బీమా పథకాన్ని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, కేపీ వివేకానంద్‌తో కలసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో 80 వేల మంది రైతులకు సంబంధించిన 1.50 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు కలెక్టర్ల ద్వారా నివేదికలు అందాయని వెల్లడించారు. తాము కూడా క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించామని, 2,603 వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో నివేదికలు సిద్ధమవుతున్నాయని చెప్పారు. తుది నివేదికలు అందిన తర్వాత రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా బృందాలను పంపాలని డిమాండ్ చేశారు. ఇద్దరు ఇంటి దొంగల వల్లే టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొన్నారు.

కేటీఆర్‌కు వస్తున్న గుర్తింపును ఓర్వలేకే

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంత్రి కేటీఆర్‌కు వస్తున్న గుర్తింపును ఓర్వలేక ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారని వివేకానంద విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన ప్రశ్నపత్రం లీకేజీ ఘటనలో 46 మంది ఆత్మహత్యలకు పాల్పడినా అక్కడి సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ ఘటనల్లో బీజేపీ నేతల ప్రమేయముందని, వారిపై కేసులు కూడా నమోదయ్యాయని గుర్తు చేశారు. కేటీఆర్ సహాయకుడిపై ఆరోపణలు చేయడం ప్రతిపక్షాల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందని గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు.

ఎకరాకు రూ.లక్ష ఇవ్వాలి



మోమిన్‌పేట: వడగళ్ల వానతో పంటలు నష్టపోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా అంరాదికుర్దు గ్రామంలో వడగళ్ల వర్షానికి నష్టపోయిన ఉల్లి పంటను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడారు. వడగళ్ల వర్షం కురిసి మూడు రోజులవుతున్నా అధికార పార్టీకి చెందిన ఒక్క ప్రజాప్రతినిధి రాలేకపోయారని మండిపడ్డారు. అధికారులతో లెక్కలు తీయించడం, తర్వాత మోసం చేయడం అలవాటుగా మారిందని ఆరోపించారు. నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల 5 లక్షల ఎకరాల్లో రూ.1,250 కోట్ల పంట నష్టం జరిగితే.. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఎలాంటి భరోసా ఇవ్వకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పంటలు నష్టపోయినప్పుడు ఎకరాకు రూ.10 వేలు ఇచ్చే సబ్సిడీలను ఎత్తేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదని తెలిపారు. ప్రతి ఏడాది ఏదో రకంగా రైతు నష్టపోతున్నాడని, వారి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

హాస్టల్‌లో ర్యాగింగ్ భూతం

- జూనియర్‌ను చితకబాదిన పదో తరగతి విద్యార్థి
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఘటన


విద్యార్థి మెడపై చేతిగోళ్ల గాట్లు

జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ఓ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో జూనియర్ విద్యార్థిని ఓ 10వ తరగతి విద్యార్థి చితకబాదాడు. ఆలస్యంగా సోమవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జడ్చర్ల హాస్టల్‌లో అక్షయ్‌కుమార్ అనే బాలుడు 9వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో ఓ పదో తరగతి విద్యార్థి తాను చెప్పిందే వినాలని కొంతకాలంగా జూనియర్లను భయపెడుతూ మాటవిననివారిని కొడుతున్నాడు. హోలీ పండగ రోజు అర్ధరాత్రి నిద్రపోతున్న తనతోపాటు మరికొందరు విద్యార్థులను లేపి డాన్స్ చేయమని బెదిరించాడని, చేయకుంటే కొట్టాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే నాలుగింతలు దెబ్బలు తింటారని బెదిరించడంతో ఎవరికీ చెప్పుకోలేదని బాధిత విద్యార్థి వాపోయాడు. ఇదే క్రమంలో శనివారంరాత్రి మరోమారు గదికి వచ్చి కర్రతో ఇష్టం వచ్చినట్లు తనను కొట్టాడని, దెబ్బలు తాళలేక ఆదివారం ఉదయం జడ్చర్లలోని తన మేనత్త శాంతమ్మ వద్దకు వెళ్లినట్లు కన్నీటి పర్యంతమయ్యాడు. మేనత్త అతడికి ఆసుపత్రిలో చికిత్స చేయించిన అనంతరం వార్డెన్‌కు ఫిర్యాదు చేసింది. అయినా దాడిచేసిన విద్యార్థిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం ఉదయం హాస్టల్ ఎదుట బాధిత విద్యార్థి, బంధువులు ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఎస్‌డబ్ల్యూవో విజయలక్ష్మి హాస్టల్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. ఆ ఇద్దరితోపాటు ఇతర విద్యార్థులతో మాట్లాడి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించారు. హాస్టల్‌పై పర్యవేక్షణ కొరవడటం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని బాధిత విద్యార్థి బంధువులు ఆరోపించారు. ఆవేశంలో తాను తప్పు చేశానని, ఇకపై అలా చేయబోనని ఆ పదో తరగతి విద్యార్థి లిఖితపూర్వకంగా రాసిచ్చాడు. త్వరలో పరీక్షలు ఉండటంతో అతడిని మందలించి వదిలేసినట్లు తెలుస్తోంది.

హత్యా..? ఆత్మహత్యా..?

- రైలు పట్టాలపై మహిళ మృతదేహం


అనూష

మహబూబాబాద్ రూరల్: రైలు పట్టాలపై వివస్త్రగా ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. వివరాలిలా.. పూసపాటి అశోక్, అనూష(27) దంపతులు మహబూబాబాద్‌లోని హస్తినాపురం కాలనీలో ఉంటున్నారు. అశోక్ వరంగల్‌లోని కోటక్‌బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం సిగ్నల్ కాలనీ ఆఫ్‌లైన్ 435/23 కిలోమీటర్ల రాయి వద్ద అనూష మృతి చెంది ఉన్న దృశ్యాన్ని చూసిన ఆర్‌పీఎఫ్ పోలీసులు మృతదేహాన్ని ఖమ్మం మార్చురీకి తరలించారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న అశోక్.. రైలు పట్టాలపై లభించిన మృతదేహం తన భార్యదేనని, మతిస్థిమితం లేకనే ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు చెప్పాడు. గతంలోనూ బావిలోకి దూకి, మరోసారి రెండస్తుల భవనంపై నుంచి కిందకు దూకినట్లు చెప్పాడు. కాగా, అల్లుడు అశోక్ వరకట్నం కోసం వేధించడంతోనే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని మృతురాలి తండ్రి నెల్లుట్ల సాంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాసంగి ధాన్యం.. 80 లక్షల మెట్రిక్ టన్నులు

సేకరణపై మంత్రి గంగుల ఉన్నతస్థాయి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: యాసంగి ధాన్యం సేకరణలో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్న తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం తగిన సహకారం అందించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. యాసంగి ధాన్యం సేకరణపై సోమవారం ఇక్కడి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మంత్రి గంగుల ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో యాసంగి ధాన్యం సేకరణ ప్రణాళిక వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి ఇప్పటివరకూ రైతాంగానికి కోటీ 21 లక్షల కోట్ల రూపాయలను ధాన్యం సేకరణ నిమిత్తం చెల్లించినట్లు చెప్పారు. యాసంగి ధాన్యం సేకరణలో దేశంలోనే నంబర్ 1గా ఉన్నామని, ఈసారి యాసంగి లక్ష్యం 80 లక్షల మెట్రిక్ టన్నులుగా కేంద్రం నిర్ణయించిందని తెలిపారు. రైతుబంధు, 24 గంటల ఉచిత కరెంటు, కనీస మద్దతుధర అమలు వంటి రైతు అనుకూల విధానాల ఫలితంగానే అగ్రభాగాన నిలిచినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల గుర్తింపు, జియో ట్యాగింగ్, ట్రాన్స్‌పోర్టు, మిల్లర్ల అనుసంధానం, గన్నీలు, ప్యాడీక్లీనర్లు, మాయిశ్చర్ మిషన్లు, టార్పాలిన్లు తదితరాలను సంపూర్ణంగా సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించినా, రైతులకు ఇబ్బందులు ఎదురైనా అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ అందించడానికి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులతో మాట్లాడి గన్నీల తరలింపునకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అకాల వర్షాలకు అనుగుణంగా కొనుగోలు ఏర్పాట్లు చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సీఎం ఆమోదానికి పంపనున్నట్లు తెలిపారు.

ఐవీఆర్ఎస్ నంబర్ ప్రారంభం: పౌర సరఫరాల శాఖకు సంబంధించిన సేవల్ని పౌరులకు మరింత చేరువ చేసేందుకు వీలుగా శాఖకు సంబంధించి ఐవీఆర్ఎస్ నంబర్ (799712345)ను మంత్రి గంగుల ప్రారంభించారు. వీటి ద్వారా కొత్త ఎఫ్ఎస్‌సీ కార్డుల సమస్యలు, పోర్టబిలిటీకి వీలు కలుగుతుంది. ఈ అప్లికేషన్ రూపకల్పనకు కృషి చేసిన ఎన్ఐసీ ఉద్యోగులను అభినందించి మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం చేసారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, పౌర సరఫరాల కమిషనర్ వి.అనిల్ కుమార్, ఎఫ్‌సీఐ డీజీఎం కిరణ్ కుమార్, కంక్వేర్ ఈడీ జి.ఆర్.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలు

కొమురవెల్లి(సిద్దిపేట): సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. సంక్రాంతి తర్వాత వచ్చే ఆదివారంతో ప్రారంభమైన ఉత్సవాలు ఉగాది పర్వదినానికి ముందు ఆదివారం రాత్రి నిర్వహించిన అగ్నిగుండాలతో ముగిశాయి. 9 వారాలు కొనసాగిన జాతరలో సుమారు 10 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో కీలకమైన అగ్నిగుండాల కార్యక్రమం ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమై సోమవారం వేకువజాము వరకు సాగింది. వీరశైవ ఆగమ శాస్త్ర పద్ధతిలో అగ్నిగుండాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పంచ పల్లవాలైన మర్రి, మేడి , మామిడి, మోదుగు, జమ్మి చెట్ల కర్రలు తెచ్చి ఒకచోట పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. పంచ పల్లవాలతో అగ్ని గుండంగా తయారు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఉత్సవ విగ్రహాలను తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొదట అగ్ని గుండం దాటిన తర్వాత అధికారులు, భక్తులు అగ్నిగుండాలను దాటి స్వామిని దర్శించుకున్నారు.

ఇంటి పట్టాల కోసం కదం తొక్కిన ఆదివాసీలు

- అదనపు కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ


కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న ఆదివాసీలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల మండలం బట్టిసవర్గాం శివారులోని సర్వే నంబర్ 72లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న తొమ్మిది తెగల ఆదివాసీలు ఇంటి పట్టాలు ఇవ్వాలనే డిమాండ్‌తో సోమవారం ఆందోళన బాట పట్టారు. ఆక్రమిత కొమురంభీం కాలనీ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అక్కడే బైఠాయించారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ మాట్లాడుతూ సర్వేనంబర్ 72లో 460 ఎకరాల ప్రభుత్వ భూములుంటే, వాటిని కొంతమంది రియల్ వ్యాపారులు, రాజకీయ నాయకులు, పలువురు రెవెన్యూశాఖ అధికారులు కలిసి కబ్జా చేశారని ఆరోపించారు. ఆ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి, లేఅవుట్లు, రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నా జిల్లా ఉన్నతాధికారులు మౌనం పాటించడం శోచనీయమన్నారు. ఈ భూమిలోని రిజిస్ట్రేషన్లన్నింటినీ రద్దు చేసి అర్హులైన నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని గణేశ్ డిమాండ్ చేశారు. గుడిసెల్లో ఉంటున్న ఆదివాసీలను అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు యత్నిస్తున్నారని దీన్ని ప్రజాస్వామిక వాదులంతా వ్యతిరేకించాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్, ఆర్డీవో రాథోడ్ రమేశ్‌తో కలిసి వారి వద్దకు రాగా కేఆర్‌కే కాలనీ తరహాలోనే అర్హులైన పేదలకు 25/20 సైజ్‌తో కూడిన ఇంటి స్థలాలు అందించాలని విన్నవించారు. ఈమేరకు ఆయన స్పందిస్తూ ఈ భూ వివాదంపై కోర్టులో కేసు నడుస్తుందని, అది తేలకుండా ఎలాంటి చర్యలు చేపట్టడానికి అవకాశం లేదన్నారు. ఈమేరకు ఆయనకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రంతో పాటు దరఖాస్తుల కట్టలను అందజేసి తమ ఆందోళన విరమించారు.

ప్రీతి కేసు ఆత్మహత్య కోణంలో దర్యాప్తు

- వరంగల్ సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: వరంగల్ కేఎంసీ మెడికల్ విద్యార్థిని డాక్టర్ ప్రీతి కేసులో హత్య అన్న ఆరోపణలకు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలూ దొరకలేదని, ఆత్మహత్య కోణంలోనే దర్యాప్తు చేస్తున్నట్లు వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ తెలిపారు. సోమవారం ఓ కేసు విషయమై కమిషనరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రీతి కేసు దర్యాప్తుపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ప్రీతి కేసుకు సంబంధించి అన్ని విషయాలను కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తే స్పష్టత వచ్చే అవకాశముందని, ఈ కేసు విషయంలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయని వెల్లడించారు. నిందితుడు సైఫ్‌తో పాటు ఇంకా ఎవరికైనా సంబంధాలున్నాయా? అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. కేఎంసీలో ర్యాగింగ్ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ఈ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలొచ్చే అవకాశముందని రంగనాథ్ తెలిపారు.


సరదాగా...

రైల్వేస్టేషన్లో బూతు వీడియో!

పట్నా: అది బిహార్ రాజధాని పట్నా రైల్వే స్టేషన్. పదో నంబర్ ప్లాట్‌ఫాం. ఉదయం 9.30 గంటలు. ప్రయాణికులతో కిటకిటలాడుతున్న వేళ టీవీ సెట్లలో వాణిజ్య ప్రకటనల స్థానంలో ఉన్నట్టుండి మూడు నిమిషాల పాటు బూతు వీడియో ప్రసారమైంది! మార్చి 19న ఈ ఘటన జరిగింది. ప్రయాణికులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రసారం ఆగలేదు. చివరికి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది కలగజేసుకోవడంతో ప్రకటనల కాంట్రాక్ట్ సంస్థ నాలుక్కరుచుకుని వీడియో క్లిప్ ప్రసారాన్ని ఆపేసింది. సదరు సంస్థ కాంట్రాక్టును రైల్వే శాఖ రద్దు చేసింది. నిషేధిత జాబితాలో చేర్చి కేసులు పెట్టడమే గాక భారీ జరిమానా విధించింది.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు... 80 మందితో ఆప్ జాబితా

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న 80 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను ఆమ్ ఆద్మీ పార్టీ సోమవారం విడుదల చేసింది. మేలో జరగనున్న ఎన్నికల్లో మొత్తం 224 స్థానాల్లోనూ పోటీ చేస్తామని ఆప్ రాష్ట్ర చీఫ్ పృథ్వీ రెడ్డి చెప్పారు. మొదటి జాబితాలోని అందరూ ఉన్నత విద్యావంతులే. వీరిలో 13 మంది లాయర్లు, ముగ్గురు డాక్టర్లు, నలుగురు ఐటీ నిపుణులు ఉన్నారు. అభ్యర్థుల్లో సగం కంటే ఎక్కువ మంది 45 ఏళ్లలోపు వారేనని, వీరందరినీ సర్వే ద్వారా ఎంపిక చేసినట్లు పృథ్వీ రెడ్డి వెల్లడించారు. మొదటి జాబితాలో సుప్రీం కోర్టు లాయర్ బ్రిజేశ్ కాలప్ప, బృహత్ బెంగళూరు మహానగర పాలికె(బీబీఎంపీ)మాజీ అధికారి కె.మత్తయి, బీటీ నాగన్న, మోహన్ దాసరి, శంతల దామ్లే, అజయ్ గౌడ తదితరులున్నారని పృథ్వీ రెడ్డి చెప్పారు.



ధనూరాశి నక్షత్ర మండలంలోని దక్షిణ ప్రాంతంలో భాగమైన మెసియర్55 ఇలా ధగధగలాడుతోంది. భూమికి 20వేల కాంతి సంవత్సరాల దూరంలోని ఈ ప్రాంతంలో ఒకేచోట 1,00,000 నక్షత్రాలు పోగుబడ్డాయి. హబుల్ టెలిస్కోప్ తీసిన ఈ ఫొటోను ఇటీవల నాసా విడుదలచేసింది.

వేడి అలలు... జీవజాలానికి ఉరితాళ్లు!



- భూతాపం వల్ల వేడెక్కుతున్న సముద్రాల అడుగు భాగం
- మెరైన్ హీట్‌వేవ్స్‌తో సముద్ర జీవావరణ వ్యవస్థకు ముప్పు
- సముద్రాల ఉష్ణోగ్రత వందేళ్లలో సగటున 1.5 డిగ్రీలు పెరుగుదల
- పరిస్థితి ఇలాగే కొనసాగితే పగడపు దీవులన్నీ అంతం

నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భూతాపం (గ్లోబల్ వార్మింగ్) వల్ల భూఉపరితం క్రమంగా వేడెక్కుతోంది. భూమిపై విలువైన జీవావరణ వ్యవస్థ దెబ్బతింటోంది. పర్యావరణ విధ్వంసం చోటుచేసుకుంటోంది. ఈ పరిణామం కేవలం భూమి ఉపరితలంపైనే కాదు, సముద్రాల అంతర్భాగాల్లోనూ సంభవిస్తున్నట్లు అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఉన్న నేషనల్ ఓషియానిక్, అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్(ఎన్‌ఓఏఏ) నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. అధిక ఉష్ణోగ్రతల వల్ల సముద్రాల అడుగు భాగం సైతం వేడెక్కుతోందని, అక్కడున్న జీవజాలం ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటోందని తేలింది. ఫలితంగా సముద్ర జీవావరణ వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమవుతున్నట్లు పరిశోధకులు చెప్పారు. భూతాపంతో సముద్రాల్లో వేడి అలల తీవ్రత పెరుగుతోంది. ఇవన్నీ ప్రమాద ఘంటికలే'' అని హెచ్చరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ భూతాపం?

శిలాజ ఇంధనాల వినియోగం, కర్బన ఉద్గారాల వల్ల వాతావరణ మార్పులు, తద్వారా భూ ఉపరితలంపై ఉష్ణోగ్రతలు పెరగడమే భూతాపం. భూగోళంపై జనాభా వేగంగా పెరుగుతుండడంతో అదే స్థాయిలో శిలాజ ఇంధనాల వినియోగం సైతం పెరుగుతోంది. బొగ్గు, చమురు, గ్యాస్ వంటివి మండించడం వల్ల భూమి వేడెక్కుతుంది. దీంతోపాటు అడవుల నరికివేత, పారిశ్రామిక విప్లవం, అగ్నిపర్వతాల పేలుళ్లు, నీరు వేగంగా ఆవిరి కావడం, అడవుల్లో కార్చిచ్చు వంటివి కూడా భూతాపానికి కారణాలే. వాస్తవానికి సూర్య కాంతి వల్ల సంభవించే వేడి వాతావరణంలోకి తిరిగి వెనక్కి వెళ్తుంది. శిలాజ ఇంధనాల వాడకం వల్ల ఉత్పన్నమయ్యే విష వాయువులు వేడి వెనక్కి వెళ్లకుండా అడ్డుకుంటాయి. దీంతో భూమిపై ఉష్ణోగ్రత పెరిగిపోతుంది. ఈ ప్రభావం సముద్రాలపైనా పడుతుంది.

అధ్యయనంలో ఏం తేలిందంటే...

మెరైన్ హీట్‌వేవ్స్‌గా పిలిచే సముద్రాల అంతర్భాగాల్లోని వేడి అలల తీవ్రత, వ్యవధి అధికంగా ఉంది. సముద్రాల లోపలి ఉష్ణోగ్రతలు వేర్వేరు ప్రాంతాల్లో 0.5 డిగ్రీల సెల్సియస్ నుంచి 3 డిగ్రీల సెల్సియస్ దాకా పెరిగాయి.

సముద్రాల ఉపరితలంలో హీట్‌వేవ్స్‌పై గత పదేళ్లుగా పరిశోధనలు కొనసాగిస్తున్నామని, అంతర్భాగంలోని వేడి అలలు, అక్కడి పరిణామాలు, జీవజాలం ప్రభావితం అవుతున్న తీరు గురించి తెలుసుకోవడం ఇదే మొదటిసారి అని ఎన్‌ఓఏఏ రీసెర్చ్ సైంటిస్టు దిల్లాన్ అమాయా చెప్పారు.

ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సముద్ర జీవుల వలసలు ఆగిపోతున్నాయి. వాటిలో పునరుత్పాదక శక్తి దెబ్బతింటోంది. వివిధ జీవుల మధ్య అనుసంధానం తెగిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మొత్తం సముద్ర జీవావరణ వ్యవస్థ ప్రమాదంలో పడుతున్నట్లే లెక్క.

సముద్రాల ఉష్ణోగ్రత 1.5 డిగ్రీలు పెరిగితే 70–90 శాతం, 2 డిగ్రీలు పెరిగితే పూర్తిగా పగడపు దీవులు మాయమవుతాయని యునెస్కో పేర్కొంది.

సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదలకు భూతాపం కారణమని సైంటిస్టులు నిర్ధారించారు.

హీట్‌వేవ్స్ ప్రభావం ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా అన్ని సముద్రాల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.



హీట్‌వేవ్స్ వల్ల మరణించిన సముద్ర పక్షులు

భూతాపం వల్ల నీరు ఇలాగే వేడెక్కడం కొనసాగితే ఈ శతాబ్దం ఆఖరు నాటికి సముద్రాల్లోని పగడపు దీవులన్నీ అంతరించిపోతాయని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వెల్లడించింది.

సముద్రాల్లో ఉండే ప్లాంక్టన్ అనే సూక్ష్మజీవుల నుంచి భారీ పరిమాణంలోని వేల్స్ దాకా అన్ని రకాల జీవులు హీట్‌వేవ్స్ వల్ల ప్రభావితమవుతున్నాయి.

సముద్రాలే రక్షణ ఛత్రం

భూతాపం వల్ల ఉత్పన్నమయ్యే ఉష్ణోగ్రతలో 90% మిగులు వేడిని సముద్రాలే శోషించుకుంటాయి. భూమిని చల్లబరుస్తాయి. సముద్రాలే లేకుంటే భూమి అగ్నిగుండం అయ్యేది. సాగరాల ఉష్ణోగ్రత గత శతాబ్ద కాలంలో సగటున 1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగింది. మెరైన్ హీట్‌వేవ్స్ గత పదేళ్లలో 50% పెరిగాయి. భూతాపం పెరుగుదలను అడ్డుకోకపోతే సముద్రాలు సలసల కాగిపోవడం ఖాయం. ఫలితంగా భూమి అగ్నిగోళంగా మారుతుంది మానవులతో సహా జీవుల మనుగడ ప్రశ్నార్థకమే అవుతుంది.

నిరుద్యోగులకు రూ.3,000

కర్ణాటకలో రాహుల్‌గాంధీ ఎన్నికల హామీ

బసవకళ్యాణ: కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే డిగ్రీ చదివిన వారికి నెలకు రూ.3,000, డిప్లొమా చేసిన వారికి రూ.1,500 నిరుద్యోగ భృతి ఇస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. ''యువతకు ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలిస్తాం. 2.5 లక్షల ప్రభుత్వోద్యోగాల ఖాళీలను భర్తీచేస్తాం' అని హామీ ఇచ్చారు. సోమవారం బెళగావిలో 'యువక్రాంతి' బహిరంగ సభ ఆయన ప్రసంగించారు. కర్ణాటకలో పాలక బీజేపీని కాంగ్రెస్ నేతలు ఐక్యమత్యంతో కలిసి ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. ''బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం 40 శాతం కమిషన్లు మరిగింది. దేశంలో అత్యంత అవినీతిమయ సర్కార్'' అని ఆరోపించారు. ''దేశం ఒకరిద్దరి సొత్తు కాదు. అదానీలది అస్సలు కాదు. కానీ బీజేపీ స్నేహితులైన కొద్దిమందికే సర్వం దక్కుతున్నాయి. ఇది అవినీతికి దారితీస్తుంది'' అని రాహుల్ ఆరోపించారు. గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళ ఇంటిపెద్దగా ఉన్న కుటుంబానికి నెలకు రూ.2,000 ఆర్థికసాయం, దారిద్ర్య రేఖ దిగువన ఉన్న కుటుంబాల్లో ప్రతీ సభ్యుడికి నెలకు 10 కేజీల ఉచిత బియ్యం ఇస్తామని ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ ఇప్పటికే మూడు హామీలు ప్రకటించింది. సోమవారం నాలుగో హామీ ఇచ్చింది.



సోమవారం ఢిల్లీలోని బుద్ధజయంతి పార్కులో పానీపూరీని ఆస్వాదిస్తున్న మోదీ, కిషిదా

జపాన్‌తో బంధం బలోపేతం

కిషిదా, మోదీ చర్చలు

న్యూఢిల్లీ: భారత్–జపాన్ అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసేందుకు ఇరు దేశాల ప్రధానులు ప్రతినబూనారు. ఈ మేరకు రెండు దేశాల అగ్రనేతలు ప్రధాని మోదీ, జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదాలు సోమవారం ఢిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. 27 గంటల భారత పర్యటనలో భాగంగా కిషిదా ఢిల్లీకొచ్చిన విషయం తెల్సిందే. రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనాలతోపాటు ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిర, స్వేచ్ఛాయుత వాతావరణం పరిఢవిల్లేలా చూసేందుకే ద్వైపాక్షిక చర్చలు సాగించినట్లు ఇరు దేశాధినేతలు ప్రకటించారు. ఇండో–పసిఫిక్ ప్రాంతాన్ని తన ఆధిపత్య నీడలోకి తెచ్చేందుకు సాహసిస్తున్న చైనాకు చెక్ పెట్టేందుకు, ఉక్రెయిన్ యుద్ధంతో ఉద్రిక్తతలు నెలకొన్న అంతర్జాతీయ సమాజంలో శాంతి స్థాపనకు తమ వంతు కృషిచేసేందుకు జపాన్, భారత్‌లు ముందుకొచ్చినట్లు నేతలు తెలిపారు. ' జీ20 సదస్సుకు భారత్, జీ7 కూటమికి జపాన్ అధ్యక్షత వహిస్తున్న ఈ తరుణం ప్రపంచ శ్రేయస్సు కోసం చేసే కృషికి చక్కని అవకాశం. జీ20 అధ్యక్షతన భారత ప్రాధాన్యాలను కిషిదాకు వివరించా. భారత్–జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యం అనేది ప్రజాస్వామ్య సూత్రాలు, ప్రపంచ చట్టాలను గౌరవిస్తూ ఏర్పడిందే. ఇండో–పసిఫిక్ ప్రాంతానికి ఇదెంతో ముఖ్యం. రక్షణ, డిజిటల్ సాంకేతికత, వాణిజ్యం, పెట్టుబడులు, ఆరోగ్యం, సెమీ కండక్టర్ల సరఫరా గొలుసు, సంక్లిష్ట సాంకేతికత తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాల బలపేతంపై మేం సమీక్ష చేశాం' అని తర్వాత పత్రికా ప్రకటనలో ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ' భారత్‌తో ఆర్థిక తోడ్పాటు గణనీయంగా పెరుగుతోంది. ఇది భవిష్యత్ వృద్ధికేకాదు జపాన్ ఆర్థిక అవకాశాలకు ఎంతగానో ఊతమిస్తుంది. స్వేచ్ఛాయుత ఇండో –పసిఫిక్ విధానాన్ని నేడు భారత గడ్డపై మోదీ సమక్షంలో ఆవిష్కరించా. మేలో జరిగే జీ7 సదస్సుకు మోదీని సాదరంగా ఆహ్వానించా' అని ఫ్యుమియో కిషిదా చెప్పారు.

పలు ఒప్పందాలపై సంతకాలు

ఇరు దేశాలపై ఉక్రెయిన్ యుద్ధ విపరిణామాల ప్రభావం, ఇండో–పసిఫిక్ పరిస్థితి, సైనిక హార్డ్‌వేర్‌ను ఉమ్మడి అభివృద్ధి చేయడం వంటి కీలకాంశాలూ చర్చకొచ్చాయి. ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కోసం జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ నుంచి నాలుగో విడత 300 బిలియన్ యెన్‌ల(రూ.18,800 కోట్ల) రుణానికి సంబంధించిన ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేశాయి.

మోదీ, కిషిదా వన విహారం చేశారు. రాష్ట్రపతి భవన్ వెనక ఉన్న సెంట్రల్ రిడ్జ్ రిజర్వ్‌ఫారెస్ట్ పరిధిలోని బుద్ధ జయంతి పార్క్‌లో ఇరు నేతలు కొద్దిసేపు కలియతిరిగారు. గౌతమ బుద్ధుని 2,500వ జయంతిని పురస్కరించుకుని దాన్నాళ్ల క్రితం ఈ పార్క్‌ను అభివృద్ధిచేశారు. పార్క్‌లోని బుద్ధుని ప్రతిమకు నేతలు నివాళులర్పించారు. బోధి వృక్షం మొక్కను కిషిదాకు మోదీ బహూకరించారు. పార్క్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్టాల్‌లో భారతీయ చిరుతిండిని కిషిదా రుచిచూశారు. నేతలిద్దరూ పానీపూరీ (గోల్‌గప్పా), ఫ్రైడ్ ఇడ్లీ ఆరగించారు. వేయించిన మామిడికాయల గుజ్జు రసాన్ని తాగారు. తర్వాత బెంచ్‌పై కబుర్లు చెప్పుకుంటూ చాయ్ తాగారు. ఈ పార్క్‌ను 1964 అక్టోబర్‌లో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ప్రారంభించారు.

పానీపూరీ ఆస్వాదిస్తూ..
బెంచ్‌పై కబుర్లు చెప్పుకుంటూ..

ఏమిటీ సీల్డ్‌కవర్ సంస్కృతి?

కేంద్రం తీరుపై సుప్రీం అసహనం

- సీల్డ్ కవర్ నోట్ తిరస్కరణ
- ఓఆర్‌ఓపీ బకాయిలు ఫిబ్రవరిలోగా పూర్తిగా చెల్లించాలని ఆదేశం



న్యూఢిల్లీ: మాజీ సైనికోద్యోగుల వన్ ర్యాంక్, వన్ పెన్షన్ (ఓఆర్‌ఓపీ) తాలూకు రూ.28,000 కోట్ల బకాయిలను వచ్చే ఫిబ్రవరికల్లా చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ విషయమై గతేడాది తామిచ్చిన ఉత్తర్వులకు కట్టుబడి ఉండాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు పి.ఎస్.నరసింహ, జె.బి.పార్దీవాలా ధర్మాసనం స్పష్టం చేసింది. ఓఆర్‌ఓపీ బకాయిలపై భారీ మాజీ సైనికోద్యోగుల ఉద్యమం (ఐఈఎస్ఎం) పిటిషన్‌పై సోమవారం ధర్మాసనం విచారణ జరిపింది. బకాయిల చెల్లింపునకు కాలావధిని ఖరారు చేసింది. దీనిపై కేంద్రం సీల్డ్ కవర్లో సమర్పించిన నోట్‌ను స్వీకరించేందుకు నిరాకరించింది. ఈ సంస్కృతి సముచిత న్యాయ ప్రక్రియకు విరుద్ధమని సీజేఐ అభిప్రాయపడ్డారు. దానికి తెర పడాలన్నారు. ''వ్యక్తిగతంగా కూడా సీల్డ్ కవర్లకు నేను వ్యతిరేకిని. కోర్టులో పారదర్శకత చాలా ముఖ్యం. అంతిమంగా ఉత్తర్వులను అమలు చేయాల్సిందే. అందులో రహస్యమేముంటుంది?'' అని ప్రశ్నించారు.

'సహజీవనం' పిల్ కొట్టివేత

సహజీవన బంధాన్ని 'గుర్తించి' కేంద్రం తగు మార్గదర్శకాలను రూపొందించాలంటూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ''ఇదో తెలివితక్కువ వ్యాజ్యం. వాటిని రిజిస్టర్ చేసి కేంద్రం మాత్రం ఏం చేస్తుంది?'' అంటూ పిటిషనర్‌కు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తలంటారు. బాల్య వివాహాల చట్టం, రజస్వల అయిన బాలికకు పెళ్లిని అనుమతిస్తున్న ముస్లిం చట్టాల మధ్య ఘర్షణ తలెత్తితే ఏం చేయాలన్న అంశాన్ని విచారణకు స్వీకరిస్తున్నట్టు సుప్రీంకోర్టు పేర్కొంది.

రష్యాలో జిన్‌పింగ్

మూడు రోజుల అధికారిక పర్యటన • పుతిన్‌తో చర్చలు



మాస్కో: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు రష్యాలో ఘనస్వాగతం లభించింది. మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఆయన సోమవారం రష్యా రాజధాని మాస్కోకు చేరుకున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. అవధులు లేని తమ స్నేహాన్ని మరింత పెంపొందించుకోవడానికి ఇదొక గొప్ప అవకాశంగా భావిస్తున్నట్లు ఇరువురు నేతలు ప్రకటించారు. రష్యాపై దండయాత్రకు దిగిన రష్యాను ఒంటరిని చేసేందుకు పశ్చిమ దేశాలు తీవ్రంగా ప్రయత్నిస్తుండడం, యుద్ధ నేరాల ఆరోపణల కింద పుతిన్‌కు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అరెస్ట్ వారెంటు జారీ చేసిన చేసిన నేపథ్యంలో జిన్‌పింగ్ రష్యా పర్యటన ప్రారంభించడం విశేష ప్రాధాన్యం సంతరించుకుంది.

శాంతి చర్చల కోసం పుతిన్‌పై ఒత్తిడి!

ప్రపంచంలో రెండు బలమైన దేశాల అధినేతలు జిన్‌పింగ్, పుతిన్ సోమవారం చర్చలు ప్రారంభించారు. ప్రధానంగా ఉక్రెయిన్–రష్యా యుద్ధం, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. జిన్‌పింగ్, పుతిన్ మధ్య ముఖాముఖి చర్చల తర్వాత ఇరుదేశాల నడుమ ప్రతినిధుల స్థాయి చర్చలు ప్రారంభమవుతాయని రష్యా ప్రభుత్వ అధికారి యురీ ఉషాకోవ్ చెప్పారు. ఇద్దరు నాయకుల చర్చలు మంగళవారం కూడా కొనసాగుతాయని రష్యా మీడియా వెల్లడించింది. జిన్‌పింగ్ చైనా అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత రష్యాలో పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వరుసగా మూడోసారి చైనా అధ్యక్షుడిగా, సైనికాధిపతిగా ఎన్నికైన తర్వాత జిన్‌పింగ్ తొలి విదేశీ పర్యటన కూడా ఇదే. ఉక్రెయిన్–రష్యా మధ్య శాంతి నెలకొనాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు జిన్‌పింగ్ చెప్పారు. ఉక్రెయిన్ సంక్షోభానికి తెరదించడమే లక్ష్యంగా శాంతి చర్చల కోసం పుతిన్‌పై ఆయన ఒత్తిడి తెచ్చే అవకాశం ఉన్నట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. బద్ధశత్రువులైన ఇరాన్, సౌదీ అరేబియా ఇటీవలే చేతులు కలిపాయి. దీని వెనుక చైనా దౌత్యం ఉంది. గత పదేళ్లుగా చైనా అధ్యక్షుడిగా పదవిలో కొనసాగుతూ ఇటీవలే మూడోసారి ఎన్నికైన జిన్‌పింగ్ రష్యాతో సన్నిహిత సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధం విషయంలో రష్యా వైఖరిని ప్రపంచంలో చాలా దేశాలు తప్పుపట్టినప్పటికీ జిన్‌పింగ్ మాత్రం పరోక్షంగా మద్దతు ప్రకటించారు. అమెరికా వ్యతిరేకతే చైనా, రష్యా దేశాలను ఒక్కటి చేస్తోంది.

శాంతి ప్రణాళికతో వచ్చా: జిన్‌పింగ్

చైనా, రష్యా కలిసికట్టుగా ముందుకెళ్తున్నాయని, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకుంటున్నాయని జిన్‌పింగ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. థర్డ్ పార్టీని తాము లక్ష్యంగా చేసుకోవడం లేదన్నారు. రెండు పెద్ద దేశాల సంబంధాల విషయంలో ఒక కొత్త మోడల్‌ను అభివృద్ధి చేస్తున్నామని ఉద్ఘాటించారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన ఇంటర్నేషనల్ సిస్టమ్, ఇంటర్నేషనల్ లా పరిరక్షణ కోసం రష్యాతో కలిసి పని చేస్తూనే ఉంటామని జిన్‌పింగ్ తేల్చిచెప్పారు. ఉక్రెయిన్–రష్యా మధ్య యుద్ధానికి ముగింపు పలికేలా శాంతి ప్రణాళికతో రష్యాకు వచ్చానన్నారు. ఉక్రెయిన్‌లో సంక్షోభాన్ని పరిష్కరించే విషయంలో చైనా చేసిన ప్రతిపాదనలను నిశితంగా పరిశీలిస్తున్నామని పుతిన్ తెలిపారు. దీనిపై జిన్‌పింగ్‌తో చర్చిస్తానని పేర్కొన్నారు. పలు అంతర్జాతీయ వ్యవహారాలు, సంక్షోభాల విషయంలో చైనా నిష్పాక్షిక, సమతూక వైఖరి అవలంబిస్తోందని పుతిన్ ప్రశంసించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో జిన్‌పింగ్ మాట్లాడే అవకాశమున్నట్లు సమాచారం. తన శాంతి ప్రణాళికను జెలెన్‌స్కీతో ఆయన పంచుకోనున్నట్లు తెలుస్తోంది.

అమృత్‌పాల్‌కు ఐఎస్ఐ లింకులు!

కోట్లాదిగా విదేశీ నిధులు

కొనసాగుతున్న వేట • మామ లొంగుబాటు

చండీగఢ్: ఖలిస్తానీ వేర్పాటువాది, 'వారిస్ పంజాబ్ దే' సంస్థ చీఫ్ అమృత్‌పాల్‌సింగ్ గురించి విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రైవేట్ సైన్యాన్ని తయారు చేసుకునేందుకు అతడు విదేశాల నుంచి భారీగా నిధులు సేకరించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఇటీవల అరెస్టైన అతని ప్రధాన అనుచరుడు దల్జీత్ సింగ్ బ్యాంకు ఖాతాలకు గత రెండేళ్లలో విదేశాల నుంచి రూ.35 కోట్లు జమ అయినట్టు తేలింది. పలు మోసపూరిత ఆర్థిక వ్యవహారాల్లోనూ అతను కీలకంగా వ్యవహరించాడు. అంతేగాక వారిస్ దే సంస్థకు అనుబంధంగా ఆనంద్‌పూర్ ఖల్సా ఫోర్స్ (ఏకేఎఫ్) ఏర్పాటుకు దల్జీత్ ప్రయత్నిస్తున్నట్లు తేలింది. మరోవైపు అమృత్‌పాల్ దుబాయ్‌లో ట్రక్ డ్రైవర్‌గా ఉండగా అతనికి ఐఎస్ఐ శిక్షణ ఇచ్చిందని పోలీసులంటున్నారు. ''భారత్‌లో విద్రోహ కార్యకలాపాలు చేపట్టేలా బ్రెయిన్ వాష్ చేసింది. అతనికి పలువురు డ్రగ్స్ పెడ్లర్ల మద్దతుంది. అమృత్‌పాల్ వాడే మెర్సిడెజ్ కారు రావెల్ సింగ్ అనే డ్రగ్ పెడ్లర్‌దే. రాష్ట్రవ్యాప్తంగా డీ అడిక్షన్ సెంటర్లు పెట్టి, అక్కడికొచ్చే వారిని తన దారిలోకి తెచ్చుకుంటున్నాడు. ఆ సెంటర్లలో ఆయుధాలు నిల్వ చేస్తున్నాడు. ఐఎస్ఐ సాయంతో మతం ముసుగులో పంజాబ్‌ను ప్రత్యేక దేశం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు'' అని చెబుతున్నారు. ఈ కోణాల్లో దర్యాప్తు సాగుతోంది. అమృత్‌పాల్ కోసం వేట కొనసాగుతోంది. అతడు కెనడాకు పారిపోయే అవకాశాలున్నట్టు భావిస్తున్నారు. అతని మామ హర్జిత్ సింగ్ సహా ఐదుగురు ఆదివారం అర్ధరాత్రి లొంగిపోయారు. వారిపై కఠినమైన జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద కేసులు పెట్టారు.

భారత కాన్సులేట్‌పై దాడి

వాషింగ్టన్/న్యూఢిల్లీ: అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ కార్యాలయంపై ఖలిస్తానీ అనుకూలవాదులు ఆదివారం దాడికి తెగబడ్డారు. ఆవరణలో ఖలిస్తానీ జెండాలు ఏర్పాటు చేశారు. మరోవైపు బ్రిటన్‌లో లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయంపై త్రివర్ణ పతాకాన్ని ఖలిస్తానీవాదులు తొలగించిన ఘటనపై కేంద్రం తీవ్ర నిరసన తెలిపింది.

నడ్డా రిమోట్ ఎక్కడుంది: ఖర్గే

బెల్గావీ (కర్నాటక): ప్రధాని నరేంద్ర మోదీ తనపై చేసిన రిమోట్ కంట్రోల్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం మండిపడ్డారు. ''నా రిమోట్ వేరెవరి దగ్గరో ఉందని మోదీ అంటున్నారు. సరే, ఒప్పుకుంటా. అయితే బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా రిమోట్ కంట్రోల్ ఎవరి దగ్గరుందో కూడా ఆయనే చెబితే బాగుంటుంది'' అంటూ ఎద్దేవా చేశారు. ''బీజేపీ దమ్మూ ధైర్యం లేని పార్టీ. మీ లోపాల గురించి మాట్లాడాలంటే చాలా ఉన్నాయి. మాపైకి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పితే బెదురుతామనుకుంటే అది మీ భ్రమ'' అన్నారు.

పార్లమెంటులో అదే సీను

దిగిరాని అధికార, విపక్షాలు • రాహుల్, అదానీలపై చర్చకు పట్టు • ఉభయ సభలు మళ్లీ వాయిదా



న్యూఢిల్లీ: అదే గందరగోళం. అవే సీన్లు. అటు అధికార పక్షం, ఇటు విపక్షాలు ఎవరి పట్టు మీద వారు బెట్టుగా నిలిచారు. దాంతో పార్లమెంటులో వారం రోజులుగా కన్పిస్తున్న దృశ్యాలే రిపీటయ్యాయి. ఇరు పక్షాల డిమాండ్లు, హోరాహోరీ నినాదాలు, గందరగోళం మధ్య కార్యకలాపాలేవీ జరపకుండానే ఉభయ సభలూ మంగళవారానికి వాయిదా పడ్డాయి. అలా మార్చి 13న మొదలైన మలి విడత బడ్జెట్ సమావేశాల్లో వరుసగా ఆరో రోజూ పూర్తిగా వృథా అయింది. సోమవారం ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే భారత ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ బ్రిటన్‌లో చేసిన వ్యాఖ్యలను అధికార బీజేపీ సభ్యులు మరోసారి లేవనెత్తారు. ఆయన క్షమాపణలకు డిమాండ్ చేశారు. ప్రతిగా అదానీ గ్రూప్ అవకతవకల అంశాన్ని కాంగ్రెస్ సహా విపక్ష సభ్యులు తెరపైకి తెచ్చారు. తాము డిమాండ్ చేస్తున్న మేరకు దానిపై సంయుక్త పార్లమెంటరీ సంఘంతో విచారణ జరిపించి తీరాల్సిందేనంటూ కుండబద్దలు కొట్టారు. ఇరు పక్షాలూ పెద్ద పెట్టున నినాదాలు మొదలుపెట్టాయి. ఉభయ పక్షాలూ తన చాంబర్‌కు వస్తే చర్చించుకుని పరిష్కారానికి వద్దామని స్పీకర్ ఓం బిర్లా పదేపదే సూచించినా లాభం లేకపోయింది. దాంతో సభను మధ్యాహ్నం రెండింటి దాకా వాయిదా వేశారు. తిరిగి సమావేశమయ్యాక కొన్ని బిల్లులను ప్రవేశపెట్టగానే ఇరువైపుల నుంచి తిరిగి నినాదాలు, గందరగోళం మొదలయ్యాయి. దాంతో సభను స్పీకర్ మంగళవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ...

అటు రాజ్యసభలోనూ దాదాపుగా ఇదే దృశ్యాలు కన్పించాయి. సభ ప్రారంభమవుతూనే ఇరు పక్షాలూ నినాదాలకు దిగాయి. వాటి మధ్యే చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ మాట్లాడారు. అదానీ వ్యవహారంపై జేపీసీ వేయడంలో ప్రభుత్వ వైఫల్యంపై చర్చించాలంటూ 267(9) నిబంధన కింద కాంగ్రెస్ సభ్యులు నోటీసు అందజేసినట్టు పేర్కొన్నారు. దాని ప్రకారం ముందుగా నిర్ణయించిన కార్యకలాపాలను పక్కన పెట్టి నోటీసు అంశాన్ని చర్చకు చేపట్టాల్సి ఉంటుంది. అదానీ వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి విచారణకు సీపీఐ, సీపీఎం సభ్యులు డిమాండ్ చేశారు. నినాదాల హోరు, గందరగోళం అంతకంతకూ పెరిగిపోవడంతో సభ మధ్యాహ్నం రెండింటిదాకా, అనంతరమూ అదే పరిస్థితి కొనసాగడంతో మంగళవారానికి వాయిదా పడింది.

కేసులకు బెదరను

వయనాడ్ (కేరళ): పోలీసు కేసులు, రాజకీయ దాడులతో తనను భయపెట్టలేరని రాహుల్‌గాంధీ అన్నారు. ''సత్యంపై నాకు విశ్వాసముంది. ఎప్పుడూ దానికే కట్టుబడి ఉన్నా. నాపై ఎంతగా దాడి చేసినా పట్టించుకోను. దాంతో, నేనెందుకు భయపడటం లేదా అన్నదే వారికిప్పుడు పెద్ద సమస్యగా మారింది'' అని బీజేపీపై చెణుకులు విసిరారు.

నా వ్యాఖ్యలపై లోక్‌సభలో మాట్లాడతా

స్పీకర్‌కు రాహుల్ లేఖ

''భారత ప్రజాస్వామ్యం గురించి బ్రిటన్లో నేను చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో స్పష్టత ఇస్తా. నేను మాట్లాడేందుకు అనుమతించండి'' అంటూ స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ లేఖ రాశారు. దీనిపై ఆయన ఇప్పటిదాకా బహిరంగంగా స్పందించలేదు. మంగళవారం మాట్లాడేందుకు రాహుల్‌కు అవకాశమివ్వాలని కోరినట్టు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ''మేమేం మాట్లాడబోయినా మైకులు కట్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని లండన్‌లో చెప్పినందుకు లేనిపోని ఆరోపణలు గుప్పిస్తున్నారు'' అని మండిపడ్డారు. రాహుల్ నివాసానికి పోలీసులు వెళ్లడాన్ని తప్పుబట్టారు. పార్లమెంట్‌లో తాము లేవనెత్తుతున్న అదానీ, చైనా చొరబాటు వంటి కీలకాంశాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే బీజేపీ ఇలా చేస్తోందన్నారు.



పూలతోటలో పడవ ప్రయాణం

పసుపురంగు రాప్‌సీడ్ పుష్పాలతో కనువిందు చేస్తున్న జైంజా ప్రాంతాన్ని పడవల్లో తిరుగుతూ పరవశించిపోతున్న పర్యాటకులు. చైనాలోని జియాంగ్సు ప్రావిన్స్‌లోని జింగ్‌హువా కియాన్డులో సోమవారం తీసిందీ ఫొటో.



రాజన్న సన్నిధిలో భక్తులు

వేములవాడ: రాజన్న సన్నిధిలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 25వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



లీకేజీపై ఆందోళనలు..

క్వశ్చన్ పేపర్ లీకేజీపై జిల్లావ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బీజేపీ, వివిధ పార్టీలు, సంఘాల వారు నిరసన తెలుపుతున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/22.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

భూ సేకరణ పనులు అడ్డగింత



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

రామడుగు(చొప్పదండి): జగిత్యాల–కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి నిర్మాణానికి రామడుగు మండలం వెదిర గ్రామ శివారులో భూసేకరణను సోమవారం రైతులు రెండోసారి అడ్డుకున్నారు. అధికారులు ఇష్టానుసారంగా కొలతలు వేస్తున్నారని ఆరోపించారు. రహదారి నిర్మాణంలో తమ విలువైన భూములు కోల్పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూములకు ఎంతమేర నష్టపరిహారం చెల్లిస్తారో చెప్పాకే భూ సేకరణ చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ రాజ్‌కుమార్ రైతుల సమస్యను ఉన్నతాధికారులకు చెప్తామన్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ.7,400



జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి గరిష్ట ధర రూ.7,400 పలికింది. సోమవారం మార్కెట్‌కు 66 వాహనాల్లో 862 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,200, కనిష్ట ధర రూ.6,600 చెల్లించారు. గన్నీ సంచుల్లో 29 మంది రైతులు 60 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,500, కనిష్ట ధర రూ.6,000 పలికింది. కాగా మంగళవారం అమావాస్య, బుధవారం ఉగాది పండుగ సందర్భంగా మార్కెట్ యార్డుకు రెండు రోజులు సెలువులు ప్రకటించారు. గురువారం మార్కెట్ యార్డులో యథావిధిగా క్రయ విక్రయాలు కొనసాగుతాయని కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ తెలిపారు.

ప్రజావాణికి 171 దరఖాస్తులు

కరీంనగర్ అర్బన్: ప్రజావాణికి ప్రజల తాకిడి ఎక్కువవుతోంది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమానికి 171 దరఖాస్తులు వచ్చాయి. కరీంనగర్ రూరల్ తహసీల్దార్ 14, అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి 14 మున్సిపల్ కమిషనర్ కరీంనగర్ కార్యాలయానికి 10, తహసీల్దార్ చిగురుమామిడి కార్యాలయానికి 10, మిగిలిన శాఖలన్నింటికి కలిపి 123 దరఖాస్తులు మొత్తం 171 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ వివరించారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో, జెడ్పీ సీఈఓ ప్రియాంక, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 5,74 మంది గైర్హాజరు

కరీంనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయని డీఐఈవో రాజ్యలక్ష్మి వెల్లడించారు. జనరల్, ఒకేషనల్ విభాగాలను కలుపుకుని 17,041 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 574 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. 16,467 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని డీఐఈవో వెల్లడించారు.

నేడు బీఆర్‌ఎస్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం

కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని వి– కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్ణారావు ప్రకటనలో తెలిపారు. సమావేశనికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ బీఆర్‌ఎస్ ఇంచార్జ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, వొడితేల సతీష్ కుమార్, సుంకే రవిశంకర్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, పార్టీ ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు 'కవిత్వంతో కరచాలనం'

కరీంనగర్‌కల్చరల్: ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా సాహితీ సోపతి, కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ, తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ఫిలింభవన్‌లో కవిత్వంతో కరచాలనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమన్వయ కర్త తోట నిర్మలారాణి ప్రకటనలో తెలిపారు. తెరవే ప్రధాన కార్యదర్శి సీవీ కుమార్ అధ్యక్షతన ఎంపిక చేసిన కవులు కవితాగానం చేస్తారని, కవుల కవిత్వాన్ని కవి శ్రీరాం పుప్పాల సమీక్షిస్తారని పేర్కొన్నారు.



వీణవంక: వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన నల్ల కొండాల్‌రెడ్డి ఆరు ఎకరాల్లో వరి, మూడు ఎకరాల్లో మొక్కజొన్న వేశాడు. మొక్కజొన్న పీచు దశలో ఉండగా, వరి ఈనే దశలో ఉంది. ఇక ఈ ఏడు ఢోకా లేదని పెట్టుబడికి వెనకడుగు వేయలేదు. ఇంతలో వడగండ్ల వాన కురవడంతో మొక్కజొన్న చేను పూర్తిగా నేలకొరిగింది. వరి గొలుసు పూర్తిగా దెబ్బతింది. వడగండ్లు అరకిలో కన్నా పెద్దవి పడటంతో చేన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మొక్కజొన్న, వరికి కలిపి రూ.2.50లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాడు. ఇప్పుడు పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. పెట్టుబడి కోసం ప్రైవేట్ అప్పు తీసుకొచ్చానని పిల్లల స్కూల్ ఫీజు కట్టలేని పరిస్థితి తలెత్తిందని రైతు కన్నీరుమున్నీరయ్యాడు.



శంకరపట్నం: ఈయన పేరు సంబు గట్టయ్య. శంకరపట్నం మండలం కరీంపేట గ్రామం. ఎస్సారెస్పీ ఎగువన కరీంపేట గ్రామం ఉండడంతో యాసంగిలో మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంటసాగు చేసింది. ఇందు కోసం రూ.90వేల వరకు పెట్టుబడి పెట్టింది. మూడు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి మూడు ఎకరాల మొక్కజొన్న చేనులో రెండు ఎకరాల మొక్కజొన్న పంట దెబ్బతింది. వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేస్తే అకాలవర్షం కోలుకోలేని దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశాడు రైతు సంబు గట్టయ్య. దెబ్బతిన్న పంటకు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.



గన్నేరువరం: గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన రైతు బండి తిరుపతి ఏడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుకు చేశాడు. ఇటీవల కురిసిన వర్షానికి మూడు ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. దీంతో రూ.75వేలకు పైగా నష్టపోయినట్లు తిరుపతి వివరించారు. కంకి పీచుదశ ఉండటంతో తీవ్రంగా నష్టం జరిగిందని, ఒక గింజ కూడ చేతికిరాదని వాపోయాడు. పంట చేతికి అందితే 100 క్వింటాళ్ల మక్కల దిగుబడి వచ్చేదని, ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరాడు.

అకాల నష్టం!

నిండా ముంచిన వడగండ్ల వాన

- మొక్కజొన్న, వరికి పెద్దదెబ్బ
- గత రెండేళ్లుగా జాడలేని పరిహారం
- ఈ సారి పరిహారం ఉన్నట్టా లేనట్టా
- జిల్లాలో ఏటా రూ.కోట్లకు పైగా నష్టం



చొప్పదండి: చొప్పదండి మండలం మంగళ్లపల్లి గ్రామానికి చెందిన రైతు గూడూరు భూంరెడ్డి తనకున్న ఎనిమిది ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశాడు. మూడు ఎకరాల్లో కర్బూజా వేశాడు. వారం రోజుల్లో కోతకు వచ్చేది. అమ్ముకుంటే 60 టన్నులకు ఇప్పుడున్న ధర ప్రకారం రూ.5 లక్షలు వచ్చేవి. విత్తనాలకు, పెట్టుబడికి రూ.2 లక్షల ఖర్చు దాటింది. ఇంకా రెండెకరాల్లో మొక్కజొన్న, ఇరువై గుంటల చొప్పున నువ్వు, పెసర పంటలు వేశాడు. ఇటీవల కురిసిన వడగండ్లకు పంటలన్నీ నీటిపాలయ్యాయి. పదిహేనేండ్ల తర్వాత ఇంత విపత్తు చూశానని భూంరెడ్డి వివరించాడు.



గన్నేరువరం మండలంలో పంటనష్టం వివరాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

2020-22 వరకు నష్టం గణాంకాల్లో

జిల్లాలో మొత్తం గ్రామాలు: 313

ఎక్కువ నష్టం జరిగిన గ్రామాలు: 168

మొత్తం పంట నష్టం: 44,803 ఎకరాలు

నష్టం విలువ: సుమారు రూ.100కోట్లు

నష్టపోయిన రైతుల సంఖ్య: 24వేలు

నష్టపోయిన పంటలు: వరి, మొక్కజొన్న, కంది, పత్తి, పెసలు

ఇటీవల వడగండ్ల వానతో నష్టమిలా

మొత్తం పంట నష్టం (ప్రాథమిక అంచనా): 14,300ఎకరాలు

వరి: 7,120

మొక్కజొన్న: 7,180

కరీంనగర్ అర్బన్: అయితే అతివృష్టి లేదా అనావృష్టి అన్నదాతను అతలాకుతలం చేస్తోంది. ప్రతీ సీజన్‌లో అకాల వాన అన్నదాత ఆశలను చిదిమేస్తోంది. ఇప్పటికే అగ్గి తెగులు ఆందోళనకు గురిచేయగా మళ్లీ నాట్లు వేసిన రైతులకు కన్నీళ్లే దిక్కయ్యాయి. ఈ సారైనా మంచి దిగుబడి సాధించాలనుకుంటే వడగండ్ల వాన శోకసంద్రంలో ముంచేసింది. శుక్ర, శనివారాల్లో కురిసిన చెడగొట్టు వానతో జిల్లాలో 14,300 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. సుమారు రూ.100కోట్ల నష్టం వాటిల్లింది. జిల్లాలో 16మండలాలకు గానూ 12 మండలాల్లో రైతులు నష్టపోయారు. ఈ సారి ఎమ్మెల్యేలు పంటలను పరిశీలిస్తున్నారు. వ్యవసాయ అధికారులు నష్ట మదింపు చేస్తుండగా పరిహారం వస్తుందన్న ఆశ అన్నదాతల్లో మిణుకు మిణుకుమంటోంది.

2021లో నివేదిక.. ఆ తరువాత లేదిక

2021 ఆగస్టులో అకాలవాన పంటను తుడిచేయగా 24,803 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. కానీ ఇప్పటికి పరిహారం విడుదల కాలేదు. ప్రాథమిక అంచనా వేసి తుది నివేదికను వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. పంటలో రైతు యూనిట్‌గా 33శాతం నష్టం నిబంధన ప్రకారం 7,276 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు నివేదించారు. సదరు పరిహారమైనా వచ్చిందా.. అంటే అదీ లేదు. ఇక అప్పటి నుంచి అకాల వర్షాలు, వడగండ్ల వానతో వరి, మొక్కజొన్న, ఇతర పంటలకు నష్టం వాటిల్లుతుండగా వ్యవసాయ శాఖ అంచనా వేయలేదు. రెండేళ్లలో సుమారు 50వేల ఎకరాల్లో పంటనష్టం జరగగా ప్రభుత్వాల నుంచి సాంత్వన కరవైంది. రెండేళ్ల విరామమనంతరం ఇటీవల వడగండ్ల వాన నష్టానికి ప్రాథమికంగా నివేదిక రూపొందించగా తుది నివేదికకు కసరత్తు చేస్తున్నారు.

పరిహారం ఉన్నట్టా లేనట్టా

పంట నష్ట పరిహారం ఉన్నట్టా లేనట్టా అన్నది అంతుబట్టడం లేదు. గత మూడేళ్ల క్రితం వరకు పంట నష్టం జరిగితే వ్యవసాయ శాఖ అధికారులు హుటాహుటిన ప్రాథమిక అంచనా రూపొందించేవారు. తదుపరి క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదించేవారు. కానీ గత రెండేళ్లుగా ప్రభుత్వం, అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. జిల్లాలో ఇటీవల వానలకు పొట్ట, గొలక దశలో ఉన్న వరికి నష్టం వాటిల్లగా దిగుబడి రావడం గగనమే. కంకి పిల్ల దశలోనే మొక్కజొన్న నేలవాలగా పెట్టుబడి రాని పరిస్థితి. వ్యవసాయ శాఖ అధికారులు 14వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా రూపొందించినప్పటికి 30వేల ఎకరాల వరకు నష్టం వాటిల్లిందని రైతు సంఘం నేతలు స్పష్టం చేస్తున్నారు.

కేంద్ర బృందం వచ్చేనా..!

పంట నష్టం జరిగిన తదుపరి కేంద్ర బృందం పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలి. వర్షం పడిన వారం రోజుల తరువాత సదరు బృందం పరిశీలించాల్సి ఉంటుంది. జిల్లాలో ఇప్పటివరకు ఆ ఛాయలే లేవు. గతంలో ఇతర జిల్లాల్లో పంట నష్టాన్ని పరిశీలించిన కేంద్ర బృందం కరీంనగర్‌కు రాలేదు. అసలు పంట నష్టానికి పరిహారం ఉంటుందా ఉండదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పంట నష్టం జరిగిన క్రమంలో నష్టం అంచనాను పంపిస్తున్నామని, తాజా నష్టంపై నివేదిక రూపొందిస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

3,800 ఎకరాల్లో పంటల నష్టం

- ఎమ్మెల్యే రవిశంకర్, అధికారుల పరిశీలన

చొప్పదండి: చొప్పదండి నియోజకవర్గంలో వడగండ్ల వాన అరగంట సేపు ఏకధాటిగా కురువడంతో ఏసంగిలో సాగు చేసిన పంటలన్ని దెబ్బతిన్నాయి. వడ్లు నేలరాలాయి. మొక్కజొన్న నేలకొరిగింది. మామిడి కాయలు, పిందెలు రాలిపోయాయి. చొప్పదండి మండలంలో వ్యవసాయాధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి ప్రాథమిక అంచనా వేశారు. సుమారు 2,150 ఎకరాల్లో వరి, మరో 1,200ఎకరాల్లో మొక్కజొన్న, 200ఎకరాల్లో మామిడితోటలు, 200 ఎకరాల్లో కర్బూజా, మరో 50 ఎకరాల్లో మిర్చి, ఇతర కూరగాయ పంటలకు నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, ఎంపీపీ చిలుక రవిందర్, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డిలు నష్ట పోయిన పంటలను పరిశీలించి రైతులను ఓదార్చారు.అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు.



మిర్చిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

రైతులను ఆదుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు

కరీంనగర్‌టౌన్: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మేడిపల్లి సత్యం, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పీసీసీ నాయకులు వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మేనేని రోహిత్‌రావు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నష్టంపై నివేదిక రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని డిమాండ్‌చేశారు. నష్టపోయిన రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆదుకోకపోతే రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

పంటనష్టం పరిశీలన

చొప్పదండి: జిల్లాలో పద్నాలుగు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు చెబుతున్నారని, అంతకన్నా ఎక్కువగానే క్షేత్రస్థాయిలో నష్టం జరిగిందని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని పాతవెదురుగట్ట రోడ్డులో నష్టపోయిన పంటలను పరిశీలించారు. జిల్లా మంత్రి నష్ట పరిహారం అంచనాలను ప్రభుత్వానికి పంపించాల్సింది పోయి కాంగ్రెస్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.

కార్మిక సంఘం నాయకుల వినతి

కరీంనగర్: అకాల వర్షాలకు జిల్లాలో నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. అజయ్ మాట్లాడుతూ ఐదు రోజులుగా కురిసిన అకాల వర్షాలతో జిల్లా వ్యాప్తంగా వరి, మొక్కజొన్న ,మామిడి తోటలు, కూరగాయ తోటలు తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వ్యవసాయ అధికారులతో జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో పంటనష్టాన్ని సర్వే చేయించి, రైతులకు ఎకరానికి రూ.30వేల పరిహారం ప్రకటించాలన్నారు. సుంకె దుర్గయ్య, గౌతమ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ర్యాలపల్లిలో రాళ్ల వర్షం

గంగాధర(చొప్పదండి): మండలంలో సోమవారం సైతం రాళ్లవర్షం కురిసింది. ర్యాలపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షానికి వరి గొలక, మామిడి కాయలు రాలి పోయాయి. కూరగాయల తోటలు దెబ్బతిన్నాయని ఎంపీటీసీ రాజిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కాచిరెడ్డిపల్లి గ్రామంలో దెబ్బతిన్న పంటలను సోమవారం సర్పంచు జోగు లక్ష్మీరాజం పరిశీలించారు. గ్రామంలో 320ఎకరాల్లో వరి దెబ్బతిందని, మామిడితోటలు, టమాట తోటలు నష్టపోయినట్లు వివరించారు.

సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్లు విక్రయిస్తే చర్యలు

- కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: శబ్దకాలుష్యానికి కారణం అవుతున్న వాహనదారులు, శబ్దంవచ్చే సైలెన్సర్లను బిగించే మెకానిక్‌లు, విక్రయించే ఆటోమొబైల్ దుకాణాదారులపై కేసులు నమోదు చేస్తామని కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు హెచ్చరించారు. సోమవారం కమిషనరేట్ కేంద్రంలోని ఓపెన్ థియేటర్ ఆవరణలో మెకానిక్‌లు, ఆటోమొబైల్ దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం ఎలాంటి వాహనాల రూపురేఖలు మార్చేందుకు అనుమతి లేదని చెప్పారు. వాహనాలకు అదనపు సైలెన్సర్లు బిగించడం ద్వారా ఏర్పడుతున్న శబ్దకాలుష్య ప్రభావంతో అనేకమంది అనారోగ్యాలపాలు కావడంతోపాటు విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం ఏర్పడుతున్నదన్నారు. శబ్దకాలుష్యానికి కారణమయ్యే సైలెన్సర్లను బిగించాలని వచ్చే వాహనదారుల సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. ఇటీవల శబ్దకాలుష్యానికి కారణమై పట్టుబడిన దాదాపు 400 వాహనాల సైలెన్సర్లను సీపీ సుబ్బరాయుడు, రవాణా అధికారుల సమక్షంలో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు.అడిషనల్ డీసీపీ (పరిపాలన) జి.చంద్రమోహన్, ఏసీపీలు బి.విజయ్‌కుమార్, సి.ప్రతాప్, ఎస్బీఐ జి.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు జి.తిరుమల్, నాగార్జునరావు, ఏఎంవీఐ రజనీ, ఆర్‌ఐలు సురేశ్, మల్లేశం, మురళీ ఉన్నారు.



సైలెన్సర్లను రోలర్‌తో తొక్కిస్తున్న సీపీ

విద్వేషాలు సృష్టించే వారిపై చర్యలు

వివిధ వర్గాలకు చెందిన ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించేందుకు సోషల్ మీడియా ను వేదికగా చేసుకొని అసభ్యకరమైన పదజాలంతో పోస్టులు పెట్టే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీపీ ఎల్.సుబ్బారాయుడు హెచ్చరించారు. ఈ మధ్య కాలంలో కొందరు విదేశాల్లో ఉంటున్న వారు తమపై ఎలాంటి చర్యలు తీసుకోవడం సాధ్యం కాదని భ్రమలో సోషల్ మీడియాలో ప్రజల మధ్య విద్వేషాలను సృష్టించేందుకు పోస్టులు పెడుతున్న విషయం తమదృష్టికి వస్తుందని తెలిపారు.

31న కరీంనగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బార్ అసోసియేషన్ 2023 – 24 ఎన్నికలకు నగారా మోగింది. ఈ ఎన్నికలు ఏటా ప్రతిష్టాత్మకంగా జరుగుతాయి. ఈసారి సీనియర్ న్యాయవాది ఎం.రామకృష్ణచారిని ఎన్నికల అధికారిగా నియమించగా సోమవారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. ఓటు హక్కు కలిగిన 929 మంది న్యాయవాదుల ఓటర్ల జాబితాను విడుదల చేశారు. నామినేషన్లు ఈనెల 25 నుంచి 27 వరకు స్వీకరించనుండగా, 28న వాటి పరిశీలన, 29న ఉపసంహరణలు, అదే రోజు పోటీ అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. 31న ఉదయం 9 గంటల నుంచి 3.30 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనుండగా అదేరోజు సాయంత్రం ఫలితాలను ప్రకటించనున్నట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

వచ్చేనెల 3 వరకు పోషణ్ పక్వాడా

- మిల్లెట్ల ఆరోగ్య ప్రయోజనాలు, సాగు సుస్థిరతపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్

కరీంనగర్: మిల్లెట్ల ఆరోగ్య ప్రయోజనాలు, సాగు సుస్థితరతపై అవగాహన కల్పించాలని, మిల్లెట్ ఫుడ్‌పై అవగాహన కల్పించేలా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులతో ఈనెల 20 నుంచి ఏప్రిల్ 3 వరకు నిర్వహించే పోషణ్ అభియాన్‌లోని పోషణ్ పక్వాడా–2023 కార్యక్రమంపై జిల్లాస్థాయి కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిల్లెట్లను ఆహారంతో ఆరోగ్య ప్రయోజనాలపై గర్భిణులకు, ప్రజలకు పక్షం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను కార్యాచరణ ప్రకారం ఆవాసం చేసినట్లు తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ట్రైబల్, సోషల్ వెల్ఫేర్, బీసీ, మైనార్టీ పాఠశాలల్లో పోషికాహార లోపాన్ని నిర్మించడంలో మిల్లెట్ పాత్ర పై వ్యాసరచన, డ్రాయింగ్, న్యూట్రీషన్ ఫెయిర్ పోటీలను, మిల్లెట్ ఫుడ్ ఉపయోగాలు, ప్రయోజనాలపై కల్పించడం, ఇతర పోటీలను నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని మహిళలకు, కిశోర బాలికలకు రక్త పరీక్షలను నిర్వహించాలని, ఇందులో ముఖ్యంగా గతంలో తీవ్ర అనేమియా ఉన్నవారికి మరోసారి పరీక్షలను నిర్వహించి, సమస్య తీవ్రతను బట్టి వారిని మెరుగైన వైద్యం కొరకు జిల్లా ప్రధానాసుపత్రికి పంపించాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా వైద్యాధికారి జువేరియా, పీడీ డీఆర్‌డీఏ శ్రీలతారెడ్డి, డీపీవో వీరబుచ్చయ్య, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నేతానియెల్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజమనోహర్, మైనారిటీశాఖ అధికారి మధుసూదన్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి గంగారాం, సీడీపీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కర్ణన్, అధికారులు

మల్లన్నకు పట్నం

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీలో సోమవారం మల్లన్న పట్నాలు ఘనంగా జరిగాయి. ఒగ్గుపూజారులు రాత్రి నుంచి లగ్నపట్నంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం బండారి, కుంకుమతో పెద్దపట్నం వేశారు. యాదవ కులస్తులు అందరూ ఇంటికో బోనంతో ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నుంచి శివసత్తులు, భక్తులు దాటారు. వార్డు సభ్యుడు అంజన్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. సర్పంచ్ మీసాల అంజయ్య, ఎంపీటీసీ కిన్నెర సుజాత సారయ్య, ఆలయ కమిటీ చైర్మన్ పొలం అంజయ్య, సంగం అధ్యక్షుడు ఆవుల ఓదెలు పాల్గొన్నారు.



క్లుప్తంగా

పిడుగుపాటుకు ఆవు మృతి

చిగురుమామిడి(హుస్నాబాద్): మండలంలోని రేకొండ గ్రామంలో సోమవారం వేకువజామున కురిసిన వర్షం, పిడుగుపాటుకు గాదెపాక బాల్‌రాజ్‌కు చెందిన ఆవు మృతిచెందింది. దీంతో రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. రోజూ ఉదయం, సాయంత్రం పదిలీటర్ల పాలు ఇచ్చేదని, రూ.80 వేలు పెట్టి ఆరునెలల క్రితం కొనుగోలు చేసినట్లు చెప్పాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

భారీ వర్షానికి కుంగిన స్లాబ్

రెండురోజులుగా ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి బొమ్మనపల్లి గ్రామానికి చెందిన దరిపెల్లి శ్రీనివాస్ ఇల్లు కుంగిపోయింది. ఆదివారం కొత్తగా ఇంటికి స్లాబ్ వేశాడు. అదే రోజు రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కురిసిన వర్షానికి స్లాబ్ కింద ఏర్పాటు చేసిన సపోర్టు కట్టెలు కుంగి, పైన స్లాబ్ సైతం కుంగిపోయిందని బాధితుడు వాపోయాడు. మళ్లీ స్లాబ్ వేయాలంటే ఆర్థిక స్థోమత లేదని పేర్కొన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

కొత్తపల్లి(కరీంనగర్): మండలంలోని చింతకుంట టీఆర్‌కేనగర్‌కు చెందిన బోదాసు పోచయ్య(42) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఎల్లయ్యగౌడ్ వివరాలు.. పోచయ్య మద్యానికి బానిసై రోజూ భార్యతో గొడవ పడుతుండేవాడు. ఆదివారం మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడగా ఆమె ఇంటి నుంచి బయటకు వచ్చింది. దీంతో మద్యం మత్తులో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పోచయ్య మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య సత్తమ్మ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఏడాది జైలు

కరీంనగర్‌క్రైం: కూలీ పని తీసివేస్తే అడగడానికి వెళ్లిన మహిళను కులం పేరుతో దూషించి కొట్టిన నేరంలో నిందితుడికి ఏడాది జైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఎస్.శ్రీవాణి సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన ములుగూరి రాధ గ్రామ సమీపంలో గల సాయి గార్డెన్స్‌లో కూలీ పని చేస్తుంటుంది. గార్డెన్ యజమాని తన కూలి డబ్బులు ఇవ్వడం లేదని, పనికి రానివ్వడం లేదని రాధ కొందరు పెద్ద మనుషులను తీసుకొని అడిగేందుకు 2016 మార్చి 6న మధ్యాహ్నం సాయి గార్డెన్స్‌కు వెళ్లింది. ఆ సమయంలో గార్డెన్స్ యజమానులు శనిగరపు కుమారస్వామి, సముద్రాల బీరయ్య అక్కడే ఉన్నారు. వారిని నిలదీయగా వారు కులం పేరుతో తిట్టి కొట్టినట్లు రాధ హుజూరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇద్దరిపై కేసు నమోదు చేయగా అప్పటి ఏసీపీ రవీందర్‌రెడ్డి దర్యాప్తు జరిపారు. కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.పవన్‌కుమార్ విచారించారు. ఈ కేసులో రెండో నిందితునిగా ఉన్న బీరయ్యపై కేసు నిరూపణ కాలేదు. మరో నిందితుడు శనిగరపు కుమారస్వామికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

నిరసన దీక్షలు.. ఆందోళనలు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు



నిరసన దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంపై సోమవారం బీజేపీ, బీఎస్పీ, ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు, ఆందోళనలు చేపట్టారు. నిందితులను శిక్షించాలని డిమాండ చేశారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డు కమిటీని రద్దు చేయాలి

కరీంనగర్‌కల్చరల్: టీఎస్‌పీఎస్సీ బోర్డు కమిటీ రద్దు చేసి, చైర్మన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో సంచలనంగా మారిన టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ అంశాన్ని బీఎస్పీ తరఫున తీవ్రంగా ఖండిసున్నామని, నిరుద్యోగులకు న్యాయం జరగాలన్నారు. ఈ కేసును సీబీఐకి అప్పగించి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దొడ్డే సమ్మయ్య, అక్కినపల్లి శిరీష, జన్ను స్వరూప, మంద బాలయ్య, నల్లాల శ్రీనివాస్, అక్కి బాలకిషన్, శేఖర్, బడుగు నరేష్, కుమ్మరి సంపత్, మరేపల్లి మొగిలయ్య, కాంపెల్లి రాజు, గాలి అనిల్‌కుమార్, బోనగిరి ప్రభాకర్, రాజేందర్, అల్లూరి అనురాధ, కాంపెల్లి విజయ, అస్తపురం మధు పాల్గొన్నారు.

నిరుద్యోగుల బాధలు పట్టని ప్రభుత్వం

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల బాధ, అవస్థలు పట్టనట్టుగా వ్యవహరిస్తుందని, వెంటనే టీఎస్‌పీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. హుజూరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడి 8 ఏళ్ల తర్వాత కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చినట్టే ఇచ్చి పేపర్ లీకులు జరిపిందని, సిగ్గు లేకుండా పరీక్షలను రద్దుచేసి చేతులు దులుపుకుంటున్నారు. 2018న ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ కూడా నిలుపుకోలేని దౌర్భాగ్య స్థితిలో కేసీఆర్ ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకొని సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, జిల్లా ఆఫీస్ సెక్రెటరీ మాడుగుల ప్రవీణ్, జిల్లా అధికార ప్రతినిధి మాసాడి ముత్యంరావు, పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, జమ్మికుంట పట్టణ అధ్యక్షులు జీడి మల్లేశ్, రామిడి ఆదిరెడ్డి, నల్ల సుమన్, తూర్పాటి రాజు, రావుల వేణు, తూముల శ్రీనివాస్, చేపూరి రాజు, ఎండీ అజార్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు వడ్నాల చంద్రిక, స్వాతిరెడ్డి పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

కరీంనగర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌తో అనేకమంది నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మల్యాల రాకేశ్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది గ్రూప్స్‌కి ప్రిపేర్ అవుతున్నారని, ఇలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌పై స్పందించకపోవడం బాధాకరమన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులతో అనేక రకాల ఉద్యమాలకు శ్రీకారం చుడతామని, ప్రగతి భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూసాల విష్ణు, బామండ్ల నందు, జోనల్ ఇన్‌చార్జి శివ, నగర సంయుక్త కార్యదర్శులు వంశీ, అరుణ్, వెంకటేష్ కార్యకర్తలు అబ్దుల్ రెహమాన్, చందు, అజయ్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

కరీంనగర్‌టౌన్: టీఎస్పీఎస్సీ పేపర్ లీక్‌పై బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూబల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేపర్ లీక్ ఘటనలో ప్రమేయం ఉన్న నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగులు గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులంతా సంఘటితశక్తిగా మారి కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కోమల ఆంజనేయులు, కొరటాల శివరామయ్య, రాపర్తి ప్రసాద్, బొంతల కళ్యాణ్‌చంద్ర, ఎడమ సత్యనారాయణరెడ్డి, పుప్పాల రఘు, రాపర్తి విజయ, ప్రవీణ్, రమణారెడ్డి, జాడి బాల్‌రెడ్డి, మునిగంటి కుమార్, ఉప్పరపల్లి శ్రీనివాస్, పాదం శివరాజ్, కడార్ల రతన్‌కుమార్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మామిడి చైతన్య, రాగి సత్యనారాయణ, లాల మురళి, కైలాస నవీన్, దేవిశెట్టి నవీన్‌కుమార్, కూర మైపాల్‌రెడ్డి, ధీరజ్, ప్రశాంత్, శ్రీనివాస్, అనిల్, నాంపల్లి శ్రీనివాస్, వరాల జ్యోతి, బైరి చంద్రకళ, అరుణ, సోని పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌పై ఆరోపణలు అర్థరహితం

- నగర మేయర్ సునీల్‌రావు



కరీంనగర్: మంత్రి కేటీఆర్‌పై ఎంపీ బండి సంజయ్, రేవంత్‌రెడ్డి ఆరోపణలు అర్థరహితమని నగర మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. సోమవారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ నిరుద్యోగులకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో బండి సంజయ్ వెల్లడించాలన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంపై మంత్రి కేటీఆర్ బాధ్యత వహించాలని సంజయ్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బోర్డుల ద్వారా నిర్వహించే పోటీ పరీక్షల్లో ప్రభుత్వ ప్రమేయం ఉండదని తెలియని అజ్ఞానులు రేవంత్, బండి అని మండిపడ్డారు. ఎంపీలుగా వ్యవహరిస్తున్న వారు ఇలాంటి విషయాలపై ఇప్పటికైనా అవగాహన పెంచుకోవాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటి వరకు జరిగిన పేపర్ లీకేజీ వ్యవహారంతో రద్దయిన పోటీ పరీక్షలకు ఎంత మంది మంత్రులు బాధ్యత వహించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్ పీఏ గ్రామంలో వంద మందికి 103 మార్కులు వచ్చాయని ఆరోపణలు చేసిన రేవంత్‌రెడ్డి, దాన్ని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. కేటీఆర్‌పై, రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



చొప్పదండి: అకాల వర్షాలు, వడగండ్లకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్ కోరారు. మండలంలోని గుమ్లాపూర్, చొప్పదండి ప్రాంతాల్లో వడగళ్లకు దెబ్బతిన్న పంటలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి ప్రకోపానికి రైతులు నష్టపోయారని, ప్రభుత్వమే యుద్ధప్రాతిపదికన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరాల శ్రీనివాస్, రొడ్డవేని తిరుపతి, చొప్పదండి పట్టణ అధ్యక్షుడు బట్టు రాజు, గీకురు హరీశ్, గోస్కుల కొమురయ్య, గాలిపెల్లి శ్రీనివాస్, రాజన్నల రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన బొల్లపల్లి సమ్మయ్య(40) అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు.. సమ్మయ్య రామగుండం కార్పొరేషన్ పరిధిలోని వీర్లపల్లిలో తెల్ల కల్లు అమ్మేవాడు. గతంలో వైన్‌షాపు నడిపించగా అందులో నష్టం రావడంతో జూలపల్లి గ్రామం నుంచి వీర్లపల్లికి వెళ్లి అక్కడ కల్లు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారం క్రితం జూలపల్లిలో జరిగిన రేణుక ఎల్లమ్మ ఉత్సవాలకు కుటుంబ సభ్యులతో వచ్చాడు. అప్పులు తీర్చలేనని మనస్తాపం చెందిన సమ్మయ్య శనివారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందుతాగి పడిపోవడంతో కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మస్తాన్ తెలిపారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

కరీంనగర్‌టౌన్: జిల్లాలో కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పల్లెప్రగతి, కంటివెలుగు, హరితహారం, ఉపాధి హామీ పథకాలపై అధికారులతో సమీక్షించారు. సిబ్బంది సమన్వయంతో కృషిచేసి జిల్లాలో ప్రతిఒక్కరికి కంటివెలుగు ద్వారా పరీక్షలు నిర్వహించి అర్హులకు కళ్లద్దాలు అందజేయాలని సూచించారు. ఉపాధి పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కిట్స్, నీడ, నీరు సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులకు ఎక్కువ సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా చూడాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేకాధికారులు తప్పనిసరిగా ఆయా మండలాలు సందర్శించినప్పుడు వైకుంఠధామం, కంపోస్ట్ షెడ్, నర్సరీలను సందర్శించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్, జెడ్పీ సీఈఓ ప్రియాంక, డీఆర్డీఓ శ్రీలతారెడ్డి, డీపీఓ వీరబుచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, మెప్మా పీడీ రవీందర్, పశుసంవర్ధక శాఖ అధికారి నరేందర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతమే లక్ష్యంగా..



సమావేశంలో నాయకులు

కరీంనగర్: నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య అన్నారు. సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్టారావు అధ్యక్షతన మీసేవ కార్యాలయంలో జరిగిన కరీంనగర్ నియోజకవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ బలోపేతమే లక్ష్యంగా పార్టీలో పనిచేసే కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధుల మధ్య అనుబంధాన్ని పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం మొదట కరీంనగర్ పట్టణంలోని వీ– కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 13 లోపు సమ్మేళనాలు పూర్తి చేయనున్నట్లు వివరించారు. కరీంనగర్ నియోకవర్గస్థాయిలో మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షతన మొత్తం ఆరు సమ్మేళనాలు కరీంనగర్ పట్టణంలో మూడు, కొత్తపల్లి రూరల్ మండలంలో ఒకటి, కొత్తపల్లి టౌన్‌లో ఒకటి, కరీంనగర్ రూరల్‌లో ఒకటి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో నగర మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): క్రమశిక్షణతో ముందుకు సాగి జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ ఆకాంక్షించారు. సోమవారం జీఎం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 9మంది యువ ఉద్యోగులకు కారుణ్య నియామకాలు అందజేశారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ, ప్రస్తుత సమయంలో చిన్న సంస్థలో ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారిందని, ఈక్రమంలో సింగరేణి సంస్థలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావించాలన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో రాణించాలని కోరారు. గైర్హాజర్ లేకుండా వృత్తి నైపుణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, ఐఈడీ డీజీఎం మురళీక్రిష్ణ, వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో మంగళవారం నిర్వహించే కంటి వెలుగు శిబిరాలను డీఎంహెచ్‌వో జువేరియా ప్రకటించారు. కరీంనగర్ నగరంలో 1,6,8,12,15,18,41,45,46,49,53,58 డివిజన్లలో శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. హుజూరాబాద్ పట్టణం 4,16 వార్డులు, అదే మండలం కాట్రపల్లి, సిరసపల్లి, జమ్మికుంట పట్టణం 10వ వార్డు, అదే మండలం నాగంపేట, మడిపల్లి, వీణవంక మండలం ఎలబాక, కొండపాక, కనపర్తి, చిగురుమామిడి మండలం రేకొండ, ఇందుర్తి, చొప్పదండి పట్టణం 12వ వార్డు, అదే మండలం కాట్నేపల్లి, రాగంపేట, ఇల్లందకుంట మండలం చిన్న కోమటిపల్లి, మల్యాల, గంగాధర మండలం ఒద్యారం, వెంకటయ్యపల్లి, ఉప్పర మల్యాల, రామడుగు మండలం దేశరాజ్‌పల్లి, గోలిరామయ్యపల్లి, కొత్తపల్లి మండలం బొమ్మకల్, కమాన్‌పూర్, కరీంనగర్‌రూరల్ మండలం ముగ్దుంపూర్, నగునూర్, మానకొండూరు మండలం ముంజంపల్లి, కొండపల్కల, పచ్చునూర్, సైదాపూర్ మండలం దుద్దెనపల్లి, అమ్మనగుర్తి, శేశవపట్నం మండలం ఎరడపల్లి, మొలంగూర్, తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి, బాలయ్యపల్లి, గన్నేరువరం మండలం హనుమాజిపల్లిలో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని తెలిపారు.

'శ్రీ చైతన్య'లో ఆవిర్భావ్- 2కే23



మాట్లాడుతున్న సతీశ్‌కుమార్

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'నేషనల్ లెవెల్ టెక్నికల్ సింపోసియం'–ఆవిర్భావ్- 2కే23 ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, రెమిడి ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ సతీశ్‌కుమార్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, మూడు రోజులు జరిగే టెక్నికల్, నాన్ టెక్నికల్‌కి సంబంధించిన అంశాలను క్లుప్తంగా తెలుసుకొని మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులను కోరారు. సతీశ్‌కుమార్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో వస్తున్న నూతన ఆవిష్కరణలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై విద్యార్థుల మేధస్సుకు మరింత పదును పెట్టారు. టెక్ మహీంద్రా కంపెనీ సీనియర్ మేనేజర్ రమేశ్ మాట్లాడుతూ, నాలుగేళ్ల క్రమం తప్పకుండా కళాశాలకు హాజరైతే సంపూర్ణ విజ్ఞానం కలిగి ఉండి కంపెనీ ఉద్యోగాలకు ఎన్నికవుతారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్స్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎ.ప్రసాదరాజు, హెచ్‌వోడీ డాక్టర్ ఖాజా జియావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'వాగేశ్వరి'లో కెరీర్ కౌన్సెలింగ్



ఒప్పందం చేసుకుంటున్న ప్రతినిధులు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు సోమవారం కెరీర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. 42 ఎస్‌టీయూ వెబ్ సీఈవో కె.రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ జి.శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్‌పీఎఫ్ టెక్నాలజీస్ బెంగళూరు, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల ఎంవోయూ కుదుర్చుకోవడం జరిగిందని తెలిపారు. ఎంవోయూ ద్వారా విద్యార్థులు ఉద్యోగావకాశాలు, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు నేహ, ప్రకాశ్‌రెడ్డి, విశ్వనాథ్ వినోద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్బన్ క్రెడిట్స్ ప్రాజెక్టును వినియోగించుకోవాలి

జమ్మికుంట(హుజూరాబాద్): గోబల్ వార్మింగ్ తగ్గించేందుకు మొక్కలు నాటిన రైతులు ఉచిత కార్బన్ క్రెడిట్స్ ప్రాజెక్టును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా హర్టికల్చర్ ఆఫీసర్ శ్రీనివాస్ సూచించారు. జేకేఎఫ్ అగ్రో ఫారెస్టీ సంస్థ నిర్వహణలో భాగంగా రాయల్ బయో డైవర్సిటీ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం జిల్లా హర్టికల్చర్ ఆఫీసర్‌ను కలిసి మొక్కలు పెంచుతూ, పెంచాలనే రైతుల వివరాలు, సమాచారం కోసం సహాయ సహకారాలు అందించాలని వినతిపత్రం అందజేశారు. రైతులు మొక్కలు నాటితే ప్రోత్సాహకాల ద్వారా ఆర్థికసాయం అందిస్తుంటామని తెలిపారు. ఆసక్తి గల రైతులు 91545 44977, 90001 24899, 89772 64830, 98497 78762, 81066 00473 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ మోరేజాన్, డిప్యూటీ కో ఆర్డినేటర్ కుమార్ పాల్గొన్నారు.

'ఉపాధి'ని విస్మరిస్తే తిరుగుబాటు తప్పదు



కరీంనగర్: ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో కోతలు పెడుతుందని, పథకాన్ని విస్మరిస్తే ప్రజల తిరుగుబాటు తప్పదని బీకేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క బాలమల్లేశ్ హెచ్చరించారు. సోమవారం బద్దంఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 26, 27 తేదీల్లో నగరంలోని తారక హోటల్‌లో రాష్ట్ర విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారి వర్గాలకు కొమ్ము కాస్తూ కార్మికవర్గాన్ని విస్మరిస్తుందన్నారు. గ్రామీణ పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి పథకంలో కూలీలకు శ్రమకు తగిన ఫలితం రావడం లేదని, 200 రోజులు పని కల్పించి, రోజువారీ కూలి రూ.600 ఇవ్వాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ, ఉపాధి పథకంలో పని చేసే కూలీలకు ఆంక్షలు లేకుండా పని, అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల బాబు, అందె చిన్నస్వామి, విలాసాగరం అంజయ్య, చెంచాల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోచమ్మ ఆలయంలో ఎంపీ సతీమణి పూజలు



కరీంనగర్ కల్చరల్: నగరంలోని కోతిరాంపూర్ పోచమ్మ ఆలయంలో సోమవారం కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ సతీమణి అపర్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గణేశ్, శివానందం, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన ఐదుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2,27,500 చెక్కులను సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికంగా ఆదుకోవడంపై సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాజుల వెంకటమ్మ, ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, ఎంపీటీసీ గొల్లె రాజ్యలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు తిరుపతి, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని మంకమ్మతోట శ్రీవేంకటేశ్వర ఆలయం, కట్టరాంపూర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి, ప్రశాంత్‌నగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయాల హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించినట్లు ఈవో ఎస్.శ్రీనివాస్ తెలిపారు. వేంకటేశ్వరాలయంలో రూ.1,16,538, అభయాంజనేయస్వామి ఆలయంలో రూ.32,570, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో రూ.63,012 ఆదాయం సమకూరిందన్నారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు వేలానికి ఎవరు రానున్నందున తిరిగి ఈనెల 31న వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ హుండీ ఆదాయ లెక్కింపులో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ రమణ, సిబ్బంది, శ్రావణ్, అర్చకులు పాల్గొన్నారు.

నేడు భక్తాంజనేయ, సంతోషిమాత ఆలయాల్లో..

నగరంలోని లేబర్ అడ్డా భక్తాంజనేయస్వామి ఆలయం, జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయాల్లో మంగళవారం హుండీల ఆదాయం లెక్కించనున్నట్లు ఈవో అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 28న కొబ్బరిముక్కల ప్రోగు, పూజ సామగ్రి అమ్మకం, అమ్మవారి శేష వస్త్రాల స్వీకరణకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే ఔత్సాహికులు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

23న పోచమ్మ ఆలయంలో..

కోతిరాంపూర్ పోచమ్మ ఆలయంలోని హుండీ ఆదాయాన్ని ఈనెల 23న లెక్కిస్తున్నట్లు ఈవో ఎండపల్లి మారుతి ఒక ప్రకటనలో తెలిపారు.

నగరంలో ఉగాది సందడి

- పూజా సామగ్రి కొనుగోలుతో కిక్కిరిసిన మార్కెట్
- పెరిగిన ధరలతో ప్రజల ఇబ్బందులు

విద్యానగర్(కరీంనగర్): తెలుగు వారి తొలి పండుగ ఉగాది రానే వచ్చింది. బుధవారం శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా సోమవారం నుంచే నగరంలో సందడి మొదలైంది. పండుగకు కావల్సిన మామిడి తోరణాలు, వేప పువ్వు, కొత్త కుండలు, బంతిపూలు, మామిడికాయలు, కొత్త చింతపండు, కొత్త బెల్లం తదితర సామాగ్రి కొనుగోలు చేయడం కనిపించింది. దీంతో నగరంలోని టవర్‌సర్కిల్, మార్కెట్ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. నగర ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో మార్కెట్ కిటకిటలాడింది. వేంకటేశ్వర ఆలయం ప్రక్కన, మార్కెట్‌రోడ్, ఆఫీస్‌రోడ్‌లకు ఇరువైపుల ఉగాది పండుగకు సంబంధించిన సరుకుల అమ్మకాలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు సాగించారు.

పెరిగిన ధరలు

పెరిగిన ధరలతో ఉగాది పండుగ సరుకులు కొనడంలో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రూ.25 కట్ట చొప్పున వేపపువ్వు అమ్మారు. మామిడాకులు రూ.25లకు నాలుగు చిన్న కొమ్మలు కూడా రాలేదు. మామిడి కాయ ఒక్కటి రూ.15కు విక్రయించారు. పచ్చడి తయారు కోసం ఉపయోగించే మట్టి కుండలు ఒక్కో దానికి రూ.80–100, చింతపండు కిలో రూ.150 వరకు అమ్మారు. బంతిపూలు కిలో ధర రూ 150కి విక్రయించారు.



మార్కెట్‌లో మట్టి కుండల అమ్మకాలు



మామిడి కాయలు, మామిడాకులు, వేపపువ్వు అమ్మకాలు

తెలుగు వారి ముఖ్యమైన పండుగ



తెలుగు వారు ఆచరించుకునే ముఖ్యమైన పండుగ ఉగాది. హిందూ సంప్రదాయాల్లో ఏ కార్యక్రమం తలపెట్టిన ముందుగా దేశ, కాలమాన పరిస్థితులను తీసుకోవడం ఆచారం. దీనినే సంకల్పమంటారు. తెలుగు పండుగల్లో మొదటిది ఉగాది. కాల పురుషునికి సంబంధించిన ఉత్సవం. కాలం అత్యవహితమైంది. కాలమానంలో బ్రహ్మమానం, పిత్రుమానం, మనమానం, దేవమానం, సౌరమానం, పావనమానం, నక్షత్ర మానం, చాంద్రమానం, గురుమానం ఉన్నాయి. వీటిలో చాంద్రమానంను ప్రామాణికంగా మనం తీసుకుంటాం. ఉగాది అనేది కాల ప్రమాణంలో సంవత్సర కాలానికి ప్రారంభమైన అంశం.

– పవనకృష్ణ శర్మ, ప్రధానార్చకులు, శ్రీదుర్గాభవానీ ఆలయం, నగునూర్, కరీంనగర్

సంప్రదాయబద్ధంగా జరుపుకునే పండుగ



తెలుగు వారికి కొత్త సంవత్సరం ఇది. సంప్రదాయ బద్ధంగా జరుపుకునే పండుగ. ఉదయం ఇంటిల్లిపాది తలస్నానం చేసి కొత్త బట్టలు ధరిస్తాం. పూజ గదిలోని దేవుళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. ఉగాది పచ్చడి, బూరెలు నైవేద్యంగా పెడుతాం. సాయంత్రం ఆలయానికి వెళ్లి దైవ దర్శనం చేసుకోవడంతో పాటు పంచాంగ శ్రవణం ఆలకిస్తాం.

– సంగెం జయసుధ, గృహిణి, పద్మనగర్, కరీంనగర్

పచ్చడిలో ఔషధ గుణాలు



ఉగాది పచ్చడిలో అనేక ఔషధ గుణాలున్నాయి. వేప పువ్వు, బెల్లం, మామిడి ముక్కలు, చింతపండు, చెరకు రసం, కొబ్బరి ముక్కలు వేసి చేసిన పచ్చడి ఆరోగ్య ప్రదాయిని. వేపపువ్వు రక్తాన్ని శుభ్రం చేస్తుంది. శరీరంలోని వాత, పిత్త, కఫాలనే త్రిదోషాలను సమతుల్యం చేస్తుంది. మామిడి చర్మ సౌందర్యానికి, చింతపండు ఆలోచన శక్తిని, మానసిక పటుత్వాన్ని పెంచుతుంది. కొబ్బరి శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుంది.

– సీహెచ్ ప్రదీప్‌కుమార్, లైఫ్‌లైన్ హాస్పిటల్, కరీంనగర్

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సర్వే నంబర్ 669లోని ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అక్రమ పట్టాదారులను తొలగించాలని, అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు చేపట్టాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జెడ్పీ సీఈవో ఈ భూములపై విచారణ చేసి నెల రోజులవుతున్నప్పటికీ ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు నివేదికను బహిర్గతం చేసి భూములను స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కె. అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి దేవ కిషన్, గోపాలభూషణరావు, చంటి శ్రీనివాస్, విజయ్‌కుమార్, ఎండీ పాషా, దాన కిశోర్, గడప కాంతమ్మ, సంతోష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యయాత్రను జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న జిల్లాలో నిర్వహించే సీపీఎం ప్రజా చైతన్యయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. సోమవారం కోతిరాంపూర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రజాచైతన్యయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వం ఓవైపు దేశ భక్తులమని భారత్‌మాతాకీ జై అంటూనే దేశంలోని ప్రజల సంపదను దోచి ఆదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని అన్నారు. జిల్లాలో ఎంపీ బండి సంజయ్ రైల్వే ఓవర్ బ్రిడ్జికి నిధులు మంజూరు చేయించామని క్షీరాభిషేకాలు చేసుకొని ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని తెలిపారు. 26న మధ్యాహ్నం తెలంగాణ చౌక్‌లో సభ, అనంతరం రోడ్డు షోగా వెళ్లి కోతిరాంపూర్‌లోని అన్నమనేని గార్డెన్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ చైతన్య యాత్రలో ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు పున్నం రవి, కొంపల్లి సాగర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

విద్యానగర్(కరీంనగర్): ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం రాత్రి కరీంనగర్‌లోని 53వ డివిజన్ అధ్యక్షుడు ఇబ్రహీం బియబాని ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ సందర్శన, హాలాతే హాజీరాలో పాల్గొని మాట్లాడారు. నగరంలోని 35 డివిజన్లలో ఎంఐఎం పార్టీ పటిష్టంగా ఉందని, ఎంఐఎం కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షుడు, కార్యదర్శులు నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రెటరీ హాఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, ఖమరుద్దీన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అఖీల్ ఫిరోజ్, కార్పొరేటర్ శర్ఫుద్దీన్, నాయకులు ఆతిన, అలిబాబా, అజర్ దబీర్, సాజిద్, అన్నేమల్ల సురేష్, సుధాకర్, అజీముల్లాహ్ ఖాన్, ఫర్హాజ్ అలీ, షకిలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సర్వే



సర్వే చేస్తున్న వలంటీర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా సోమవారం దుర్శేడ్, నల్లగుంటపల్లి గ్రామాల్లో వలంటీర్లు సామాజిక సర్వే నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ మురళీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో సేవాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ శిబిరాలు ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమాల్లో సర్పంచులు గాజుల వెంకటమ్మ, వడ్లూరి సంతోష, కార్యదర్శి సుమన్, ఎన్ఎస్ఎస్ పీవో నాయుడు, చంద్రమౌళి పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు అమలుపై హైకోర్టును ఆశ్రయించాం

శాతవాహనయూనివర్సిటీ: బయోమెట్రిక్ హాజరును అందరికీ అమలు చేయకుండా కేవలం డిప్లొమా విద్యార్థులకే అమలు చేస్తుండటంపై హైకోర్టును ఆశ్రయించినట్లు ఎస్‌టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర సంజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బయోమెట్రిక్ విధానం బీటెక్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ విద్యార్థులకు ప్రారంభించలేదన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థులకు అమలు చేయాలని కోరారు. బయోమెట్రిక్ లేకపోవడంతో విద్యార్థులు చదువులో వెనక పడుతున్నారని, కొన్ని కళాశాలలు కేవలం అక్రమంగా రియంబర్స్‌మెంట్ కొల్లగొట్టడానికి మాత్రమే కళాశాలలు నడుపుతున్నారని ఆరోపించారు. బయోమెట్రిక్ పెడితే అక్రమాలకు అడ్డు కట్టపడుతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బయోమెట్రిక్ అమలు చేయాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, రాకేశ్, ప్రశాంత్, సందీప్‌లు పాల్గొన్నారు.

చిత్ర కథ



ఇలా.. అయితే విద్యార్థులకు ప్రమాదమే..

కరీంనగర్‌లోని నడిబొడ్డున గల ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో పురాతన పాఠశాలకు ఆనుకొని 100 గజాల దూరంలో ఎస్సీ, బీసీ హాస్టళ్లు ఉన్నాయి. హాస్టల్ నుంచి స్కూల్‌కు వెళ్లే దారిలో పార్క్ పేరుతో అడ్డుగా గోడ నిర్మించారు. దీంతో హాస్టల్ విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేందుకు ఇలా ప్రధాన రహదారిపై నుంచి సుమారు అర కిలో మీటరు నడిచి వెళ్తున్నారు. రహదారిపై వెంట విద్యార్థులు వెళ్తుండటంతో ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయని వాపోతున్నారు. ప్రమాదాలు జరుగకముందే విద్యార్థులు వెళ్లేందుకు కొంత స్థలాన్ని వదిలిపెట్టాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

కదిలించేది.. నడిపించేది కవిత్వం



అష్టావధానంలో పాల్గొన్న కవులు(ఫైల్)

- సామాజిక చైతన్యం కలిగించే కవితలు ప్రపంచాన్ని శాసిస్తాయి
- నేడు ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా పలువురు కవుల అభిప్రాయాలు

కరీంనగర్‌కల్చరల్: కదిలేది కదిలించేది.. పెనునిద్దర వదిలించేది.. ముమ్ముందుకు నడిపించేది కవిత్వం. సమాజ శ్రేయస్సుకు కవిత్వం పరమావది కావాలన్నది నిర్వివాదాంశం., సామాజిక చైతన్యాన్ని కలిగించే కవితలు ప్రపంచాన్ని శాసిస్తాయి అంటున్నారు ప్రముఖ కవులు. మంగళవారం ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని పలువురు కవులను 'సాక్షి' పలకరించగా తమ మనోభావాలను వెల్లడించారు.

కవితా దినోత్సవం నేపథ్యం..

1999లో ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరిగిన యునెస్కో 30వ సదస్సులో మార్చి 21వ తేదీని ప్రపంచ కవితా దినోత్సవంగా పాటించాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా కవితా రచన, పఠన, ప్రచురణ, బోధన, వ్యాసాంగంలో చైతన్యం, జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ కవిత్వ ఉద్యమాల స్ఫూర్తిని పదిల పర్చడమే కవితా దినోత్సవం లక్ష్యం.

భావాల కళాత్మక రూపమే కవిత



మనస్సులో మెదిలిన భావాల కళాత్మక రూపమే కవిత. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ కవితా ఉద్యమాల స్ఫూర్తిని పరిచయం చేస్తూ కవిత్వం రాయడం, చదవడం, ప్రచురించడం తదితర అంశాల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఏటా మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆధునిక సమాజ జీవనంలో సాహిత్యం పాత్రను గుర్తిస్తూ తెలంగాణ సాహిత్య అకాడమీ లాంటి రాష్ట్రస్థాయి సంస్థలు జిల్లాస్థాయిలో కవితా దినోత్సవాన్ని నిర్వహించాలి. వర్ధమాన కవులు, కొత్తగా కలం పట్టిన నవ కవులను ప్రోత్సహించేలా కవిత్వ కార్యశాలలను సాహిత్యసంస్థలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, కవి, విమర్శకులు

భాషను కాపాడుకుందాం



ప్రపంచ కవితా దినోత్సవ స్ఫూర్తితో కవిత్వ సృజన చేసి మన తెలుగు భాషను కాపాడుకుందాం. సామాజిక చైతన్యమే పరమావధిగా, కవులుగా మన కర్తవ్యాలను నిర్వర్తిద్దాం. కవిత్వంలో సమాజాన్ని ప్రతిబింబింప జేస్తూ ప్రజల పక్షాన నిలుద్దాం. కవిత్వ రచనలో కనీస ప్రమాణాలు పాటించి గాఢమైన కవిత్వాన్ని రాద్దాం. వస్తు వైవిధ్యంతో పాటు కొత్త దనానికి చోటు కల్పిద్దాం. కవిత్వ వ్యక్తీకరణతో మన భాషను కాపాడుకుందాం.

– దాస్యం సేనాధిపతి,ప్రముఖ కవి, విమర్శకులు

కవిత్వం సమాజ హితాన్ని ఆకాంక్షించాలి



కవిత్వం మనిషి హృదాయాన్ని శుద్ధి చేసే సాహిత్య ప్రక్రియ. ఇది ఉద్వేగ సంబంధితమైన భాష ఒక మాధ్యమం. నిజానికి కవిత్వానికి రస ఆనందం, సంఘ సంక్షేమ అని రెండు ప్రతివాజనాలుంటాయి. నేటి పరిస్థితుల్లో కవిత్వం సమాజ హితాన్ని ఆకాంక్షించాలి. నేటితరం కవులు ప్రాచీన సాహిత్యాన్ని, సమకాలీన కవిత్వాన్ని, అనువాద రచనలు బాగా చదవాల్సిన అవసరం ఉంది.

– నలిమెల భాస్కర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బహు భాషావేత్త

కవిత్వం హృదయంలోంచే జనిస్తుంది



కవిత్వమైనా, మరే కళాసృజన అయినా మనస్సుకు అంటిన మాలిన్యాన్ని తొలగించి ప్రతిమను రూపొందించడం లాంటిది. కవిత్వ సృజన గాలిలోంచి జనించదు, హృదయంలోంచే జనిస్తుంది. హృదయంలోంచి ప్రకృతిలోకి, ప్రకృతి లోంచి హృదయంలోకి చేసే ప్రయాణమే కవిత్వం. కవి పడే అంతర్ బహిర్ సంఘర్షనే కవిత్వమవుతుంది. కవి కావాలనుకున్న వాడు సాహిత్యాన్ని, సమాజాన్ని కూడా బాగా చదవాలి. లోతుగా అధ్యయనం చేయాలి. అప్పుడే మంచి కవిత్వం వస్తుంది.

– వారాల ఆనంద్, కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

పాపం.. వీరికి దిక్కెవరు?

- వేధింపులకు పెద్ద దిక్కు మరణం
- అనాథలుగా భర్త, కూతురు
- టీఎన్జీవోల సంఘం చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న టీఎన్జీవోల సంఘం నాయకులు

కరీంనగర్ అర్బన్: అచేతన స్థితిలో భర్త.. మానసిక సమస్యతో కూతురు ఇద్దరిని కంటికి రెప్పలా కాపాడుకునే తల్లియే ఆ కుటుంబానికి ఆధారం. అంగన్‌వాడీలో ఆయాగా పనిచేస్తూ వారికి సపర్యలు చేస్తుండగా అంతలోనే కానరాని లోకాలకు వెళ్లిపోయింది. కాదు కాదు సామాజిక కార్యకర్త వేధింపులకు బలైంది. గుండెపోటుతో కుప్పకూలగా ఇప్పటికీ తల్లి ఉందనే భ్రమలో కూతురుండగా మంచంలో భర్త బిక్కు బిక్కుమంటున్నారు. అంగన్‌వాడీలు, టీఎన్జీవోల సంఘం నాయకులు ఆర్థిక సాయం అందించిన హృదయ విదారకమైన ఘటన చూపరులను కన్నీరు పెట్టిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని భగత్‌నగర్‌కు చెందిన సల్ల వరమ్మ మారుతినగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఆయాగా పనిచేస్తోంది. భర్త కొండయ్య పక్షవాతంతో మంచంపట్టగా కూతురు పద్మ మానసిక వికలాంగురాలు. కూతురి పెళ్లితోనైనా అల్లుడి రూపంలో ఇంటికి పెద్ద దిక్కు దొరుకుతుందని భావించగా రెండు పెళ్లిళ్లు చేసినా ఫలితం లేదు. దీంతో ఇంటి వద్దే ఉంటోంది. ఇద్దరిని చంటిపిల్లల్లా చూసుకోవాల్సిన పరిస్థితి వరమ్మది. కాగా ఈనెల 13న గుండెపోటుతో మరణించింది. సామాజిక కార్యకర్త పేరుతో ఒకరు కేంద్రానికి వచ్చి వీడియోలు తీయడం, సరుకుల వివరాలను కోరడంతో భయాందోళనకు గురైంది. దీంతో అంగన్‌వాడీల సంఘం నాయకులకు, టీఎన్జీవో నేతలకు గోడు వెల్లబోసుకుంది. ఈ క్రమంలోనే గుండెపోటుతో మరణించినట్లు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వాపోతున్నారు. ఈ విషయంలో సీపీ, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేయగా వారు విచారణకు ఆదేశించినట్లు సమాచారం. అయితే పెద్ద దిక్కు మరణంతో కొండయ్య, పద్మల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికీ తల్లి బతికే ఉందని పద్మ అమాయకపు మాటలు.. అచేతన స్థితిలో కొండయ్య ఉండగా వారి భవితవ్యం ఏంటన్నది ప్రశ్నార్థకం. ఈనేపథ్యంలో అంగన్‌వాడీలు, టీఎన్జీవోల సంఘం నాయకులు తలా కొంత చేయూతనివ్వగా రూ.40వేలు జమయ్యాయి. దీంతో సోమవారం టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, శారద, సబిత, అంగన్‌వాడీ నాయకులు భాగ్యలత, లక్ష్మి, స్వరూపలు సదరు నగదును కుటుంబీకులకు అందజేశారు. కాగా సామాజిక కార్యకర్త ఆగడాలకు సీడీపీవో వత్తాసు పలుకుతున్నారని అంగన్‌వాడీలు వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడుతామని టీఎన్జీవో నాయకులు వివరించారు.

ఏప్రిల్ 6న వీరహనుమాన్ విజయయాత్ర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్ విశ్వ హిందూపరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న కరీంనగర్‌లో వీరహనుమాన్ విజయయాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్ తెలిపారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో విజయయాత్రకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. విజయయాత్రలో శ్రీగిరి శేషాద్రినాథ్ మఠ పీఠాదీశ్వరులు సర్వేశ్వరాంబికా శివాచార్య స్వామిజీ పాల్గొంటారని అన్నారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు తోట రాజేందర్, తరాజు నవనీత్‌రావు, కొమ్ము ఆంజనేయులు, ఎలిమెల సతీశ్, బజరంగ్‌దళ్ నాయకులు తోట ప్రదీప్‌కుమార్, వుట్కూరి రాధాకృష్ణరెడ్డి, గజ్జెంట రాజేందర్, వంగర ఆంజనేయులు, బూస అశోక్, శివ, మురళీ, అఖిల్, సంతోష్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు,

ఏటీఎంలో నగదు చోరీకి యత్నం



పోలీసులు అనుమానిస్తున్న వ్యక్తి

కరీంనగర్‌క్రైం: ఏటీఎం కేంద్రంలో నగదు చోరీకి ఓ వ్యక్తి విఫలయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18న రాత్రి చేపల మార్కెట్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు ఏటీఎం కేంద్రంలో ఒక వ్యక్తి మాస్కు కట్టుకొని లోనికి వెళ్లి నగదు దొంగతనం చేయాలని ప్రయత్నించాడు. ఎంత ప్రయత్నించిన నగదు రాకపోవడంతో వెనుదిరిగాడు. ఆదివారం బ్యాంకుకు సెలవు కావడంతో పోలీసులకు ఆలస్యంగా సమాచారమందించగా ఆదివారం రాత్రి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల ద్వారా నిందితుడి ఫొటోను తీసుకొని అతడి ఆచూకీ కోసం వెతుకుతున్నారు. నిందితుడిని పట్టించిన వారికి తగిన పారితోషకం ఇస్తామని టౌన్ ఏసీపీ తుల శ్రీనివాసరావు ప్రకటించారు.

క్లుప్తంగా...

టీడీపీ 'సామాజిక' చిచ్చు

- సభా విలువలు.. సభాపతి స్థానంపై ఆ పార్టీకి గౌరవం లేదు
- వేళ్లు చూపిస్తూ.. సభ కనిపించకుండా ముఖానికి ప్లకార్డులు అడ్డుపెడతారా?
- ప్లకార్డు అడ్డు తొలగిస్తే స్పీకర్ కొట్టేశారంటూ గోల చేస్తారా?
- టీడీపీ సభ్యుల అనుచిత ప్రవర్తనపై స్పీకర్ తమ్మినేని సీతారాం ఆవేదన

'సభాపతి స్థానానికి కొన్ని పద్ధతులుంటాయి. వాటిని పట్టించుకోకుండా టీడీపీ సభ్యులు పోడియంపైకి వచ్చి నినాదాలు చేస్తారు. చైర్‌ను చుట్టిముట్టి గుద్దుతారు. నా ముఖంపై వేళ్లు చూపిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు. డోలా వీరాంజనేయస్వామి ప్రవర్తించిన తీరు హేయంగా ఉంది. అచ్చెన్నాయుడు కింద నుంచే సభ కనిపించకుండా నా ముఖానికి ఎదురుగా ప్లకార్డు అడ్డుపెడతారు. ఎమ్మెల్యే ఎలీజా (వైఎస్సార్‌సీపీ) వచ్చి మా హక్కులు రక్షించాలని కోరుతుంటే.. టీడీపీ సభ్యుడు నా ముఖానికి అడ్డుగా పెట్టిన ప్లకార్డును పక్కకు జరిపాను. అది కింద పడిపోయింది. అంతే.. వెంటనే స్పీకర్ కొట్టేశారంటూ గోలచేశారు. ఇలా చేయమని మీకు ఎవరు చెప్పి పంపిస్తున్నారు? ఇది మంచి సంస్కారం కాదు'..

– ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అసెంబ్లీకి బ్లాక్‌డే

ఏపీ శాసనసభలో పరాకాష్టకు చేరిన టీడీపీ ఎమ్మెల్యేల అరాచకం



శాసనసభలో స్పీకర్ తమ్మినేని సీతారాంపై పేపర్లు విసురుతూ.. దాడి చేస్తున్న టీడీపీ సభ్యులు



టీడీపీ సభ్యుల దాడిలో గాయపడిన దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

సాక్షి, అమరావతి: ఈసారి అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుంచి సభను అడ్డుకోవడమే లక్ష్యంగా నిత్యం రచ్చరచ్చ చేస్తున్న టీడీపీ సభ్యుల దుశ్చర్య సోమవారం పరాకాష్టకు చేరుకుంది. ఏకంగా సభాపతి తమ్మినేని సీతారాంపై దాడికి తెగబడ్డారు. సభా సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ చరిత్రలో ఎన్నడూలేని విధంగా టీడీపీ ఎమ్మెల్యేలు తమ వికృత చేష్టలను బయటపెట్టారు. సభ సోమవారం ఉదయం ప్రారంభం కాగానే జీఓ–1 రద్దు మీద తామిచ్చిన వాయిదా తీర్మానంపై చర్చకు టీడీపీ సభ్యులు పట్టుబట్టారు. ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానంపై నిర్ణయం తీసుకుంటానని చెబుతూ స్పీకర్ క్వశ్చన్ అవర్‌ను ప్రారంభించారు. దీంతో అచ్చెన్నాయుడు స్పీకర్ వైపు వేలు చూపిస్తూ ముందు తామిచ్చిన వాయిదా తీర్మానాన్ని సభలో చదివి వినిపించాలంటూ బిగ్గరగా కేకలు వేశారు. టీడీపీ సభ్యులంతా ప్లకార్డులతో వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేయడం మొదలుపెట్టారు. స్పీకర్ టేబుల్‌పై ఉన్న పుస్తకాలు, పత్రాలు చించి వేస్తూ ఆయన ముఖంపైకి విసరడం ప్రారంభించారు. స్పీకర్ అటెండర్‌ను పక్కకు తోసేసిన టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి స్పీకర్‌కు అడ్డంగా నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అంతేకాకుండా స్పీకర్ ముఖంపై ప్లకార్డును అడ్డంగా పెట్టడంతో పాటు ఆయనపై చేయిచేసుకున్నారు. ప్లకార్డు స్పీకర్ కంటికి తగలడంతో ఆయన దాన్ని పక్కకు తోసివేయడంతో అది కిందపడింది. దీంతో డోలా బాలవీరాంజనేయస్వామితో పాటు టీడీపీ సభ్యులు స్పీకర్ చైర్ చుట్టూ మూగి ఆయనపై దాడికి తెగబడ్డారు.

ఎస్సీ ఎమ్మెల్యేలపై దాడి..

అదే సమయంలో.. తమ హక్కులు కాపాడాలంటూ వెల్ బయటి నుంచి విన్నవిస్తున్న చింతలపూడి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా సభాపతిపై జరుగుతున్న దాడిని గమనించి పోడియం పైకెళ్లి టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని అడ్డుకోవడంతో ఆయనను టీడీపీ సభ్యులు తోసేశారు. స్పీకర్‌తోపాటు సహచర ఎమ్మెల్యే ఎలీజాపై టీడీపీ సభ్యులు భౌతిక దాడి చేస్తుండడంతో సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పోడియంపైకి వచ్చి వారిని అడ్డుకోబోయారు. ఆయనపైనా దాడికి పాల్పడుతూ పక్కకు తోసేయడంతో సుధాకర్‌బాబు పోడియం హ్యాండ్ రెయిలింగ్‌పై పడిపోయారు. దీంతో సుధాకర్‌బాబు ఎడమ మోచేతికి గాయమైంది.

డిప్యూటీ సీఎంపై 'డోలా' అనుచిత వ్యాఖ్యలు

తనపై జరిగిన దాడితో పాటు సభలో టీడీపీ సభ్యుల దుశ్చర్యకు మనస్తాపం చెందిన స్పీకర్ సీతారాం సభ నుంచి తన చాంబర్‌లోకి వెళ్లిపోయారు. రోజూ రచ్చచేయడం టీడీపీ సభ్యులకు అలవాటుగా మారిందని, ఈరోజు ఏకంగా సభాపతిపైనే దాడులకు తెగబడ్డారంటూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనడంతో.. 'నువ్వొక డిప్యూటీ సీఎం అంట్రా.. పనికిమాలిన నా కొడకా'.. అంటూ డోలా బాలవీరాంజనేయ స్వామి పరుష పదజాలంతో నానా దుర్భాషలాడడంతో మిగిలిన సభ్యులు ఆయన్ని వారించారు. అర్ధగంట అనంతరం సభ తిరిగి ప్రారంభమైన తర్వాత టీడీపీ సభ్యులను ఒకరోజు సస్పెన్షన్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. దీంతో తమను బయటకు పంపేందుకు ప్రయత్నిస్తున్న మార్షల్స్‌పైనా టీడీపీ సభ్యులు పిడిగుద్దులతో దాడికి దిగారు.

అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధం

వివేకా హత్య కేసులో దస్తగిరి బెయిల్ రద్దు చేయాలి

- వాచ్‌మన్ రంగన్న వాంగ్మూలాన్ని సీబీఐ పరిగణనలోకి తీసుకోవట్లేదు
- తమకు కావాల్సిన విధంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు
- తెలంగాణ హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి పిటిషన్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఆదేశించినట్లుగా ఏ–4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడని, దాని ఆధారంగా కేసుతో ఎలాంటి సంబంధంలేని వారిని ఇరికించాలని దర్యాప్తు సంస్థ ప్రయత్నిస్తోందని వైఎస్ భాస్కర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధమని, అతడికి బెయిల్ ఇచ్చే సమయంలో కింది కోర్టు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. దస్తగిరి చెప్పిన వివరాల ఆధారంగా తనతోపాటు మరి కొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉందన్నారు. 'దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడాన్ని, బెయిల్ ఇస్తూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి. నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చవద్దని ఆదేశాలు ఇవ్వాలి' అని అభ్యర్థిస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా ఈ పిటిషన్‌లోనూ వైఎస్ వివేకా కుమార్తె సునీత ఇంప్లీడ్ అయ్యారు. 'దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా మమ్మల్ని నేరంలోకి నెట్టడం సమంజసం కాదు. వివేకా హత్య కేసులో దస్తగిరి కీలక పాత్ర పోషించాడు. హత్యకు ఆయుధాన్ని కొనుగోలు చేసింది అతడే. దస్తగిరికి బెయిల్ ఇచ్చేందుకు సీబీఐ పూర్తిగా సహకరించింది. దస్తగిరిపై వాచ్‌మన్ రంగన్న చెప్పిన అంశాలను కిందికోర్టు పట్టించుకోలేదు' అని వైఎస్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి పిటిషన్‌లో మరికొన్ని అంశాలివీ..



అన్ని ప్రశ్నలకూ సమాధానమిచ్చా...

నా వయసు సుమారు 73 ఏళ్లు. దీర్ఘకాలిక వెన్నునొప్పి, ఛాతీలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నా. ఇప్పటికే సీబీఐ విచారణకు హాజరయ్యా. దర్యాప్తు అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చా. సీఆర్‌పీసీ సెక్షన్ 161, 164 కింద వివేకా వాచ్‌మన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను దర్యాప్తు సంస్థ రికార్డ్ చేసింది. దాని ప్రకారం.. హత్య జరిగిన రోజు రంగన్న నిద్రలో ఉండగా అకస్మాత్తుగా పాత్రలు, ఇనుప రాడ్ పడిపోవడం వంటి శబ్దాలు వినపడటంతో లేచి ప్రధాన ద్వారం వద్దకు వెళ్లాడు. లోపలి నుంచి ఏడుపు లాంటి శబ్దం వినిపించడంతో పార్క్ వైపు ఉన్న ద్వారం వద్దకు వెళ్లి పక్కనే ఉన్న కిటికీ లోంచి లోపలికి చూశాడు. ఇంట్లో నలుగురు వ్యక్తులు కనిపించారు. వాళ్లు హాల్‌లో ఏదో వెతుకుతూ కనిపించారు. వారిలో ముగ్గురిని ఎర్ర గంగిరెడ్డి, షేక్ దస్తగిరి, సునీల్ యాదవ్‌గా గుర్తించాడు. నాలుగో వ్యక్తి పొడవుగా, సన్నగా ఉన్నట్లు చెప్పాడు. ఆ తర్వాత రంగన్న చీకటిగా ఉన్న తోటలోని చెట్టు దగ్గర దాక్కున్నాడు. దాదాపు 20 నిమిషాల తర్వాత పార్క్ వైపు ద్వారం తెరిచి సన్నగా, పొడవుగా ఉన్న వ్యక్తితోపాటు దస్తగిరి, సునీల్ హడావుడిగా వచ్చి కాంపౌండ్ వాల్ దూకి పారిపోయారు. అక్కడ దొరికిన ఆధారాల మేరకే పోలీసులు నలుగురిని నిందితులుగా పేర్కొన్నారు.

మమ్మల్ని ఇరికించే ప్రయత్నం..

ఆ నలుగురే ఈ హత్య చేసినట్లు రంగన్న స్టేట్‌మెంట్ చాలా స్పష్టంగా చెబుతున్నా ఈ కేసుతో ఎలాంటి సంబంధంలేని నాతోపాటు మరికొందరిపై ఆరోపణలు చేస్తూ ఇరికించేందుకు దర్యాప్తు సంస్థ అక్రమ పద్ధతులను అనుసరిస్తోంది. వివేకా కుమార్తె సునీత, దర్యాప్తు అధికారులు వారికి తోచిన చట్టవిరుద్ధ ప్రక్రియలను ఆశ్రయిస్తున్నారు. ఇందులో భాగంగానే దస్తగిరికి కొన్ని సూచనలు చేసి వారికి కావాల్సిన విధంగా వాంగ్మూలం తీసుకున్నారు. దీంతో దస్తగిరి.. ఏ–5(శివశంకర్‌రెడ్డి)తో పాటు నాపై, మరో ఇద్దరిపై నిరాధార ఆరోపణలు చేశాడు.

సుప్రీం ఉత్తర్వులను పట్టించుకోకుండా...

మరో ఇద్దరికి కూడా సీబీఐ నోటీసులు జారీ చేసి విచారణకు పిలవనున్నట్లు మీడియా కథనాల ద్వారా తెలిసింది. దస్తగిరి గూగుల్ టేక్ అవుట్ డేటా ఆధారంగా చేసుకుని సీబీఐ నాపై ఆరోపణలు మోపుతోంది. నాకు వ్యతిరేకంగా దర్యాప్తు చేస్తోంది. సీబీఐ అనుసరించిన విధానం పూర్తిగా చట్టవిరుద్ధం. హత్య కేసులో నిందితుడైన కిరాయి హంతకుడికి ముందస్తు బెయిల్ ఇవ్వకూడదని సుప్రీం కోర్టు పలుమార్లు తీర్పులిచ్చింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరి వాంగ్మూలం ఆమోదయోగ్యం కాదు. దస్తగిరి చెప్పిన దానికి ఎలాంటి సాక్ష్యం లేదు. నేరంలో నలుగురు పాలుపంచుకున్నారు. వీరిలో తక్కువ నేరం చేసిన వారు జైలులో ఉండగా కీలక పాత్ర పోషించిన దస్తగిరికి మాత్రం బెయిల్ ఇవ్వడం సరికాదు. గంగిరెడ్డి ఆదేశాల మేరకు హత్యలో దస్తగిరి కీలక పాత్ర పోషించాడు. దీని కోసం భారీ మొత్తంలో నగదు కూడా తీసుకున్నాడు. ఆయుధాన్ని తెచ్చానని, హత్యలో ప్రధాన పాత్ర పోషించానని కూడా ఒప్పుకున్నాడు. ఈ అంశాన్ని కిందికోర్టు మేజిస్ట్రేట్ పరిగణలోకి తీసుకోలేదు. బెయిల్ ఇచ్చేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా వివరణ తీసుకోవాల్సి ఉండగా అలా చేయలేదు. అప్రూవర్‌గా మారడం, బెయిల్ ఇవ్వడం అంతా చట్టవిరుద్ధంగానే జరిగింది. బెయిల్ మంజూరు చేస్తూ కిందికోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలి. దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా నన్ను నిందితుడిగా చేర్చవద్దని సీబీఐని ఆదేశించాలి.

'స్కిల్డ్' క్రిమినల్ స్కామ్!

▶ మొదటి పేజీ తరువాయి

సీమెన్స్ పేరుతో స్కామ్ జరిగింది. ఇలాంటి గొప్ప స్కామ్‌ను నడిపిన వ్యక్తి నారా చంద్రబాబే. అక్షరాలా రూ.371 కోట్ల ప్రజాధనాన్ని మాయం చేశారు. ఈ డబ్బును షెల్ కంపెనీల ద్వారా రకరకాల రూటింగ్ చేసి మళ్లీ చంద్రబాబు నివాసం ఉంటున్న హైదరాబాద్‌కు తరలించారు. స్కిల్డ్ క్రిమినల్ చేసిన స్కామ్ ఇది. ప్రజాధనాన్ని దోచేయడంలో చంద్రబాబు చాతుర్యం చూడాలంటే స్కిల్ స్కామ్‌ను ఉదాహరణగా చెప్పవచ్చు.

ముందుగానే ఊహించి..

చేయని స్కిల్ డెవలప్‌మెంట్ ఎలా చూపించాలి..? దోచేసిన డబ్బును ఎలా జేబులోకి తెచ్చుకోవాలి..? చట్టానికి దొరక్కుండా ఏ ఫైల్స్‌ను ముందుగానే మాయం చేయాలి..? దర్యాప్తు జరిగితే తప్పించుకోవడానికి ఏం చేయాలి..? అసలు విచారణ జరగకుండా ఏం చేయాలి..? ఇవన్నీ ముందుగానే ఊహించుకుని రూపకల్పన చేశారు. ఒక క్రిమినల్ మాత్రమే ఇలా చేయగలుగుతాడు. అవినీతికి నిజంగానే విజన్ ఆయన. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే ఈ స్కిల్ స్కామ్ ఊపిరి పోసుకుంది. ఇందుకోసం తనకు కావాల్సిన మనుషులను చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లోకి తీసుకొచ్చారు. సీమెన్స్ కంపెనీలో ఓ ఉన్నతోద్యోగిగా ఉన్న వ్యక్తితో లోపాయికారీగా వీళ్లు లాలూచీ పడ్డారు. అతడి ద్వారా దోపిడీకి పాల్పడ్డారు. ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.3,356 కోట్లు. ఇందులో ప్రభుత్వ వాటా 10 శాతం, సీమెన్స్ కంపెనీ 90 శాతం భరిస్తుందన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా ఓ ప్రైవేట్ కంపెనీ రూ.3 వేల కోట్ల గ్రాంట్ ఇస్తుందా..? పోనీ చంద్రబాబు ముఖాన్ని చూసి ఇస్తారా...? రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్టు తీసుకోవాలంటే ఒక పద్ధతి ఉంటుంది. కానీ ఇక్కడ డీపీఆర్ కూడా తయారు చేయలేదు. ముందస్తుగానే ఆ కంపెనీలో లాలూచీ పడ్డ ఇద్దరు వ్యక్తులు రూపొందించిన డీపీఆర్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఒక నోట్ పెట్టించారు. కనీసం టెండర్ లాంటి ప్రక్రియ కూడా ఈ ప్రాజెక్టులో లేదు. చంద్రబాబుకు మాత్రమే ఇటువంటిది సాధ్యం. ఈ స్కామ్.. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత తవ్వింది కాదు. చంద్రబాబు హయాంలోనే ఇది బయటకు పొక్కింది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, ఎల్లో మీడియా ఏ ఒక్కరూ మాట్లాడలేదు. చివరకు దత్తపుత్రుడు కూడా అడగలేదు. దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ).. ఇదే వీళ్ల విధానం.

గ్రాంట్ అనే పదమే లేకుండా ఒప్పందం

రాష్ట్రంలో 6 క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని, ఒక్కో క్లస్టరులో ఒక్కో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అని, 5 టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్స్ కూడా ఏర్పాటు చేస్తామని జీవోలో చెప్పారు. ఒక్కో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు రూ.546 కోట్లు ఖర్చు చేస్తామని, ఇందులో 90 శాతం ఖర్చును సీమెన్స్, డిజైన్‌టెక్ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద అందిస్తుందని, మిగిలిన 10 శాతం అంటే ఒక్కో సెంటర్‌కు రూ.50 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చెప్పారు. ప్రాజెక్టు వ్యయంలో పది శాతం, పన్నులతో కలిపి రూ.371 కోట్లను ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. మిగిలిన రూ.3 వేల కోట్లను సీమెన్స్ సంస్థ గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఉదారంగా ఇస్తుందంటూ కేబినెట్‌లో చెప్పారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద వచ్చిందంటే ఆ డబ్బును మనం తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదు. అయితే ఒప్పందం దగ్గరకు వచ్చేసరికి 90 శాతం గ్రాంట్ ఇన్ ఎయిడ్ ప్రస్తావన పూర్తిగా ఎగిరిపోయింది. ఆ పదమే ఎక్కడా కనిపించలేదు. ప్రభుత్వం ఇవ్వాల్సిన 10 శాతం వాటా కాస్తా రూ.330 కోట్లు ఫైనాన్షియల్ అసిస్టెన్స్‌గా మారిపోయింది. కుంభకోణానికి ఇక్కడే బీజం పడింది. ఒప్పంద పత్రంలో వివరాలు నింపాల్సిన చోట ఖాళీగా విడిచిపెట్టారు. ఏ తేదీన ఒప్పందం కుదిరిందన్న విషయాన్ని కూడా రాయలేదు. జీవోలో ఉన్నది ఒప్పందంలో లేనప్పుడు ఎలా సంతకాలు చేశారు?

సీమెన్స్ నుంచి పైసా రాలేదు

గత ప్రభుత్వం 10 శాతం నిధులను విడుదల చేసినప్పుడు సీమెన్స్ కంపెనీ నుంచి రావాల్సిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఒక్క పైసా కూడా రాలేదు. అసలు ఆ ప్రాజెక్టు గురించే ఆ కంపెనీకి తెలియదు. గత ప్రభుత్వం ఐదు దఫాల్లో రూ.371 కోట్లు విడుదల చేసింది. ఆ మొత్తం షెల్ కంపెనీల నుంచి చంద్రబాబుకు చేరిన వెంటనే దఫాల వారీగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేశారు.

ప్రేమ పేరిట వేధింపులకు యువతి బలి

- నిశ్చితార్థం అయినా వేధించిన యువకుడు
- పురుగుల మందు తాగిన యువతి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి



మృతురాలు ఎంబడి సాయిష్మా(ఫైల్)

దండేపల్లి(మంచిర్యాల): ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలంటూ ఓ యువకుడు యువతిని వేధించాడు. మరో యువకుడితో ఆమెకు నిశ్చితార్థం అయినా వేధింపులు ఆగకపోవడంతో భరించలేక పురుగుల మందు తాగింది. చికిత్స పొందుతూ సోమవారం చనిపోయింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొత్త మామిడిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొత్తమామిడిపల్లికి చెందిన ఎంబడి సాయిష్మా(22)ను ఇదే గ్రామానికి చెందిన నలిమెల వినయ్ ఏడాది కాలంగా ప్రేమ పేరుతో వెంటపడుతూ వేధిస్తున్నాడు. డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటున్న ఆమెకు తల్లిదండ్రులు ఓ యువకుడితో పెళ్లికి ఈ నెల 13న నిశ్చితార్థం చేశారు. ఈ విషయం తెలియడంతో వినయ్ ఈ నెల 18న సాయిష్మాకు ఫోన్ చేసి వేధించాడు. తననే పెళ్లి చేసుకోవాలని, లేదంటే చనిపోవాలని బెదిరించాడు. వేధింపులు తాళలేక సాయిష్మా అదే రోజు పురుగుల మందు తాగింది. స్థానికులు ఆమెను మేదరిపేట ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి సోమవారం చనిపోయింది. పెళ్లి చేసుకోవాలని వినయ్ వేధించడంతోనే తాను పురుగుల మందు తాగానని సాయిష్మా ఆస్పత్రిలో చెప్పినప్పుడు తీసిన వీడియోలు వైరల్ అయ్యాయి. మృతురాలి చిన్నమ్మ జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాంబమూర్తి తెలిపారు. ఈ మేరకు నిందితుడు వినయ్‌ను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు.

ఝరి(బి)లో చిరుత సంచారం



వ్యవసాయ పొలం వద్ద రైతులు

తానూరు: నిర్మల్ జిల్లా తానూరు మండలం ఝరి(బి) గ్రామ శివారులో చిరుతపులి సంచారం సోమవారం కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన రైతు బొడ్డోల్ల సాయినాథ్ మొక్కజొన్న పంట కాపలా కోసం వెళ్లాడు. చేనులో చిరుత పులి సంచరిస్తుండగా గమనించిన రైతు చెట్టుపైకి ఎక్కాడు. కేకలు వేయడంతో పక్కనే ఉన్న రైతులు అక్కడికి చేరుకున్నారు. రైతులంతా కేకలు వేయడంతో చిరుత అటవీ ప్రాంతంలో పారిపోయినట్లు తెలిపారు. తర్వాత పొలంలోకి వెళ్లి చిరుత పాద ముద్రలను పరిశీలించారు. ఝరి(బి) శివారులో చిరుత సంచరిస్తున్న సమాచారం తెలుసుకున్న రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు జంకుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతను అటవీప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేయాలి'



బీఎల్ సంతోష్‌తో ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయాలని బీజేపీ జాతీయ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బీఎల్ సంతోష్ అన్నారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు సోమవారం ఢిల్లీలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మేకిన్ ఇండియా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలకు సైతం పార్టీని విస్తరిస్తూ రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో పార్టీ సంస్థాగత అంశాలను అడిగి తెలుసుకున్నట్లు ఎంపీ సోయం పేర్కొన్నారు.

స్నేహితులతో ఈతకు వెళ్లి యువకుడి మృతి

- కుటుంబ సభ్యులు ఆరా తీసినా విషయం చెప్పని మిత్రులు
- చెరువులో మరునటి రోజు లభ్యమైన మృతదేహం



ధోని కృష్ణ (ఫైల్)

గుడిహత్నూర్(బోథ్): సరదాగా స్నేహితులతో కలిసి చెరువు వద్దకు ఈతకు వెళ్లిన ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన ధోని గంగారెడ్డి–రుక్మాబాయి దంపతులకు నలుగురు సంతానం. తండ్రి ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు కృష్ణ (23) పదో తరగతి వరకు చదివి ఇంటివద్ద వ్యవసాయ పనులు చూసుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం మరో ముగ్గురు మిత్రులతో కలిసి ముత్నూర్ చెరువు వద్దకు ఈతకు వెళ్లాడు. అక్కడ ఫొటోలు దిగిన తర్వాత ఈత కొట్టే క్రమంలో నీటిలో మునిగిపోయాడు. మిగతా స్నేహితులు భయపడి ఎవరికి సమాచారం ఇవ్వకుండా ఇంటికి వెళ్లిపోయారు. కృష్ణ కుటుంబ సభ్యులు అడిగినా వారు తమకు తెలియదని చెప్పడం గమనార్హం. రాత్రి పలుచోట్ల వెదికినా ఆచూకీ లభించలేదు. సోమవారం సాయంత్రం ముత్నూర్ చెరువులో మృతదేహంతో పాటు దుస్తులు, చెప్పులను స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా కృష్ణదిగా గుర్తించారు. కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

విషయం దాచిన మిత్రులు

తమతో వచ్చిన కృష్ణ ఈత రాక మునిగిపోతే స్నేహితులు షహానే సుశీల్, ఎం.బలిరామ్, బదావత్ విష్ణు కాపాడే ప్రయత్నం చేయలేదు. ముగ్గురు ఉన్నా ఇతరులకు సమాచారం అందించలేదు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, పోలీసులు ముగ్గురు స్నేహితులను విచారించగా.. 'తాము చెరువుకు వెళ్లిన మాట వాస్తవమేనని, ఈత కొట్టాం.. ఎవరికి వారు ఫొటోలు తీసుకున్నాం. ఆ తర్వాత తను అటు వైపు ఉన్నాడు. మేం ఇటు వైపు ఉన్నాం. చూసేసరికి కృష్ణ కనిపించలేదు. మునిగిపోయాడనే భయంతో ఇంటికి వచ్చాం. విషయం ఎవరికీ చెప్పలేదు..' అనే సమాధానం వారిలో ఒకరు చెప్పినట్లు తెలిసింది.

మెడికల్ బోర్డు తిరకాసు..

- బ్రెయిన్‌స్ట్రోక్‌తో నడవలేని స్థితిలో ఉన్నా నో అన్‌ఫిట్
- ఇద్దరు పట్టుకుని నడిపిస్తే గాని డ్యూటీకి రాలేని పరిస్థితి
- బోర్డులోనే బట్టలు తడుపుకున్నా పట్టించుకోని డాక్టర్లు



భార్య, కూతుళ్ల సాయంతో జీఎం ఆఫీస్‌కు వచ్చిన కార్మికుడి కుటుంబం

అన్‌ఫిట్ చేయండి..



కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్యం స్పందించి అన్‌ఫిట్ చేసి నా పిల్లలకు ఉద్యోగం పెట్టించండి. నిలబడలేక, మాట్లాడలేక ఇబ్బంది పడుతున్నా. డ్యూటీకి వెళ్లలేక పోతున్నా. బ్రెయిన్‌స్ట్రోక్ జీవితంలో చీకటి నింపింది.

– తాంత్ర రాజేశం

గోదావరిఖని: మెడికల్ బోర్డు లీలలు చూసి కార్మికులు ముక్కున వేలేసుకుంటున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్‌తో మాట్లాడలేక.. నరాలు చచ్చుబడి.. నడవలేని స్థితిలో ఉన్నా మెడికల్ అన్‌ఫిట్‌కు మాత్రం డాక్టర్లు కనికరించడంలేదు. నాలుగుసార్లు పరీక్షల కోసం హైదరాబాద్ ఆసుపత్రికి రెఫరల్ చేశారు. అన్నిసార్లు ఆసుపత్రుల చుట్టూ తిరిగినా మెడికల్ బోర్డు అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మూత్ర విసర్జన ఎప్పుడు వస్తుందో తెలియక.. మెడికల్ బోర్డులోనే బట్టలు తడుపుకొనే ఓ కార్మికుడిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. చివరకు తన డ్యూటీ తాను చేయాలంటూ అధికారులు కార్మికుడి చేతిలో లేఖ పెట్టారు. దీంతో ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో కార్మికుని కుటుంబం రోదిస్తోంది. సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3లో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న తాంత్ర రాజేశానికి ఏడాది క్రితం బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. దీంతో నరాలు చచ్చుబడి నడవలేని స్థితికి చేరుకున్నాడు. బ్రెయిన్ సరిగా స్పందించక బట్టల్లోనే మూత్రం పోసుకుంటున్నాడు. ఈ క్రమంలో తాను డ్యూటీ చేయలేనని, మెడికల్ అన్‌ఫిట్ చేసి తన కూతురుకు ఉద్యోగం ఇవ్వాలని వేడుకుంటూ మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నాడు. అన్ని సరిగా ఉన్న కార్మికుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే యాజమాన్యం అనారోగ్యంతో బాధపడుతున్న రాజేశంను మాత్రం పట్టించుకోవడం లేదు. రెఫరల్ ఆసుపత్రుల చుట్టూ నాలుగుసార్లు తిరిగి కార్పొరేట్ మెడికల్ బోర్డుకు వెళ్తే అనారోగ్యంతో సంబంధం లేదని, డ్యూటీ చేయాల్సిందేనని లేఖ చేతిలో పెట్టడంతో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. కనీసం నడవలేకుండా, మానసిక సరిగా లేక ఇబ్బంది పడుతున్న రాజేశంను ఇద్దరు కూతుళ్లు, భార్య కలిసి ఓసీపీ–3కి డ్యూటీకి తీసుకొస్తున్నారు. అసలే నడవలేని స్థితిలో ఉన్న ఇతన్ని తీసుకుని ఎక్కడ పని చేయించాలని అధికారులు తలపట్టుకున్నారు. మెడికల్ బోర్డు అధికారులు అన్‌ఫిట్‌కు ససేమిరా అనడం, గనిపై ఉన్న అధికారులు డ్యూటీ ఎలా చేస్తాడని ప్రశ్నించడం చూసి కుటుంబ సభ్యులు దీనంగా రోధిస్తున్నారు.

అన్నదాతల అభివృద్ధే లక్ష్యం

- డీసీఎంఎస్ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

కరీంనగర్‌అర్బన్: అన్నదాతల అభివృద్ధే ధ్యేయమని డీసీఎంఎస్ ఛైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం సంఘం ఆవరణలో జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన పంటల కొనుగోళ్లతో పాటు వ్యాపారంలో డీసీఎంఎస్ ముందుంటుందని తెలిపారు. ధాన్యం, కందులు కొనుగోలు చేసి రూ.1.10కోట్ల లాభాలతో నడుస్తుందని వివరించారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో షాపింగ్ కాంప్లెక్సు, గోదాముల నిర్మాణం చేయనున్నట్లు పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేసే ఎరువులు గడ్డల రూపంలో ఉంటుందని, రైతుల ఇబ్బందులను వివరించారు. ఎరువుల ఇండెంట్ ఇకపై ఏవో, డీఏవోలతో సంబంధం లేకుండా సొసైటీలు, డీసీఎంఎస్‌లకు నేరుగా సరఫరా జరిగేలా చూడాలని సంఘం తీర్మానించింది. డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఫక్రుద్దీన్, డైరెక్టర్లు ఎలికెట్టి భూమారెడ్డి, పెద్దపల్లి డీసీవో మైకేల్ బోస్, కేడీసీసీబీ డైరెక్టర్లు వుచ్చిడి మోహన్‌రెడ్డి, స్వామిరెడ్డి, మార్క్‌ఫెడ్ కరీంనగర్, జగిత్యాల డీఎంలు ప్రవీణ్‌రెడ్డి, దివ్యభారతి, పీఏసీఎస్ ఛైర్మన్లు, బీఎం ఆర్.వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం నిర్ణయించండి



కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పశుమిత్ర కార్మిక సంఘం నాయకులు

కరీంనగర్: పశుమిత్ర కార్మికులకు కనీస వేతనం నిర్ణయించాలని కోరుతూ సోమవారం పశుమిత్ర వర్కర్స్ జిల్లా యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ, కనీస వేతన జీవో 60 ప్రకారం రూ.15,600 ఇవ్వాలని, సెర్ప్ డిపార్ట్‌మెంట్ కార్మికులుగా గుర్తించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,500 మంది మహిళలు 8 ఏళ్లుగా మూగజీవాలకు ఉచితంగా పశుమిత్ర కార్మికులుగా వైద్య సేవలు అందిస్తున్నారని, వీరికి ఒక్క రూపాయి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటుందన్నారు. కనీస వేతనం, గుర్తింపు కార్డులు, యూనిఫామ్స్, గ్లౌజులు, మెడికల్ కిట్స్, ప్రయాణ ఖర్చులు అందరికీ ఇవ్వాలని కోరారు. పశుమిత్రల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ పశుమిత్ర వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జాడి లలిత, ప్రధాన కార్యదర్శి ప్రభ, నాయకులు లక్ష్మి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
మంగళవారం ॥ 21-3-2023

వరల్డ్ పప్పెట్రీ డే



ఆమె ఊహల్లో కథ అల్లుకుపోతే అవి బొమ్మలై మన ముందు కదలాడతాయి. చూసే పిల్లల మొహాల్లో ఆశ్చర్యానందాలను పెద్దల మెదళ్లలో ఆలోచనలను కొత్తగా వికసింపజేస్తాయి. ముప్పైఏళ్లుగా పప్పెట్రీతో స్నేహం చేస్తూ 'మా బొమ్మల టీచర్' అని అందరూ ఆప్యాయంగా పిలుచుకునే పేరు **నోరి రత్నమాల.** హైదరాబాద్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలనీలో ఉంటున్న ఈ విశ్రాంత టీచరమ్మను కలిస్తే ఎన్నో అందమైన కథల మాలను మన ముందుంచుతారు.

బొమ్మలకు జీవం పోసే టీచరమ్మ

'విష్ణుశర్మ అడవి గుండా ప్రయాణిస్తుంటాడు. దారిలో బావిలోనుంచి మమ్మల్ని కాపాడండీ.. అని కేకలు విని అక్కడకు వెళ్లి లోపలకు చూస్తాడు. అందులో ఒక పులి, కోతి, పాముతో పాటు మనిషి ఉంటాడు. వారందరినీ కాపాడే సమయంలో 'మనిషిని మాత్రం కాపాడవద్దు' అని చెబుతాయి మిగతా జంతువులు...' అంటూ మనిషిలో ఉండే స్వార్థం ప్రాణాపాయం ఎలా కలిగిస్తుందో చెబుతూనే నేటి సాయంత్రం హైదరాబాద్‌లో ప్రదర్శించబోతున్న కథనాన్ని, అందుకోసం చేసుకున్న ఏర్పాట్ల గురించి చెబుతూనే తనలో ఈ కళ పట్ల ఆసక్తి కలగడానికి దారి తీసిన పరిస్థితులను గుర్తు చేసుకున్నారు ఈ టీచరమ్మ.

''హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఫైన్ ఆర్ట్స్ టీచర్‌గా వర్క్ చేశాను. పిల్లలకు ఆసక్తి గొలిపేలా సృజనాత్మకతను పరిచయం చేసే ఆ సబ్జెక్ట్ నాకెంతగానో రచ్చింది, ఎప్పటికప్పుడు నన్ను నేను కొత్తగా సిద్ధం చేసుకోవడం ఎలా అని ఆలోచించినప్పుడు చిన్నప్పుడు నేను నేర్చుకున్న పప్పెట్రీ గురించి గుర్తొచ్చింది, నా చిన్నతనంలో మా నాయనమ్మ నన్ను తోలుబొమ్మలాటకు తీసుకెళ్లేది. అందులో రామాయణ భారత కథలను తెల్లవార్లూ ప్రదర్శించేవారు. బాల్యంలో నా మనసులో నాటుకుపోయిన ఆ కళ ఆ తర్వాత నాకు విద్యార్థులకు పరిచయం చేయడానికి తోడ్పడింది.

స్కూల్ నుంచి మొదలు

సంప్రదాయ తోలుబొమ్మల తయారీ అంటే అంత సులువు కాదు. అందుకని కాగితం, క్లాత్, ఇతర వేస్ట్ మెటీరియల్‌ను ఉపయోగించి పప్పెట్రీ బొమ్మలు తయారుచేసేదాన్ని. వాటిద్వారా పిల్లలకు పంచతంత్ర వంటి ఎన్నో కథలు చెప్పేదాన్ని. పిల్లలు కూడా ఈ బొమ్మల ద్వారా తమ ఆసక్తులను కనబరిచేవారు. అక్కడ నుంచి ఇతర టీచర్లకు శిక్షణ, రాష్ట్రవ్యాప్తంగా స్కూళ్లలో ప్రదర్శనలు ఇస్తూ వచ్చాను. దూరదర్శన్‌లోనూ బాలల వికాసానికి పప్పెట్రీతో కార్యక్రమాలు చేశాం. సాంస్కృతిక కార్యక్రమాల్లో సామాజిక అవగాహన కలిగించే అంశాలెన్నో కథలుగా రూపొందించి, ప్రదర్శించాను.



ప్రదర్శనలో...



కదిలించే కథనాలు..

స్వాతంత్ర్యానికి ముందు మనకున్న అవగాహన కార్యక్రమాలలో ప్రధానమైనది తోలుబొమ్మలాటనే. ఇది దేశవ్యాప్త కళ. బొమ్మలను తెరముందు కదిలిస్తూ, దీపం వెలుతురు సాయంతో ప్రదర్శన ఉండేది. సంప్రదాయ బొమ్మల తయారీ ఇప్పుడు కొంచెం కష్టమే. ఇక ప్రదర్శన ఖర్చు కూడా ఎక్కువే అవుతుంది. అలాగని నేర్చుకున్న కళను మన దగ్గరే ఉంచలేం. పదిమందికి తెలిసినప్పుడే ఆ కళ బతుకుతుంది. సామాజిక అవగాహనకు నా భాగస్వామ్యమూ ఉండాలి. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రాజెక్టులు వచ్చాయి. సంగీత నాటక అకాడమీ నుంచి ఇన్నేళ్లలో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. విదేశాలలోనూ పప్పెట్రీ ప్రదర్శన చేయడం, అభినందనలు, అవార్డులు, మరచిపోలేని సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

టీమ్ వర్క్ విజయం

బొమ్మల తయారీ, బొమ్మలు కదల్చడానికి, మంచి కథనానికి, పాటలకు, నేపథ్య సంగీతానికి.. ఇలా ఇదంతా టీమ్ వర్క్‌తో కూడుకున్నది. ఇందుకోసం మావారితోపాటు పిల్లలనూ ఆ తర్వాత వారి పిల్లలనూ ఈ పనిలో భాగస్థులను చేశాను. దీనివల్ల వారి లోపల ఉన్న వారికే తెలియని కళ బయటకు వచ్చింది. ఇప్పుడు అమెరికాలో ఉన్న మా పిల్లలు కూడా కథనానికి తగ్గ వాయిస్ డబ్బింగ్‌ను క్లిప్పింగ్స్ ద్వారా నాకు పంపిస్తుంటారు. ఇందులో నా కుటుంబ సభ్యులే కాదు స్నేహితులు, కొందరు స్వచ్ఛందంగానూ మేం చేసే పనిలో భాగమవుతుంటారు. ఈ కళ బతికుంది అనడానికి ఇంతకుమించి నిదర్శనాన్ని చూపలేం.

డిజిటల్ మీడియాలోనూ..

కరోనా సమయంలో నోరి ఆర్ట్ అండ్ పప్పెట్రీ పేరుతో యూ ట్యూబ్‌లో ఛానెల్ స్టార్ట్ చేశాను. పిల్లల కోసం పప్పెట్రీ ద్వారా కొన్ని వందల కథలను పరిచయం చేశాను. అవన్నీ ఒక్కదాన్నే చేశాను. పెద్దవాళ్లూ ఆస్వాదించారు. ఎంతో మంది అభినందనలు తెలియజేశారు.

ఏ దేశానికి లేనన్ని సంప్రదాయ కళలు మన దగ్గర ఉన్నాయి. వాటికి పునరుజ్జీవం కలగాలంటే ప్రభుత్వాలు, సంస్థలు, ఆసక్తి కలవారు ముందుకు రావాలి. పిల్లల్లో ఈ కళలను బతికిస్తే చాలు– ముందు తరాలకు అవి వారసత్వంగా ప్రయాణిస్తాయి. ఏ దేశంలో ఉన్నా మన ప్రత్యేకతను ఈ కళలే చాటుతాయి. అందుకే ప్రాచీన కళలకు ప్రోత్సాహమిద్దాం'' అని వివరించారు ఈ పప్పెట్రీ హార్టిస్ట్.

– నిర్మలారెడ్డి

రెండు ప్రపంచాల మధ్య...




రెండు ప్రపంచాల మధ్య సంచరించే షెల్మకు... మొదటి ప్రపంచంలో కనిపించే సాంకేతిక అద్భుతాలు అంటే ఎంత ఇష్టమో రెండో ప్రపంచంలో కనిపించే కాల్పనిక కథలు అంతే ఇష్టం. సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ **షెల్మ సహాయం** రాసిన పుస్తకం 'ది ల్యాండ్ ఆఫ్ అటరాక్సియా: జెనిసిస్' గత నెల గోల్డెన్ బుక్ అవార్డ్(ఉరుగ్వే) గెలుచుకుంది. తాజాగా గ్లోబల్ పబ్లిషింగ్ హౌజ్, ఎక్స్‌సెల్లర్ ఎక్స్‌లెన్స్ ఇంటర్నేషనల్ అవార్డ్ (ఇండియా)కు ఎంపికైంది...

చెన్నైలో...

చిన్న వయసులోనే కలం పట్టింది షెల్మ. ప్రైమరీ స్కూల్లో గాంధీజీపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. షెల్మ ఈ పోటీలో పాల్గొంది. అయితే తనకు ఆ మహాత్ముడి గురించి పెద్దగా తెలియదు

'రకరకాల ఆయుధాలు ఉపయోగించి, బ్రిటిష్ వారితో వీరోచితంగా పోరాడారు' అని రాసింది.

ఇది గుర్తొచ్చినప్పుడల్లా ఇప్పటికీ ఇబ్బందిగా ఉండడం మాట ఎలా ఉన్నా... ఆ వ్యాసరచనే తన తొలి రచన!



అయితే ఆ తరువాత కాలంలో ఎన్నో పుస్తకాలు చదవడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోవడంతోపాటు రచనలు చేయడంపై ఆసక్తి పెరిగింది.

'నేను భవిష్యత్‌లో రచయిత్రిని కావాలనుకుంటున్నాను' అని షెల్మ అన్నప్పుడు చాలా మంది ముఖం మీదే నవ్వారు.

'ఇంజినీర్ కావాలనేది నా కల' అన్నప్పుడు కూడా ఇలాంటి పరిస్థితే. ఇలాంటి సమయాల్లో బాబీ ఆంటీ తనకు ఎంతో శక్తి ఇచ్చేది. షెల్మ దృష్టిలో తాను పవర్‌ఫుల్ ఉమెన్.

'వారు నీ గురించి ఏం అనుకుంటున్నారనేది ముఖ్యం కాదు. నీకు నీ మీద ఎంత నమ్మకం ఉందనేది ముఖ్యం' అని చెప్పేది.

ఆంటీ ఇచ్చిన ఆత్మవిశ్వాస బలంతో చిన్న చిన్న రచనలు చేసి ఇంట్లో వినిపించేది. తండ్రి మెర్సిలిన్‌బాబు, తల్లి మేరీ శాంతి, చెల్లెళ్లు స్నేహ, రీతూలు ప్రోత్సాహకంగా మాట్లాడేవారు.

'నాకు డిప్రెషన్‌గా అనిపించినప్పుడు పేపర్, పెన్ను అందుకొని ఏదో ఒకటి రాస్తుంటాను. అప్పుడు ఎంతో ఉత్సాహంగా ఉంటుంది' అంటున్న షెల్మ 'ఎస్ఎస్ మెర్సె' కలం పేరుతో 'ది ల్యాండ్ ఆఫ్ ఆటరాక్సియా: జెనిసిస్' అనే తొలి ఫాంటసీ థ్రిల్లింగ్ నవల రాసింది. దీనికి విమర్శకుల నుంచి మంచి ప్రశంసలు లభించాయి.

వీడియోగేమ్స్ ఇష్టపడే యువతరాన్ని కూడా ఈ నవల ఆకట్టుకుంది.

తాను ఎనిమిదవ తరగతిలో ఉన్నప్పుడు ఈ నవలకు బీజం పడింది. అయితే అక్షరాల్లో కాకుండా తన మనసులోనే రాసుకుంటూ వస్తోంది. ఎడిట్ చేసుకుంటూ వస్తుంది. తాను చిన్నప్పుడు విన్న ఎన్నో జానపదకథలు, చదివిన పుస్తకాలు ఈ పుస్తకం రాయడానికి స్ఫూర్తిని ఇచ్చాయి.

తప్పిపోయిన తమ ఫ్రెండ్ సినన్‌ను వెదుక్కుంటూ కెప్టెన్ మెగెలాన్ అతని బృందం చేసిన ప్రయాణమే ఈ నవల. కెప్టెన్ బృందం చివరికి ఒక మాంత్రిక ప్రపంచంలోకి వెళుతుంది. అక్కడ వారికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి అనేది నవల సారాంశం.

'ద ల్యాండ్ ఆఫ్ అటరాక్సియా' ఇచ్చిన ఉత్సాహంతో షెల్మ సహాయం మరిన్ని రచనలు చేయాలనుకుంటోంది.

ఇంటిప్స్

- కంప్యూటర్ కీ బోర్డ్, మౌస్ వంటి వాటిపై పడిన మరకలను నెయిల్ పాలిష్ రిమూవర్‌తో తొలగించవచ్చు.



- పాత్రలపై ఉన్న స్టిక్కర్స్ సులభంగా ఊడాలంటే, ఆ స్టిక్కర్‌కి కొవ్వొత్తి వేడి చూపితే సరిపోతుంది.



- గాజు గ్లాసులను శుభ్రం చేసే నీటిలో కొంచెం బట్టలకు ఉపయోగించే బ్లూ కలిపితే గ్లాసులు తళతళ మెరుస్తాయి.

కిచెన్ టిప్స్

- బొద్దింకలు పోవాలంటే... ఉల్లిపాయను చిన్న ముక్కలుగా తరిగి అందులో బేకింగ్ సోడా కలిపి వంటగది మూలల్లో, సింక్‌లో చల్లాలి.
- బోరిక్ యాసిడ్‌ని ఒక ప్లేట్‌లో కానీ గట్టి పేపర్ మీద కానీ చల్లాలి. ఆ ప్లేట్లో కమలాపండు తొక్కలు లేదా ఉల్లిపాయ ముక్కలు వేసి ఒకచోట పెట్టాలి.
- నిమ్మరసం బొద్దింకలను దూరంగా ఉంచుతుంది. ఒక మగ్గు నీటిలో నిమ్మరసం కలిపి వంటగది ఫ్లోర్ తుడిస్తే బొద్దింకలు పారిపోతాయి.

- అర్బన్ హార్టీకల్చర్ సాగు పూర్తి ప్యాకేజీని ప్రమాణీకరించిన బెంగళూరులోని ఐఐహెచ్ఆర్
- గ్రోబాగ్స్‌లో ఇంటి పైకప్పులపై సేంద్రియ కూరగాయలు, ఔషధ మొక్కల శాస్త్రీయ సాగుకు మార్గం సుగమం
- ప్రత్యేకమైన కొబ్బరి పొట్టు ఎరువు, రెండు రకాల ద్రావణాలకు రూపకల్పన
- సాయిల్‌లెస్ గార్డెనింగ్‌పై ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ



బెంగళూరు ఐఐహెచ్ఆర్‌లో టెర్రస్ కిచెన్ గార్డెన్

అర్బన్ సాగు సాంకేతికత సిద్ధం!

నగర/ పట్టణ వాసులు తమ ఇళ్లపైనే సేంద్రియ కూరగాయలు పండించుకుంటూ, చెట్ల నుంచి కోసి తాజాగా వండుకు తింటూ శారీరక యావత్ కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్న వారెందరో ఉన్నారు. అయితే, సేంద్రియ ఇంటిపంటల సాగులో నగర వాసులకు ఎదురయ్యే సమస్యలపై ప్రభుత్వ రంగంలో పరిశోధనలు పెద్దగా జరగలేదనే చెప్పాలి. ఈ కొరత తీర్చేందుకు బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) మొట్టమొదటి సారి ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించింది. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసిఎఆర్) అనుబంధ సంస్థ ఇది. ఇళ్ల పరిసరాల్లో గచ్చుపై, ఇళ్ల పైకప్పులపై గ్రోబాగ్స్‌లో కూరగాయల సేంద్రియ శాస్త్రీయ సాగు పద్ధతులను ప్రమాణీకరించింది. మట్టి లేకుండా సులువుగా సాగు చేసే పద్ధతులను ఖరారు చేసింది.

ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాలు పరిశోధన చేసి టెక్నాలజీని ప్రామాణీకరించారు. కచ్చితమైన మోతాదుల్లో ఎన్నాళ్లకోసారి పోషకాలను అందించాలన్న విషయాలను ప్రామాణీకరించారు. దీంతో శాస్త్రీయంగా కూరగాయలతో పాటు ఔషధ మొక్కలను సైతం గ్రోబాగ్స్‌లో సేంద్రియంగా ఎక్కడైనా సాగు చేయడానికి మార్గం సుగమం అయ్యింది.

ప్రత్యేక ఉత్పాదకాలు

అర్బన్ హార్టీకల్చర్ వ్యాప్తి కోసం ఐఐహెచ్ఆర్ ప్రత్యేక సాంకేతికతలను అభివృద్ధి చేసింది. శుద్ధి చేసి, జీవన ఎరువులతో ప్రత్యేకమైన కొబ్బరి పొట్టు ఎరువును ఐఐహెచ్ఆర్ తయారు చేసింది. దీని పేరే 'అర్క ఫెర్మెంటెడ్ కోకోపిట్'(ఎ.ఎఫ్.సి.). అంతేకాకుండా, గ్రోబాగ్స్‌లో కూరగాయ పంటల సాగుకు అవసరమైన పోషకాలను అందించే 'అర్క సస్య పోషక్ రస్ (ఎ.ఎస్.పి.ఆర్.)' ఎ,బి పేరిట రెండు రకాల ద్రావణాలను రూపొందించింది. ఈ 3 సాంకేతికతలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఐఐహెచ్ఆర్ నుంచి ఈ టెక్నాలజీను కొనుగోలు చేసిన కంపెనీలు వీటిని ఉత్పత్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాయి.

పోషకాల యాజమాన్యం

టమోటా, మిరప, క్యాబేజీ, దోస, చెట్టు చిక్కుడు, ఆకు కూరలు వంటి కూరగాయలను మట్టి రహిత సాగు పద్ధతిని ఐఐహెచ్ఆర్ ప్రమాణీకరించింది. అర్క ఫెర్మెంటెడ్ కోకోపిట్ లేదా మట్టికి సమపాళ్లలో సేంద్రియ ఎరువులు (పశువుల ఎరువు/వంటింటి వ్యర్థాలతో చేసిన కంపోస్టు/సిటీ కంపోస్టు), వర్మీ కంపోస్టులను 1:1:1 నిష్పత్తిలో కలిపి గ్రోబాగ్స్‌లో నింపుకొని మొక్కలు నాటుకోవాలి లేదా విత్తనాలు వేసుకోవాలి. ఆ తర్వాత నెలకోసారి మొక్కకు 100 గ్రాముల చొప్పున వంటింటి వ్యర్థాల కంపోస్టు లేదా వర్మీకంపోస్టు వేసుకుంటే పోషక లోపం రాదు.

మట్టికి బదులు అర్క ఫెర్మెంటెడ్ కోకోపిట్‌కు సేంద్రియ ఎరువులు కలిపి సాగు చేసుకుంటే.. 'అర్క సస్య పోషక్ రస్' ఎ,బి ద్రావణాలను క్రమం తప్పకుండా వాడితే పోషక లోపాలు లేకుండా మంచి దిగుబడులు సాధించవచ్చని ఐఐహెచ్ఆర్ చెబుతోంది. ఈ ద్రావణాల్లో వివిధ కూరగాయ పంటల సాగుకు అవసరమైన స్థూల, సూక్ష్మపోషకాలన్నీ సమతుల్యంగా ఉన్నాయి.

> నగర ప్రజల్లో పోషకాహార భద్రతను కల్పించడానికి మట్టి రహిత లేదా కోకోపొనిక్స్ సాంకేతికత ఉపయోగపడుతుంది. నగరాలు, నగర పరిసర ప్రాంతాల్లో కూరగాయల సాగుకు తగిన భూమి అందుబాటులో లేకపోవటం లేదా కలుషిత/నిస్సారమైన నేలలు మాత్రమే అందుబాటులో ఉన్న చోట్ల మట్టి లేని సాగు ఉపయోగకరం. రూఫ్‌టాప్/టెర్రస్‌లపై కూరగాయల సాగును పెంపొందించడానికి ఇది అత్యంత అనుకూలమైనది. నగరవాసుల్లో ఇది చాలా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా నగరాలు, మహానగరాల పరిసర ప్రాంతాల్లో మట్టి రహిత వ్యవసాయం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. భవిష్యత్తులో ఇదే ప్రధాన సాగు విధానంగా మారుతుంది. ఇప్పటికే చాలా మంది పెంపకందారులు తమ రోజువారీ కూరగాయల కోసం ఈ సాంకేతికతను అనుసరించడం ప్రారంభించారు. అధిక దిగుబడులతో పాటు దిగుబడుల నాణ్యత విషయంలో ఈ సాంకేతికత మెరుగైన ఫలితాలనిస్తోంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నాం.
>
> **నగరాల్లో సాగుకు ఇదే ఉత్తమం**
>
> 
>
> – డాక్టర్ డి. కలైవనన్
> (99866 37407), సీనియర్ శాస్త్రవేత్త, ఐఐహెచ్ఆర్, బెంగళూరు.
> kalainith2003@gmail.com

10 రోజుల నుంచి ద్రావణాలు

కూరగాయ మొక్కలు నాటిన లేదా విత్తనాలు వేసిన తర్వాత 10వ రోజు నుంచి వారానికి 2 సార్లు అర్క సస్య పోషక్ రస్ ద్రావణాలను నిర్దేశించిన మోతాదులో కలిపిన నీటిని ప్రతి కుండీ/గ్రోబాగ్‌కు 200 ఎం.ఎల్. పోయాలి. 30 రోజుల తర్వాత నుంచి వారానికి మూడు సార్లు ఇవ్వాలి. అర్క సస్య పోషక్ రస్ ఎ, బి రకాల ద్రావణాల మోతాదు పంటను బట్టి మారుతుంది. టొమాటో, మిరప, బెండ, క్యాబేజీ, కాలీఫ్లవర్, దోస, బెండ, సొర, పొట్ల, ముల్లంగి, బ్రోకలీ, నోల్ ఖోల్, పాటీ పాన్, గుమ్మడి, పుచ్చ, కస్తూరి పుచ్చ పంటలకు లీటరు నీటికి ఎ,బి ద్రావణాలను 5 ఎం.ఎల్. చొప్పున కలపాలి.



గ్రోబాగ్స్‌లో టొమాటో మొక్కలు

ఫ్రెంచ్ బీన్, బఠానీలు, డోలిచోస్, అలసంద పంటలకు లీటరు నీటికి ఎ,బి ద్రావణాలను 4 ఎం.ఎల్. చొప్పున కలపాలి. పాలకూర, బచ్చలికూర, బోక్ చోయ్, సెలెరీ వంటి దేశ విదేశీ రకాల ఆకుకూర పంటలకు లీటరు నీటికి ఎ,బి ద్రావణాలను 3.5 ఎం.ఎల్. చొప్పున కలపాలి. నీటి నాణ్యతా ప్రమాణాలను కూడా ఐఐహెచ్ఆర్ ప్రమాణీకరించింది. ఉదజని సూచిక 6–7 ఉండాలి. విద్యుత్ వాహకత స్థాయి 0.75 – 1.5 డి.ఎస్./ఎం. మధ్యలో ఉండాలి.

చీడపీడల యాజమాన్యం

కుండీలు, గ్రోబాగ్స్‌లో ఉపయోగించే మట్టి లేదా కోకోపీట్‌లకు ట్రైకోడెర్మా లేదా సూడోమోనాస్‌లను కలిపితే చీడపీడల బెడద తగ్గుతుంది. పురుగులను సమర్థవంతంగా నియంత్రించడానికి వేపనూనె 2 మి.లీ /లీటర్ నీటికి లేదా వేప సబ్బు 7–10 గ్రా. లీటరు నీటికి కలిపి చల్లాలి. ఐఐహెచ్ఆర్ రూపొందించిన వేప, కానుగ సబ్బులను 10 గ్రా. లీటరు నీటికి కలిపి చల్లితే రసం పీల్చే పురుగులు నియంత్రణలో ఉంటాయి. ఆవు మూత్రాన్ని 1: 20 నిష్పత్తిలో నీటిలో కలిపి చల్లితే కీటకాలు నియంత్రణలో ఉంటాయి. పంట పెరుగుదలకూ ఉపయోగపడుతుంది. పులిసిన మజ్జిగ తెల్లదోమ, నల్లదోమ, పచ్చదోమల నుంచి పంటను రక్షించుకోవచ్చు.

సాగుబడి
ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 18 నుంచి

సగం నీటితోనే వరి సాగు!

వ్యవసాయంలో భూగర్భ జలాల వాడకం అంతకంతకూ పెరుగుతోంది. ఐరాస ప్రపంచ నీటి అభివృద్ధి నివేదిక (2022) ప్రకారం.. మన దేశం ప్రతి సంవత్సరం 251 క్యూబిక్ కి.మీ.ల నీటిని బోర్ల ద్వారా వెలికితీస్తోంది. ప్రపంచవ్యాప్తంగా బోర్ల ద్వారా తోడుతున్న భూగర్భ నీటిలో నాలుగింట ఒక వంతు కంటే ఇది ఎక్కువే. ఇందులో 90 శాతం నీరు వ్యవసాయానికి వినియోగిస్తున్నాం. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలంటే ఈ పరిస్థితి మారాలి. భూగర్భ నీటి వినియోగం తగ్గాలంటే సాగు భూమిలో నీటిని పట్టి ఉంచే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. వ్యవసాయాన్ని ప్రకృతికి అనుగుణంగా మార్చుకుంటేనే ఇది సాధ్యమని ఐరాసకు చెందిన ఆహార-వ్యవసాయ సంస్థ చెబుతోంది.

ఈ దిశగా ఆంధ్రప్రదేశ్ వడివడిగా అడుగులు వేస్తోంది. ప్రకృతి వ్యవసాయం అత్యధిక విస్తీర్ణంలో జరుగుతున్న ఏపీలో బోరు నీటి వాడకం కూడా తగ్గుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఏపీలోని అన్ని జిల్లాల్లో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడుతున్న పొలాల్లో కన్నా ప్రకృతి సేద్యం చేస్తున్న భూముల్లో బోరు నీటి వినియోగం ఎంత మేరకు తగ్గుతోంది? ఆసక్తికరమైన ఈ అంశంపై ఏపీ రైతు సాధికార సంస్థ(ఆర్.వై.ఎస్.ఎస్.) ఆధ్వర్యంలో 2020 నుంచి అంతర్గతంగా అధ్యయనం చేస్తోంది. వరిలో 2020–21 రబీలో రసాయనిక సేద్యం (ర.సే.)లో ఎకరానికి 6,200 కిలోలీటర్ల (కిలోలీటర్=1,000 లీటర్లు) బోరు నీటిని ఉపయోగించగా ప్రకృతి సేద్యం(ప్ర.సే.)లో 3,294 కిలోలీటర్ల నీటిని వాడితే సరిపోయింది. ఇది 47% తక్కువ. 2022–23 ఖరీఫ్ నాటికి వరి పొలాల్లో ప్రకృతి సేద్యంలో నీటి ఆదా 51%కి పెరిగింది. మొక్కజొన్నలో 2021–22 రబీలో ఎకరానికి ర.సే.లో 3,349 కిలోలీటర్ల నీరు ఖర్చవ్వగా, ప్ర.సే.లో 2,152 కిలోలీటర్లకు తగ్గింది. ఇది 36% తక్కువ. వేరుశనగ సాగులో ఎకరానికి 2021–22 రబీలో ఎకరానికి ర.సే.లో 3,505 కిలోలీటర్ల నీరు వాడగా, ప్ర.సే.లో 2,652 కిలోలీటర్లకు తగ్గింది. ఇది 24% తక్కువ. ఇదే పంటలో 2022–23 ఖరీఫ్‌లో ఎకరానికి ర.సే.లో 792 కిలోలీటర్ల బోరు నీరు ఖర్చవగా, ప్ర.సే.లో 582 కిలోలీటర్లకు తగ్గింది. ఇది 26% తగ్గుదల.



ప్రకృతి సేద్యంలో పెరిగిన వరి దుబ్బును చూపుతున్న ఏపీ రైతు సాధికార సంస్థ ఉపాధ్యక్షులు విజయకుమార్

మిర్చిలో 2021–22 రబీలో ఎకరానికి ర.సే.లో 2,015 కిలోలీటర్లు ఖర్చవ్వగా, ప్ర.సే.లో 1,193 కిలోలీటర్లకు తగ్గింది. ఈ తగ్గుదల 41%. పత్తిలో 2022–23 ఖరీఫ్‌లో ఎకరానికి ర.సే.లో 897 కిలోలీటర్ల సాగు నీరు ఖర్చవ్వగా, ప్ర.సే.లో 596 కిలోలీటర్లకు తగ్గింది. ఇది 34% తగ్గుదల. టొమాటోలో 2020–21 రబీలో ఎకరానికి ర.సే.లో 1,805 కిలోలీటర్ల నీరు ఖర్చవ్వగా, ప్ర.సే.లో 1,393 కిలోలీటర్లకు తగ్గింది.అదేవిధంగా మినుములో 2021–22 రబీలో ఎకరానికి ర.సే.లో 399 కిలోలీటర్ల నీరు పెట్టగా, ప్ర.సే.లో 356 కిలోలీటర్లకు తగ్గింది. ఇది 11% తగ్గుదల. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో నేల గుల్లబారి ఉండటం, వాన నీరు అధికంగా ఇంకటం, వానపాముల సంఖ్య పెరగటం, భూసారంతోపాటు నీటి నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల బోరు నీరు వాడకం గణనీయంగా తగ్గింది. వచ్చే ఖరీఫ్ నుంచి 'వాలంతరి' మరింత లోతైన అధ్యయనం చేపట్టనుంది.

రేపు సేంద్రియ సాగు, విలువ జోడింపుపై శిక్షణ

సేంద్రియ సాగు, మిశ్రమాలు, కషాయాల తయారీ, వివిధ ఆహార పంటలకు విలువ జోడింపుపై ఈ నెల 22 (బుధవారం ఉ.10–4 గం. వరకు)న రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్‌పేట గ్రామంలో రైతులకు నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ప్రముఖ రైతు సుకవాసి హరిబాబు తన తోటలో శిక్షణ ఇస్తారు. మధ్యాహ్న భోజనం సహా ప్రవేశం ఉచితం. వివరాలకు.. 70939 73999

26, 27 తేదీల్లో డా. ఖాదర్ సభలు


సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంపై స్వతంత్ర శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డా. ఖాదర్ వలి ఈ నెల 26, 27 తేదీల్లో జరిగే అవగాహన సదస్సుల్లో ప్రసంగిస్తారని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వేంకటేశ్వరరావు తెలిపారు. కృష్ణా జిల్లా ఆత్కూరు (గన్నవరం)లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 26 (ఆదివారం)న ఉ. 10 గం. నుంచి.. అవనిగడ్డలోని గాంధీక్షేత్రం 26న సా. 4 గం. నుంచి.. 27(సోమవారం)న సా. 5 గం, నుంచి విశాఖపట్నం మద్దెలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో డా. ఖాదర్ అవగాహన సదస్సులు జరుగుతాయి. ప్రవేశం ఉచితం. వివరాలకు.. 94905 59999

ఐదు దొంతర్ల తోట నమూనాపై 26న అప్పాజీపల్లిలో శిక్షణ

నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట్ మండలం అప్పాజీపల్లిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 26 (ఆదివారం) ఉ: 9 గం. నుంచి సా. 5 గం. వరకు సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయ్ రామ్ గోఆధారిత ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇస్తారు. దేశీ ఆవు, దేశీ విత్తనాల ప్రాముఖ్యత, వాననీటి సంరక్షణ, మాగాణి/మెట్ట భూముల్లోని పండ్లు, కూరగాయల కోసం 5 దొంతర్ల తోట నమూనా తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. ప్రవేశం ఉచితం. మధ్యాహ్న భోజన సదుపాయం ఉంది. పేరు నమోదు కోసం.. 97055 60879, 040–27654337.

ఏప్రిల్ 10 నుంచి శ్రీగంధం సాగుపై శిక్షణ

శ్రీగంధం మొక్కల నర్సరీ పెంపకం, శ్రీగంధం తోటల సాగులో మెలకువలు, చేవ నాణ్యతను గుర్తించటం, తైలం వెలికితీత, మార్కెటింగ్, ఆదాయ వ్యయాలు తదితర అంశాలపై బెంగళూరులోని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐ.డబ్ల్యు.ఎస్.టి.) రైతులు, నర్సరీల యజమానులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇవ్వనుంది. ఏప్రిల్ 10 నుంచి 14 వరకు బెంగళూరులోని ఐ.డబ్ల్యు.ఎస్.టి.లో సంచాలకులు డా. ఆర్.సుందరరాజ్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారు. ఫీజు వసతి అవసరం లేని వారికి రూ. 11,800, వసతితో పాటు రూ. 17,700 ఉంటుంది. కోర్సు ఆంగ్లంలో ఉంటుంది. తెలుగు తదితర భాషల్లోనూ విడమరిచి చెబుతారు. మరిన్ని వివరాలను తెలుగులో తెలుసుకోదలచినవారు ఫోన్ చేయాల్సిన నంబరు 080–22190166.



జెహాన్ దారువాలాకు మూడో స్థానం

ఫార్ములా-2 రేసింగ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా సౌదీ అరేబియా రేసులో భారత డ్రైవర్ జెహాన్ దారువాలా మూడో స్థానంలో నిలిచాడు. జెద్దాలో జరిగిన ఈ రేసులో నెదర్లాండ్స్‌కు చెందిన ఎంపీ మోటార్‌స్పోర్ట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జెహాన్ నిర్ణీత 28 ల్యాప్‌లను 50 నిమిషాల 53.133 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానాన్ని పొందాడు. వెస్టీ (ప్రెమా రేసింగ్) తొలి స్థానంలో, దూహన్ (విర్టోసీ రేసింగ్) రెండో స్థానంలో నిలిచారు. సీజన్‌లో రెండు రేసులు పూర్తయ్యాక జెహాన్ 24 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నాడు.

సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి విజేత పెరెజ్



ఫార్ములావన్ సీజన్‌లోని రెండో రేసు సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రిలో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ సెర్జియో పెరెజ్ విజేతగా నిలిచాడు. పెరెజ్ నిర్ణీత 50 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 1 గంట 21 నిమిషాల 14.894 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. రెడ్‌బుల్ జట్టుకే చెందిన వెర్‌స్టాపెన్ రెండో స్థానంలో, ఆస్టిన్ మార్టిన్ జట్టు డ్రైవర్ అలోన్సో మూడో స్థానంలో నిలిచారు.

ప్లేఆఫ్‌కు యూపీ వారియర్స్

- గ్రేస్ హారిస్ మెరుపులు
- గుజరాత్, బెంగళూరు నిష్క్రమణ


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్రేస్ హారిస్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో చివరిదైన మూడో ప్లేఆఫ్ బెర్త్ కూడా ఖరారైంది. ఇప్పటికే ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్ దశకు అర్హత పొందగా... ఈ రెండు జట్ల సరసన యూపీ వారియర్స్ చేరింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ మూడు వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. యూపీ గెలుపుతో గుజరాత్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్లు ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించాయి.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 178 పరుగులు సాధించింది. హేమలత (33 బంతుల్లో 57; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), యాష్లే గార్డ్‌నర్ (39 బంతుల్లో 60; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధ సెంచరీలు చేశారు. యూపీ బౌలర్లలో రాజేశ్వరి గైక్వాడ్, పార్శవి చోప్రా రెండు వికెట్ల చొప్పున తీశారు. అనంతరం యూపీ వారియర్స్ 19.5 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 181 పరుగులు సాధించి విజయం సాధించింది. 39 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడిన యూపీ వారియర్స్‌ను తాలియా (38 బంతుల్లో 57; 11 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్రేస్ హారిస్ (41 బంతుల్లో 72; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 78 పరుగులు జోడించారు. తాలియా అవుటయ్యాక గ్రేస్ హారిస్ యూపీని విజయం దిశగా నడిపించింది. ఏడు బంతులు మిగిలి ఉండగా హారిస్ పెవిలియన్ చేరగా... సోఫీ ఎకిల్‌స్టోన్ (13 బంతుల్లో 19 నాటౌట్; 2 ఫోర్లు) యూపీ విజయాన్ని ఖాయం చేసింది.

ముంబై ఇండియన్స్‌కు ఢిల్లీ షాక్


అలైస్ క్యాప్సీ, మెగ్ లానింగ్

సోమవారం రాత్రి జరిగిన రెండో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తొమ్మిది వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్ జట్టుకు షాక్ ఇచ్చింది. ఈ టోర్నీలో ఆడిన తొలి ఐదు మ్యాచ్‌ల్లో గెలిచి అందరికంటే ముందుగా ప్లేఆఫ్ బెర్త్ ఖరారు చేసుకున్న ముంబై ఆ తర్వాత ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోవడం గమనార్హం. ముందుగా ముంబై జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లకు 109 పరుగులు చేసింది. పూజ వస్త్రకర్ (19 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్), హర్మన్‌ప్రీత్ కౌర్ (26 బంతుల్లో 23; 3 ఫోర్లు), ఇసీ వాంగ్ (24 బంతుల్లో 23; 1 సిక్స్), అమన్‌జ్యోత్ కౌర్ (16 బంతుల్లో 19; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. ఢిల్లీ బౌలర్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మరిజాన్ కప్ (2/13), శిఖా పాండే (2/21), జెస్ జొనాసెన్ (2/25) ముంబైని కట్టడి చేశారు. అనంతరం ఢిల్లీ దూకుడుగా ఆడి 9 ఓవర్లలో వికెట్ నష్టపోయి 110 పరుగులు చేసి గెలిచింది. షఫాలీ వర్మ (15 బంతుల్లో 33; 6 ఫోర్లు, 1 సిక్స్) అవుటవ్వగా.. మెగ్ లానింగ్ (22 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), అలైస్ క్యాప్సీ (17 బంతుల్లో 38 నాటౌట్; 1 ఫోర్, 5 సిక్స్‌లు) ఢిల్లీ విజయాన్ని ఖాయం చేశారు.

'ఫైనల్ బెర్త్' రేసులో ముంబై, ఢిల్లీ

ప్రస్తుతం ఢిల్లీ, ముంబై 10 పాయింట్లతో సమంగా ఉన్నా... మెరుగైన రన్‌రేట్ ఆధారంగా ఢిల్లీ టాప్ ర్యాంక్‌లో, ముంబై రెండో ర్యాంక్‌లో నిలిచాయి. నేడు జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో బెంగళూరుతో ముంబై (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)... యూపీతో ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి) ఆడతాయి. ముంబై, ఢిల్లీ జట్లలో భారీ తేడాతో నెగ్గిన జట్టు 'టాప్' ర్యాంక్‌తో నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. మూడో స్థానంలో నిలిచిన యూపీ వారియర్స్‌తో రెండో స్థానంలో నిలిచిన జట్టు ఫైనల్ బెర్త్ కోసం ఎలిమినేటర్ మ్యాచ్ ఆడుతుంది.

డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
ఢిల్లీ	7	5	2	10	1.978
ముంబై	7	5	2	10	1.725
యూపీ	7	4	3	8	-0.063
బెంగళూరు	7	2	5	4	-1.044
గుజరాత్	8	2	6	4	-2.220

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర-నెట్ రన్‌రేట్

క్వార్టర్ ఫైనల్లో సాక్షి, లవ్లీనా



సాక్షి


లవ్లీనా

న్యూఢిల్లీ: ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సోమవారం భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. సాక్షి చౌధరీ (52 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... ప్రీతి (54 కేజీలు) పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సాక్షి 5-0తో జజీరా ఉరక్‌బయేవా (కజకిస్తాన్)పై, లవ్లీనా 5-0తో వనెసా ఒరిట్జ్ (మెక్సికో)పై ఏకపక్ష విజయాలు నమోదు చేశారు. ప్రీతి 3-4తో జిట్‌పోంగ్ జుటామస్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. మరో బౌట్‌లో విజయం సాధిస్తే సాక్షి, లవ్లీనాకు కనీసం కాంస్య పతకాలు ఖాయమవుతాయి. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సుమయె కొసిమోవా (తజికిస్తాన్)తో నీతూ (48 కేజీలు), తుర్హాన్ ఎలిఫ్ నూర్ (తుర్కియే)తో మనీషా (57 కేజీలు), కిటో మాయ్ (జపాన్)తో శశి చోప్రా (63 కేజీలు), ఫాతిమా హెరెరా అల్వారెజ్ (మెక్సికో)తో నిఖత్ జరీన్ (50 కేజీలు), నవ్‌బాఖోర్ ఖమిదోవా (ఉజ్బెకిస్తాన్)తో మంజు బంబోరియా (66 కేజీలు), మిజ్‌గోనా సమదోవా (తజికిస్తాన్)తో జాస్మిన్ (60 కేజీలు) తలపడతారు.

నలుగురు భారత సంతతి ఆటగాళ్లు!

మేజర్ లీగ్ క్రికెట్ డ్రాఫ్ట్‌లో చోటు


సాయితేజ రెడ్డి


అఖిలేశ్ రెడ్డి

హ్యూస్టన్: అమెరికాలో క్రికెట్ అభివృద్ధిలో భాగంగా తొలిసారి నిర్వహించబోతున్న మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ)-2023లో మొదటి రోజు ఆటగాళ్ల ఎంపిక పూర్తయింది. మొత్తం ఆరు జట్లు ఇందులో పాల్గొంటుండగా నాలుగు టీమ్‌లు ఐపీఎల్ యాజమాన్యాలకు (ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై) చెందినవే ఉన్నాయి. ఐపీఎల్ తరహాలో వేలం ద్వారా కాకుండా నేరుగా డ్రాఫ్ట్ ద్వారా ఆటగాళ్లను ఆయా ఫ్రాంచైజీలు ఎంచుకుంటున్నాయి. ఇందులో నిబంధనల ప్రకారం 'స్థానిక ఆటగాళ్ల'గా గుర్తింపు ఉన్న 54 మంది అమెరికా క్రికెటర్లను ఆయా జట్లలోకి తీసుకున్నారు. వీరిలో 15 మంది అమెరికా జాతీయ జట్టుకు జూనియర్ లేదా సీనియర్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారు. అయితే ఈ 54 మందిలో ఏడుగురు మాత్రమే అమెరికాలో పుట్టినవారు కావడం విశేషం. ఇందులో నలుగురు క్రికెటర్లు అఖిలేశ్ రెడ్డి బొడుగం, సాయిదీప్ గణేశ్, సంజయ్ కృష్ణమూర్తి, సాయితేజ రెడ్డి ముక్కామల భారత సంతతికి చెందినవారు. వీరిలో సాయితేజ ముక్కామల ఈ ఏడాది యూఎస్ సీనియర్ టీమ్ తరఫున కూడా ఆడాడు. అతనితో పాటు సాయిదీప్, సంజయ్‌లు అండర్-23 కేటగిరీలో ఎంపికయ్యారు. లాస్ ఏంజెలిస్ నైట్‌రైడర్స్, ముంబై ఇండియన్స్ న్యూయార్క్, సీటల్ ఆర్కాస్ (ఢిల్లీ క్యాపిటల్స్, సత్య నాదెళ్ల సహభాగస్వామ్యం), సూపర్ కింగ్స్ టెక్సస్, శాన్‌ఫ్రాన్సిస్కో యూనికార్న్స్, వాషింగ్టన్ ఫ్రీడమ్ పేర్లతో ఈ ఆరు జట్లు ఉన్నాయి. ఈ ఆరు టీమ్‌లు మార్క్యూ ఓవర్‌సీస్ ఆటగాళ్లుగా ఆరోన్ ఫించ్, నోర్జే, హసరంగ, డి కాక్, స్టొయినిస్, మిచెల్ మార్ష్‌లను ఎంచుకున్నాయి.

'నంబర్‌వన్' అల్‌కరాజ్

- ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టైటిల్ సొంతం
- మళ్లీ 'టాప్' ర్యాంక్‌లోకి స్పెయిన్ స్టార్


విన్నర్స్ ట్రోఫీతో అల్‌కరాజ్

కాలిఫోర్నియా: అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న స్పెయిన్ యువ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ ప్రపంచ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. ఇండియన్ వెల్స్ ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 టోర్నీలో 19 ఏళ్ల అల్‌కరాజ్ తొలిసారి విజేతగా అవతరించాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6-3, 6-2తో ప్రపంచ ఐదో ర్యాంకర్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)పై గెలుపొందాడు. అల్‌కరాజ్‌కు 12,62,220 డాలర్ల (రూ. 10 కోట్ల 42 లక్షలు) ప్రైజ్‌మనీ, రన్నరప్ మెద్వెదెవ్‌కు 6,62,360 డాలర్ల (రూ. 5 కోట్ల 46 లక్షలు) ప్రైజ్‌మనీ లభించాయి.

మయామి ఓపెన్‌లోనూ టైటిల్ సాధిస్తేనే...

ఇండియన్ వెల్స్ టోర్నీకి ముందు రెండో ర్యాంక్‌లో ఉన్న అల్‌కరాజ్ తాజా విజయంతో 7,420 పాయింట్లతో మరోసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీకి ముందు సెర్బియా స్టార్ జొకోవిచ్ టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు. కోవిడ్ టీకా వేసుకోని విదేశీయులకు అమెరికాలో ప్రవేశం లేకపోవడంతో జొకోవిచ్ ఈ టోర్నీకి దూరం కావాల్సి వచ్చింది. 7,160 పాయింట్లతో జొకోవిచ్ రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. సోమవారం మొదలైన మయామి ఓపెన్ టోర్నీలోనూ అల్‌కరాజ్ విజేతగా నిలిస్తేనే నంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంటాడు. లేదంటే ఏప్రిల్ 3న విడుదల చేసే ర్యాంకింగ్స్‌లో జొకోవిచ్ మళ్లీ టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంటాడు. మరోవైపు స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ 18 ఏళ్ల తర్వాత తొలిసారి టాప్-10 ర్యాంకింగ్స్‌లో చోటు కోల్పోయి 13వ ర్యాంక్‌లో నిలిచాడు.

రిబాకినా తొలిసారి...


విన్నర్స్ ట్రోఫీతో రిబాకినా

ఇండియన్ వెల్స్ ఓపెన్ మహిళల టోర్నీలో కజకిస్తాన్ క్రీడాకారిణి ఎలీనా రిబాకినా తొలిసారి విజేతగా నిలిచింది. ఫైనల్లో రిబాకినా 7-6 (13/11), 6-4తో రెండో ర్యాంకర్, ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. తాజా ప్రదర్శనతో రిబాకినా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ఏడో ర్యాంక్‌కు చేరుకుంది. విజేత రిబాకినాకు 12,62,220 డాలర్ల (రూ. 10 కోట్ల 42 లక్షలు) ప్రైజ్‌మనీ, రన్నరప్ సబలెంకాకు 6,62,360 డాలర్ల (రూ. 5 కోట్ల 46 లక్షలు) ప్రైజ్‌మనీ లభించాయి.

కివీస్ క్లీన్‌స్వీప్



వెల్లింగ్టన్: శ్రీలంకతో జరిగిన రెండో టెస్టులో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 58 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఫాలోఆన్ ఎదుర్కొని రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన శ్రీలంక నాలుగోరోజు 142 ఓవర్లలో 358 పరుగులకు ఆలౌటైంది. ధనంజయ డిసిల్వా (98; 12 ఫోర్లు, 1 సిక్స్), కరుణరత్నే (51; 4 ఫోర్లు), కుశాల్ మెండిస్ (50; 8 ఫోర్లు), చండీమల్ (62; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. న్యూజిలాండ్ బౌలర్లలో కెప్టెన్ టిమ్ సౌతీ (3/51), టిక్నర్ (3/84) రాణించారు. హెన్రీ నికోల్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు... కేన్ విలియమ్సన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు లభించాయి.

సినిమా


మహేశ్‌బాబు


ప్రభాస్


అల్లు అర్జున్

కేరాఫ్ ఫారెస్ట్

కథ ఎక్కడికి ఆహ్వానిస్తే అక్కడికి వెళ్లాలి. కొందరు హీరోలను అడవి ఆహ్వానించింది. కేరాఫ్ ఫారెస్ట్ అంటూ ఆ హీరోలు అడవి బాట పడుతున్నారు. అడవి నేపథ్యంలో ఆ హీరోలు చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

ఆఫ్రికన్ అడవుల్లో...

మహేశ్‌బాబుతో ఓ భారీ యాక్షన్ అడ్వెంచరస్ మూవీ ప్లాన్ చేశారు రాజమౌళి. ఈ సినిమా కథ ప్రధానంగా అడవిలో జరుగుతుంది. అయితే అది దేశీ అడవి కాదు... ఆఫ్రికన్ ఫారెస్ట్. చిత్ర కథారచయిత విజయేంద్రప్రసాద్ కొన్ని నెలల క్రితం ఇది అడవి నేపథ్యంలో సాగే సినిమా అని పేర్కొన్న విషయం గుర్తుండే ఉంటుంది. తాజాగా కీరవాణి కూడా ఆ విషయాన్ని స్పష్టం చేశారు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రానికి అద్భుతమైన కథ కుదిరిందని కీరవాణి పేర్కొన్నారు. రాజమౌళి గత చిత్రం 'ఆర్ఆర్ఆర్'కి సంగీతదర్శకుడిగా వ్యవహరించి, 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో కీరవాణి ఆస్కార్ అందుకున్న విషయం తెలిసిందే. మహేశ్-రాజమౌళిల తాజా చిత్రానికి కూడా కీరవాణియే స్వరకర్త. కాగా ఈ చిత్రంలో మహేశ్‌బాబుని సరికొత్త లుక్‌లో చూపించనున్నారు రాజమౌళి. 'పాన్ వరల్డ్' మూవీగా ఈ ప్రాజెక్ట్ ఉంటుందని, విదేశీ నిర్మాతలు కూడా భాగస్వాములు అవుతారని టాక్. ఈ చిత్రం షూటింగ్ ఆరంభం కావాల్సి ఉంది.

అడవి రాముడు

రాముడుగా ప్రభాస్, సీతగా కృతీ సనన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్ నటించిన చిత్రం 'ఆది పురుష్'. ఓం రౌత్ దర్శకత్వంలో రూపొందిన ఈ త్రీడీ పాన్ ఇండియా మూవీ జూన్ 16న విడుదల కానుంది. రాముడి జీవితంలోని ఒక అధ్యాయాన్ని తీసుకుని, ఈ చిత్రాన్ని తెరకెక్కించారు ఓం రౌత్. రాముడిలోని కరుణ, వీరత్వం రెండు రసాలను చూపించనున్నారు. ఈ క్యారెక్టర్ కోసం ప్రభాస్ ఫిజిక్‌ని 'వి' షేప్‌కి మార్చుకోమని ఓం రౌత్ కోరగా, పాత్రకు తగ్గట్టు మారారు. అలాగే హిందీలో డబ్బింగ్ చెప్పడానికి ఆ భాష మీద పట్టు సాధించారు ప్రభాస్. ఏడువేల ఏళ్ల క్రితం నాటి కథను మోడ్రన్ టెక్నాలజీతో చూపించనున్నారు ఓం రౌత్. ఇందుకోసం భారీ ఎత్తున విజువల్ ఎఫెక్ట్స్ ఉపయోగించారు. ఇక ఈ కథలో కొంత భాగం అడవిలో ఉంటుందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. రాముడు జీవితంలో అడవికి వెళ్లడం కీలకమే కదా.

మారేడుమిల్లిలో పుష్పరాజ్

'పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైరు' అంటూ పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ అద్భుతంగా ఒదిగిపోయిన తీరుని 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో చూశాం. సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఘనవిజయం సాధించింది. ఇప్పుడు రెండో భాగం 'పుష్ప: ది రూల్' రెడీ అవుతోంది. తొలి భాగంలో మారేడుమిల్లి ఫారెస్ట్ కీలకం. మలి భాగంలోనూ అడవి బ్యాక్‌డ్రాప్ ఉంటుంది. తొలి భాగంలో కథానాయికగా నటించిన రష్మికా మందన్నా, పోలీస్ పాత్ర చేసిన ఫాహద్ ఫాజిల్, నెగటివ్ రోల్ చేసిన సునీల్ ఇంకా అనసూయ వంటి ఆర్టిస్టులు మలి భాగంలోనూ ఉంటారు. వచ్చే ఏడాది ఈ చిత్రం రిలీజ్ కానుంది.


నితిన్

నితిన్ కూడా మారేడుమిల్లిలోనే...

లవర్‌బాయ్ క్యారెక్టర్స్‌ని నితిన్ చాలానే చేశారు. కొంచెం మాస్ టచ్ ఉన్న పాత్రలూ చేశారు. అయితే అవుట్ అండ్ అవుట్ మాస్ క్యారెక్టర్‌లో ఇప్పటివరకూ కనిపించలేదు. ప్రస్తుతం వక్కంతం వంశీ దర్శకత్వంలో చేస్తున్న సినిమాలో అలాంటి పాత్ర చేస్తున్నారు నితిన్. గడ్డం, మీసాలతో ఫుల్ మాస్‌గా కనిపించనున్నారీ హీరో. ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్‌ని మారేడుమిల్లి ఫారెస్ట్‌లో ఆరంభించారు. ఈ చిత్రకథ ప్రధానంగా అడవి చుట్టూ తిరుగుతుంది. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదలవుతుంది.

అడవి చుట్టూ తిరిగే చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

ఆగనందే..


కార్తీ, త్రిష

'ఆగనందే ఆగనందే.. మోవి నవ్వుతోందే.. మోవి నవ్వే.. మోవి నవ్వే.. మోము నవ్వుతోందే.. మోము నవ్వే.. మోము నవ్వే.. మాను నవ్వుతోందే' అని పాడుతున్నారు యువరాణి కుందై. ప్రియుడు వల్లవ రాయన్ వందియ దేవన్ కోసమే ఈ పాట. విక్రమ్, 'జయం' రవి, కార్తీ, ఐశ్వర్యా రాయ్, త్రిష తదితర భారీ తారాగణంతో మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన 'పొన్నియిన్ సెల్వన్ 2'లోని పాట ఇది. చోళ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో కుందవైగా త్రిష, వందియ దేవన్‌గా కార్తీ నటించారు. ఈ ఇద్దరి మధ్య సాగే 'ఆగనందే ఆగనందే మోవి నవ్వుతోందే..' పాట పూర్తి లిరికల్ వీడియోను సోమవారం విడుదల చేశారు. ఏఆర్ రెహమాన్ స్వరపరచిన ఈ పాటకు అనంత్ శ్రీరామ్ సాహిత్యం అందించగా శక్తి శ్రీ గోపాలన్ పాడారు. 'పొన్నియిన్ సెల్వన్'కి సీక్వెల్‌గా రూపొందిన రెండో భాగం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏప్రిల్ 28న విడుదల కానుంది.

ఫస్ట్ టైమ్ ఎక్కువగా డ్యాన్స్ చేశా!

- నివేదా పేతురాజ్



''ఒక హీరో నిర్మాతగా చేయడం వేరు. కానీ, హీరోగా నటిస్తూనే దర్శకత్వం చేయడం గ్రేట్. 'దాస్ కా ధమ్కీ'కి హీరో, నిర్మాత, డైరెక్టర్.. ఇలా మూడు బాధ్యతలని విశ్వక్ చక్కగా నిర్వర్తించారు. నేను పని చేసిన దర్శకుల్లో త్రివిక్రమ్ శ్రీనివాస్‌గారి తర్వాత అంత ఎనర్జీ ఉన్న దర్శకుడిని విశ్వక్‌లో చూశాను'' అని హీరోయిన్ నివేదా పేతురాజ్ అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించడంతో పాటు నిర్మించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. ఈ సినిమా రేపు (బుధవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా నివేదా పేతురాజ్ మాట్లాడుతూ– ''విశ్వక్‌తో 'పాగల్' మూవీ చేశాను. ఆ తర్వాత 'దాస్ కా ధమ్కీ' కథ యూనిక్‌గా అనిపించడంతో ఓకే చెప్పాను. మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. నా కెరీర్‌లో తొలిసారి ఈ చిత్రంలో గ్లామరస్ రోల్‌తో పాటు ఎక్కువగా డ్యాన్స్ చేశాను. విశ్వక్‌లో అద్భుతమైన ఐడియాలు ఉన్నాయి. అయితే తానే నటుడిగా నటిస్తూ డైరెక్షన్ చేయడం కాకుండా వేరే హీరోలని డైరెక్ట్ చేస్తే బావుంటుందని నా అభిప్రాయం. తన కెరీర్‌లో 'దాస్ కా ధమ్కీ' ఒక మైలురాయిగా నిలుస్తుంది. నేను కేవలం సినిమాలపైనే ఆధారపడటం లేదు. చెన్నైలో రెస్టారెంట్, ఫ్లవర్ షాప్ వ్యాపారాలు చేస్తున్నాను. దర్శకత్వం చేయాలని ఉంది కానీ, అందుకు ఇంకా టైమ్ పడుతుంది. నిర్మాతల కష్టాలు కళ్లారా చూసిన నాకు సినిమా నిర్మించే ఆలోచన లేదు. ప్రస్తుతం సుస్మితగారు నిర్మిస్తున్న ఓ సినిమా, హిందీలో టీ సిరీస్ వారి సినిమా చేస్తున్నాను'' అన్నారు.

అన్ని రకాల పాత్రలు చేయాలనుంది

- దక్షా నగార్కర్




''నా ప్రతి సినిమాలో ఎప్పుడూ కొత్తగా చేయాలని ప్రయత్నిస్తాను. నా గత చిత్రాలు 'హోరాహోరీ, హుషారు, జాంబిరెడ్డి' కూడా వేటికవే ప్రత్యేకమైన జోనర్. 'రావణాసుర' కూడా చాలా వైవిధ్యమైన సినిమా. ఇందులో నా పాత్ర చూసి ప్రేక్షకులు సర్‌ప్రైజ్ అవుతారు'' అని హీరోయిన్ దక్షా నగార్కర్ అన్నారు. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ చిత్రంలో ఓ హీరోయిన్‌గా నటించిన దక్షా నగార్కర్ మాట్లాడుతూ– ''రావణాసుర' కోసం అభిషేక్‌గారు నన్ను సంప్రదించారు. ఆ తర్వాత సుధీర్ వర్మగారు నా పాత్ర, లుక్ గురించి చెప్పగానే ఎగ్జయిటింగ్‌గా అనిపించింది. ఈ మూవీలో నలుగురు హీరోయిన్లు ఉన్నప్పటికీ నా పాత్రకి ఎంత న్యాయం చేయగలను అనే దానిపైనే దృష్టి పెట్టాను. నటనకి ఆస్కారం ఉన్న పాత్ర చేశాను. ఒక నటిగా అన్ని రకాల పాత్రలు చేయాలని, అందరి హీరోలతో కలిసి నటించాలని ఉంది. కొత్తగా రెండు సినిమాలు ఒప్పుకున్నాను'' అన్నారు.

క్రైమ్ థ్రిల్లర్


కార్తీక్ రాజు, ఐరా

కార్తీక్ రాజు హీరోగా, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరోయిన్లుగా మహేష్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని హీరో ఆకాష్ పూరి, క్లూస్ టీమ్ హెడ్ వెంకన్న, నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి, 'స్పై' డైరెక్టర్, ఎడిటర్ గ్యారీ, డైరెక్టర్స్ సుశాంత్ రెడ్డి, కనక మామిడి రిలీజ్ చేశారు. చిత్రనిర్మాత సుభాష్ మాట్లాడుతూ– ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ''క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది'' అన్నారు మహేష్ రెడ్డి. ''ఇంత మంచి సినిమా చేసే చాన్స్ ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు కార్తీక్ రాజు, ఐరా. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, కెమెరా: చరణ్ మాధవనేని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: విజయ, ఝాన్సీ.

ఏదో కలవరం


విజయ్, సిమ్రాన్

విజయ్ ధరణ్ దాట్ల హీరోగా, సిమ్రాన్ గుప్తా, అనన్య నాగళ్ల హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'అన్వేషి'. వీజే ఖన్నా దర్శకత్వంలో టి. గణపతి రెడ్డి నిర్మించారు. చేతన్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఏదో ఏదో కలవరం..' అనే పాటను మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో రిలీజ్ చేశారు. చైతన్య వర్మ సాహిత్యం అందించిన ఈ పాటని అనురాగ్ కులకర్ణి, దీప్తి ప్రశాంతి ఆలపించారు. వీజే ఖన్నా మాట్లాడుతూ– ''అడవి నేపథ్యంలో సాగే సినిమా 'అన్వేషి'' అన్నారు. ''మే రెండో వారంలో చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు గణపతి రెడ్డి. ఈ చిత్రానికి సహనిర్మాతలు: హరీష్ రాజు, శివన్ కుమార్, వెంకట రాంబాబు, జాన్ బోయలపల్లి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దుర్గేష్ .ఎ, కెమెరా: కేకే రావు.

పుంగనూరు కళాశాలలో..


ప్రణవ్, షగ్నశ్రీ

ప్రణవ్ సింగంపల్లి, షగ్నశ్రీ వేణున్ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల'. కొవ్వూరి అరుణ సమర్పణలో భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించారు. ఈ చిత్రం గ్లింప్స్‌ను తెలంగాణ మంత్రి మల్లారెడ్డి ఆన్ లైన్‌లో విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నటుడు సాగర్ ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. శ్రీనాథ్ పులకురం మాట్లాడుతూ– ''పుంగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నేపథ్యంలో తెరకెక్కిన ప్రేమకథ ఇది'' అన్నారు. ''అందర్నీ కదిలించే కథతో ఈ చిత్రాన్ని నిర్మించాం'' అన్నారు భువన్ రెడ్డి. ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్ రోడ్రిగ్యెజ్, నేపథ్య సంగీతం: కమరన్, కెమెరా: నిఖిల్ సురేంద్రన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	361	57,629
నిఫ్టీ ▼	112	16,988

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,662	▲	32
డోజోన్స్	32,223	▲	361
ఎఫ్‌టీఎస్ఈ 100	7,404	▲	68
డాక్స్	14,933	▲	165
షాంఘై	3,235	▼	16
నికాయ్	26,946	▼	388

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.ల్లో — ముంబై

బంగారం (24 క్యారట్)	58,520
బంగారం (22 క్యారట్)	55,730
వెండి (కిలో)	74,000

ఫ్లాగ్‌స్టార్ చేతికి సిగ్నేచర్ బ్యాంక్

డీల్ విలువ రూ. 22,300 కోట్లు



న్యూయార్క్: గత వారం మూతపడిన సిగ్నేచర్ బ్యాంకు మెజారిటీ ఆస్తుల కొనుగోలుకి న్యూయార్క్ కమ్యూనిటీ బ్యాంక్ అంగీకరించింది. డీల్ విలువ 2.7 బిలియన్ డాలర్లు (రూ. 22,300 కోట్లు)గా ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్ప్ (ఎఫ్‌డీఐసీ) వెల్లడించింది. ఒప్పందంలో భాగంగా అనుబంధ సంస్థలలో ఒకటైన ఫ్లాగ్‌స్టార్ బ్యాంక్ ద్వారా సిగ్నేచర్ బ్యాంకుకు చెందిన 38.4 బిలియన్ డాలర్ల ఆస్తులను న్యూయార్క్ కమ్యూనిటీ కొనుగోలు చేయనుంది. ఇవి సిగ్నేచర్ ఆస్తులలో ముప్పావు వంతుకాగా.. సోమవారం (20) నుంచి సిగ్నేచర్‌కు చెందిన 40 బ్రాంచీలు ఫ్లాగ్‌స్టార్ నిర్వహణలోకి వస్తాయి. సిగ్నేచర్‌కు చెందిన 60 బిలియన్ డాలర్ల రుణాలు రిసీవర్‌షిప్ (కస్టోడియన్) కింద ఉన్నట్లు ఎఫ్‌డీఐసీ పేర్కొంది.

అమెజాన్‌లో మరో 9,000 మంది తొలగింపు



న్యూయార్క్: అమెజాన్ మరింత మంది ఉద్యోగులను తొలగించే ప్రణాళికతో ఉంది. ఈ ఏడాది జనవరిలో 18,000 మందిని ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల్లోంచి తొలగించింది. ఇప్పుడు మరో 9,000 మందిని వచ్చే కొన్ని వారాల్లో సాగనంపేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ విషయాన్ని సంస్థ సీఈవో ఆండీ జస్సీ ఉద్యోగులకు పంపించిన మెమోలో పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో ఈ స్థాయిలో ఉద్యోగుల తొలగింపు ఇప్పుడే కనిపిస్తోంది. కంపెనీ వార్షిక ప్రణాళిక ప్రక్రియ రెండో దశ ఈ నెలలోనే ముగిసిందని చెబుతూ, దీని ఫలితమే మరింత మంది ఉద్యోగుల తొలగింపు అని జస్సీ స్పష్టం చేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-3-2023	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్ ధర (డజను)	66.00
20-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95

2 నెలల్లో 6 ఐపీవోలకు చెక్

- ముసాయిదా పత్రాలు వెనక్కి పంపుతున్న సెబీ
- జాబితాలో ఓయో, గో డిజిట్, పేమేట్, లావా..
- లిస్టయ్యాక పేటీఎమ్, జొమాటో, నైకా భారీ నష్టాల ప్రభావం



న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధుల సమీకరణకు వస్తున్న కంపెనీలపై క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ కఠినంగా వ్యవహరిస్తోంది. డిజిటల్ చెల్లింపుల దిగ్గజం పేటీఎమ్ ఐపీవో తదుపరి తలెత్తిన సవాళ్లరీత్యా అన్‌లిస్టెడ్ కంపెనీలు అందిస్తున్న సమాచారంపై మరింత ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వెరసి గత రెండు నెలల్లో ఆరు కంపెనీల ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను తిప్పి పంపింది. ఓయో బ్రాండుతో ఆతిథ్య రంగ సేవలందిస్తున్న ఒరావెల్ స్టేస్ ఈ జాబితాలో చోటు చేసుకోవడం గమనార్హం! మరింత లోతైన సమాచారంతో తిరిగి తాజా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేయమంటూ సెబీ ఆయా కంపెనీలను ఆదేశిస్తోంది.

జాబితాలో..: ఓయోతోపాటు.. సెబీ ప్రాస్పెక్టస్‌లను వెనక్కి పంపిన జాబితాలో ఫెయిర్‌ఫాక్స్(కెనడా) గ్రూప్‌నకు పెట్టుబడులున్న గో డిజిట్ ఇన్సూరెన్స్ లిమిటెడ్, బీ2బీ పేమెంట్స్, సర్వీసుల సంస్థ పేమేట్ ఇండియా, మొబైల్ తయారీ దేశీ కంపెనీ లావా ఇంటర్నేషనల్, ఫైనాన్షియల్ సేవల సంస్థ ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఇండియా, సమీకృత సర్వీసుల సంస్థ బీవీజీ ఇండియా ఉన్నాయి. 2021 సెప్టెంబర్-2022 మే నెల మధ్యలో ఈ 6 కంపెనీలు సెబీకి దరఖాస్తు చేశాయి. ఈ ఏడాది జనవరి-మార్చి10 మధ్య సెబీ వీటి ప్రాస్పెక్టస్‌లను తిప్పి పంపింది. ఈ కంపెనీలు ఉమ్మడిగా రూ. 12,500 కోట్ల సమీకరణకు ప్రణాళికలు వేశాయి.

2021లో నష్టాల ఎఫెక్ట్...

2021లో కొన్ని బడా కంపెనీల పబ్లిక్ ఇష్యూల ద్వారా ఇన్వెస్టర్లు భారీగా నష్టపోవడంతో సెబీ ఇటీవల కఠినంగా వ్యవహరిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రైమ్‌డేటాబేస్ గణాంకాల ప్రకారం 2022లో సగటున సెబీ ఐపీవోలకు 115 రోజుల్లోగా అనుమతిని ఇచ్చింది. కొత్తతరం డిజిటల్ కంపెనీలు పేటీఎమ్, జొమాటో, నైకా ఇష్యూలలో ఇన్వెస్టర్లు భారీగా నష్టపోవడంతో సెబీ ఐపీవోకు అనుమతించడంలో కఠినంగా వ్యవహరిస్తున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ నిపుణులు వీకే విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఇన్వెస్టర్ల పరిరక్షణరీత్యా ఇది ఆహ్వానించదగ్గ పరిణామమని వ్యాఖ్యానించారు. అయితే పబ్లిక్ ఇష్యూలలో ఇన్వెస్ట్ చేసేటప్పుడు ఇన్వెస్టర్లు ప్రధానంగా అధిక ధరను ఆశిస్తున్న కంపెనీలకు దూరంగా ఉండాలని సూచించారు.

పేటీఎమ్ షాక్

పేటీఎమ్ బ్రాండుతో డిజిటల్ చెల్లింపుల సేవలు అందిస్తున్న వన్97 కమ్యూనికేషన్స్ 16 నెలల క్రితం పబ్లిక్ ఇష్యూకి వచ్చింది. పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియా తదుపరి అత్యధికంగా రూ. 18,300 కోట్లు సమీకరించి 2021 నవంబర్‌లో లిస్టయ్యింది. తదుపరి ఇష్యూ ధరలో 72 శాతాన్ని కోల్పోయింది. కాగా.. సెబీ ఇటీవలి చర్యలు నిబంధనల అములులో మర్చంట్ బ్యాంకర్లకు హెచ్చరికలుగా భావించవచ్చని మూలా వ్యవస్థాపక సీఈవో ప్రకార్ పాండే అభిప్రాయపడ్డారు. మార్కెట్ల హెచ్చుతగ్గులు, ఇన్వెస్టర్ల బలహీన సెంటిమెంటు నేపథ్యంలో ఈ ఏడాది ఇప్పటివరకూ 9 కంపెనీలు సెబీకి ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచీ డివ్‌జీ టార్క్‌ట్రాన్స్‌ఫర్ సిస్టమ్స్, గ్లోబల్ సర్ఫేసెస్ మాత్రమే పబ్లిక్ ఇష్యూలను చేపట్టాయి. తద్వారా రూ. 730 కోట్లు సమీకరించాయి. రూ. 66 కోట్లు సమకూర్చుకునేందుకు ఉదయ్‌శివ్‌కుమార్ వచ్చే వారం ఐపీవోకు రానుంది.

2022లో ఓకే...

గతేడాది(2022) మొత్తం 38 కంపెనీలు ఐపీవోకు వచ్చాయి. తద్వారా రూ. 59,000 కోట్లు సమీకరించాయి. అయితే 2021లో రికార్డ్‌స్థాయిలో 63 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలు చేపట్టాయి. రూ. 1.2 లక్షల కోట్లు సమకూర్చుకున్నాయి. ఇక గతేడాది బీమా రంగ పీఎస్‌యూ ఎల్‌ఐసీ రూ. 20,557 కోట్లు సమీకరించడం ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. వెరసి 2022 ఐపీవో నిధుల్లో 35 శాతం వాటాను ఆక్రమించింది. ఈ ఇష్యూని మినహాయిస్తే ప్రైమరీ మార్కెట్ నీరసించినట్లేనని విశ్లేషకులు పేర్కొన్నారు. ఆర్థిక మాంద్య భయాలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు ప్రభావం చూపినట్లు తెలియజేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం(2023-24) ద్వితీయార్ధంలో ప్రైమరీ మార్కెట్ పుంజుకోవచ్చని అంచనా వేస్తున్నారు. ధరలతోపాటు పెరుగుతున్న వడ్డీ రేట్లు, ఆర్థిక మందగమనం, షేర్ల అధిక విలువలు తదితర అంశాలు మార్కెట్లలో దిద్దుబాట్లకు కారణంకానున్నట్లు విశ్లేషించారు.

మహీంద్రా చెంతకు మిత్రా ఆగ్రో



న్యూఢిల్లీ: స్ప్రేయర్ల తయారీ కంపెనీ మిత్రా ఆగ్రో ఎక్విప్‌మెంట్స్‌లో వాటాను 100 శాతానికి పెంచుకున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా సోమవారం ప్రకటించింది. ఇప్పటి వరకు మహీంద్రాకు ఈ కంపెనీలో 47.33 శాతం వాటా ఉంది. ఓమ్నివోర్ పూర్తి వాటాను మహీంద్రా చేజిక్కించుకుంది. తాజా వాటాలను ఎంతకు దక్కించుకున్నదీ కంపెనీ వెల్లడించలేదు. వ్యవసాయ యంత్రాలు, పనిముట్ల వ్యాపారంలో అయిదేళ్లలో 10 రెట్లు వృద్ధి చెందాలన్నది మహీంద్రా లక్ష్యం. వాటా కొనుగోలు సంస్థ వృద్ధికి దోహదం చేయడంతోపాటు పెరుగుతున్న ఉద్యాన పంటల రంగంలో విస్తరణకు ఆస్కారం ఉందని మహీంద్రా అండ్ మహీంద్రా ఫామ్ ఎక్విప్‌మెంట్ విభాగం ప్రెసిడెంట్ హేమంత్ సిక్కా తెలిపారు. పండ్ల తోటల్లో వాడే స్ప్రేయర్ల తయారీలో ఉన్న మిత్రా ఆగ్రో 2012లో ప్రారంభం అయింది. 200 పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. 2017-18తో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ మూడింతల ఆదాయాన్ని ఆర్జించింది. ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. నూతన ఉత్పత్తుల తయారీతోపాటు భారత్ సహా విదేశీ మార్కెట్లలో విస్తరణకు యోచిస్తోంది.

భారత్‌లో సిస్కో భారీ విస్తరణ

- చెన్నైలో డేటా సెంటర్ ఏర్పాటు
- ముంబై కేంద్రం అప్‌గ్రేడ్



న్యూఢిల్లీ: డిజిటల్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ దిగ్గజం సిస్కో.. భారత్‌లో కార్యకలాపాలను భారీగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా చెన్నైలో కొత్త డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. ముంబైలోని సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేస్తోంది. అలాగే హైబ్రిడ్, మల్టీ-క్లౌడ్ విభాగాల భద్రతకు సంబంధించి రిస్కు ఆధారిత కొత్త సొల్యూషన్స్‌ను ఆవిష్కరిస్తున్నట్లు సిస్కో వెల్లడించింది. ప్రస్తుతం తమ టాప్ 10 మార్కెట్లలో ఒకటిగా ఉన్న భారత్..2025 నాటి కల్లా టాప్ 5లోకి చేరగలదని సిస్కో ఇండియా ప్రెసిడెంట్ డైసీ చిట్టిలపిల్లి తెలిపారు. వివిధ విభాగాల్లో డిజిటలీకరణ వేగవంతం అవుతుండటం, 5జీ సర్వీసులు వేగంగా వినియోగంలోకి వస్తుండటం, చిన్న.. మధ్య తరహా సంస్థల్లో టెక్నాలజీ వినియోగం పెరుగుతుండటం తదితర అంశాలు ఇందుకు దోహదపడగలవని ఆమె వివరించారు. ఏపీజేసీ (ఆసియా పసిఫిక్, జపాన్, చైనా) ప్రాంతంలో భారత్ ఇప్పటికే తమకు టాప్ మార్కెట్లలో ఒకటిగా ఉందని డైసీ చెప్పారు.

టెలికం, ఐటీకి కొత్త నిబంధనలు మంచిదే..

టెలికం, ఐటీ రంగాలకు సంబంధించి కేంద్రం కొత్త నిబంధనలను రూపొందిస్తుండటంపై స్పందిస్తూ.. కనెక్టివిటీ పెరిగే కొద్దీ ఇలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం అవసరమేనని డైసీ పేర్కొన్నారు. ఇలాంటివి పరిశ్రమకు కూడా శ్రేయస్కరమేనని చెప్పారు.

సూచీలకు బ్యాంకింగ్ భయాలు

- 17వేల దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్ నష్టం 361 పాయింట్లు
- ఫైనాన్స్, ఐటీ షేర్లలో అమ్మకాలు



ముంబై: అమెరికా, యూరప్‌ల్లో నెలకొన్న బ్యాంకింగ్ సంక్షోభ భయాలతో స్టాక్ సూచీలు సోమవారం నష్టాలను చవిచూశాయి. ఫెడ్ రిజర్వ్ తో పాటు మరిన్ని కేంద్ర బ్యాంకులు రంగంలో దిగి పరిస్థితులు చక్కదిద్దే ప్రయత్నాలు చేపట్టినప్పటికీ.., సంక్షోభం ఆర్థిక మాంద్యానికి దారి తీయొచ్చనే ఆందోళనలు పెరిగాయి. అలాగే ఫెడ్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లు సైతం వడ్డీరేట్లు పెంచొచ్చనే అంచనాలు, దేశీయ మార్కెట్లో ఆగని విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఎఫ్ఎంసీజీ, మీడియా మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సెన్సెక్స్ 361 పాయింట్లు నష్టపోయి 57,629 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 112 పాయింట్లు పతనమై 17 వేల దిగువన 16,988 వద్ద నిలిచింది. ఫైనాన్సియల్, ఐటీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లు నెలకొన్న అమ్మకాల ఒత్తిడితో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఒకశాతానికి పైగా నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2546 కోట్ల షేర్లను విక్రయించగా..., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2877 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలహీనపడి 82.56 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు 3-1% చొప్పున నష్టపోయాయి. ఆరంభ నష్టాలు భర్తీ చేసుకున్న యూరప్ సూచీలు ఒకశాతం పుంజుకున్నాయి. అమెరికా స్టాక్ సూచీలు మిశ్రమంగా కదలాడుతున్నాయి. సెన్సెక్స్ 361 పాయింట్లు క్షీణించడంతో సోమవారం ఒక్కరోజే ఇన్వెస్టర్లకు రూ.2 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.255.52 లక్షల కోట్లకు దిగివచ్చింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నష్టాల మార్కెట్లోనూ కొచ్చిన్ షిప్‌యార్డ్ షేరు రాణించింది. బీఎస్ఈలో నాలుగు శాతం లాభపడి రూ.460 వద్ద ముగిసింది.
- రిలయన్స్ షేరు పతనం 8వ రోజూ కొనసాగింది. ఇంట్రాడేలో 2% పడి ఏడాది కనిష్టాన్ని తాకింది. చివరికి 1% నష్టంతో రూ.2,202 వద్ద నిలిచింది.

విద్య, ఉద్యోగ సమాచారం

హైదరాబాద్ జిల్లాలో 114 పోస్టులు

హైదరాబాద్‌లోని జాయింట్ డైరెక్టర్(మెడికల్), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ ఒప్పంద ప్రాతిపదికన ఈఎస్ఐ హాస్పిటళ్లు/ఈఎస్ఐ డిస్పెన్సరీలు/ఈఎస్ఐ డయాగ్నస్టిక్ సెంటర్‌లలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 114
» **పోస్టుల వివరాలు:** సివిల్ అసిస్టెంట్ సర్జన్-59, డెంటల్ అసిస్టెంట్ సర్జన్-01, ల్యాబ్ టెక్నీషియన్-11, ఫార్మసిస్ట్-43.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, బీడీఎస్, ల్యాబొరేటరీ టెక్నీషియన్ సర్టిఫికేట్, డీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు సీఏఎస్, డీఏఎస్ పోస్టులకు రూ.58,850, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ పోస్టులకు రూ.31,040 చెల్లిస్తారు.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతతో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా జాయింట్ డైరెక్టర్(మెడికల్), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, హైదరాబాద్, ఐదో అంతస్తు, హాస్టల్ బిల్డింగ్, ఈఎస్ఐ హాస్పిటల్ సనత్ నగర్, నాచారం, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.03.2023.
» **వెబ్‌సైట్:** www.hyderabad.telangana.gov.in

ఐఐఎం ఇండోర్‌లో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఇండోర్ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం)-2023లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** అభ్యర్థి 2021, 2022లో పన్నెండో తరగతి/హెచ్ఎస్‌సీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. లేదా 2023లో సంబంధిత పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వయసు:** 01.08.2003 లేదా ఆ తర్వాత జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.04.2023.
» **వెబ్‌సైట్:** www.iimidr.ac.in

ఐఐఎం బోధ్‌గయలో పీహెచ్‌డీలో ప్రవేశాలు

బోధ్‌గయ (బిహార్)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్.. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి మేనేజ్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **పీహెచ్‌డీ స్పెషలైజేషన్:** మార్కెటింగ్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, స్ట్రాటజీ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సిస్టమ్స్ అండ్ అనలిటిక్స్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ క్వాంటిటేటివ్ టెక్నిక్స్, హ్యూమానిటీస్ అండ్ లిబరల్ ఆర్ట్స్(బిజినెస్ కమ్యూనికేషన్), ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ క్యాట్/జీఆర్ఈ/జీమ్యాట్/గేట్/జేఆర్ఎఫ్(యూజీసీ/సీఎస్ఐఆర్) స్కోరు సాధించి ఉండాలి.
» **వయసు:** 01.06.2023 నాటికి అభ్యర్థికి 40 ఏళ్లు మించకూడదు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2023.
» **వెబ్‌సైట్:** www.iimbg.ac.in

నిట్ వరంగల్‌లో అడ్మినిస్ట్రేటివ్ సపోర్ట్ స్టాఫ్ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ ప్రాజెక్ట్ కింద అడ్మినిస్ట్రేటివ్ సపోర్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.5000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** rpadma@nitw.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 30.03.2023.
» **వెబ్‌సైట్:** www.nitw.ac.in

నిట్ వరంగల్‌లో పార్ట్ టైం ప్రోగ్రామర్ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్ తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ ప్రాజెక్ట్ కింద పార్ట్ టైం ప్రోగ్రామర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **అర్హత:** బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్(సీఎస్ఈ/ఐటీ/ఎస్ఈ/ఐఎస్) లేదా ఎంసీఏ/ఎంఎస్సీ(ఎంఎస్) ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.14,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** rpadma@nitw.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 30.03.2023.
» **వెబ్‌సైట్:** www.nitw.ac.in

బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంసీఏ

» నిట్ క్యాంపస్‌లలో ఎంసీఏకు నిమ్‌సెట్
» తొమ్మిది క్యాంపస్‌లలో ప్రవేశ అవకాశం
» నిమ్‌సెట్-2023 ఎంపిక ప్రక్రియ ప్రారంభం
» జూన్ 11న జాతీయ స్థాయిలో పరీక్ష

మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్.. సంక్షిప్తంగా ఎంసీఏ! ఐటీ రంగంలో ఉజ్వల కెరీర్‌కు మార్గం వేసే కోర్సు ఇది. ఇంజనీరింగ్ విద్యలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలుగా గుర్తింపు పొందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లు ఎంసీఏ కోర్సును కూడా అందిస్తున్నాయి. వీటిల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష.. నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(నిమ్‌సెట్)! తాజాగా నిమ్‌సెట్-2023 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. నిమ్‌సెట్ వివరాలు, ప్రవేశాలు కల్పించే నిట్ క్యాంపస్‌లు, ఎంట్రన్స్‌లో విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..



నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లు.. ఐఐటీల తర్వాత దేశంలో పేరున్న విద్యాసంస్థలు. ఈ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నత ప్రమాణాలతో ఇంజనీరింగ్ విద్యతోపాటు ఎంసీఏ కోర్సును అందిస్తున్నాయి. నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (నిమ్‌సెట్)లో స్కోర్ ఆధారంగా ప్రవేశంకల్పిస్తున్నాయి.

9 క్యాంపస్‌లు.. 813 సీట్లు

తొమ్మిది నిట్ క్యాంపస్‌ల్లో మొత్తం 813 సీట్లు అందుబాటులో ఉన్నాయి. నిమ్‌సెట్ ద్వారా ప్రవేశం కల్పిస్తున్న నిట్ క్యాంపస్‌లు-సీట్ల వివరాలు: నిట్ అగర్తల-30 సీట్లు, ఎంఎన్ఎన్ఐటీ-అలహాబాద్-116, ఎంఏఎన్ఐటీ- భోపాల్-115, నిట్-జంషెడ్‌పూర్-115, నిట్-కురుక్షేత్ర-64, నిట్-కురుక్షేత్ర (సెల్ఫ్ ఫైనాన్స్)-32, నిట్-రాయ్‌పూర్-110, నిట్-సూరత్‌కల్-58, నిట్-తిరుచిరాపల్లి-115, నిట్-వరంగల్-58 సీట్లు.

అర్హత

- మ్యాథమెటిక్స్ లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా 60 శాతం మార్కులతో మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. లేదా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో బీఈ లేదా బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. అయితే వీరు సెప్టెంబర్ 15 నాటికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.

4 విభాగాలు-వేయి మార్కులు

- ఎన్ఐటీల్లో ఎంసీఏ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే నిమ్‌సెట్ మొత్తం నాలుగు విభాగాల్లో వేయి మార్కులకు జరుగుతుంది.
- మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలు-600 మార్కులు; అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 40 ప్రశ్నలు-240 మార్కులు; కంప్యూటర్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు-120 మార్కులు; జనరల్ ఇంగ్లిష్ 10 ప్రశ్నలు-40 మార్కులకు ఇలా మొత్తం 120 ప్రశ్నలు-1000 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- మ్యాథమెటిక్స్ విభాగంలో ఒక్కో ప్రశ్నకు 12 మార్కులు, అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ విభాగం, కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగాల్లో ఒక్కో ప్రశ్నకు ఆరు మార్కులు; జనరల్ ఇంగ్లిష్ విభాగంలో ఒక్కో ప్రశ్నలకు నాలుగు మార్కులు చొప్పున కేటాయించారు.
- అదే విధంగా నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 శాతం మార్కులకు నెగెటివ్ మార్కులుగా నిర్దేశించారు.
- పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరుగుతుంది.

టాప్ స్కోర్ సాధించేలా

ఎన్ఐటీ క్యాంపస్‌లలో ఎంసీఏ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే నిమ్‌సెట్‌లో మంచి స్కోర్ సాధించడానికి ఆయా సిలబస్ టాపిక్స్‌పై ప్రణాళికాబద్ధంగా గట్టి పట్టు సాధించాలి.

మ్యాథమెటిక్స్

ఇందులో రాణించడానికి విద్యార్థులు తమ బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలోని మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా సెట్ థియరీ, ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, ఆల్జీబ్రా, కోఆర్డినేట్ జామెట్రీ, కాలిక్యులస్, వెక్టార్స్, ట్రిగ్నోమెట్రీలపై పూర్తి పట్టు సాధించాలి. వీటిలో సంబంధిత అంశాల కాన్సెప్ట్‌లు, అప్లికేషన్స్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. సైంటిఫిక్ కంప్యూటర్ కాలిక్యులేటర్‌పై అవగాహన పెంచుకోవడం మేలు.

అనలిటికల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్

నిమ్‌సెట్‌లో మరో కీలక విభాగం..అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగే ఈ విభాగంలో రాణించాలంటే..అభ్యర్థులు విశ్లేషణ నైపుణ్యాలను, తార్కికంగా ఆలోచించే దృక్పథాన్ని పెంచుకోవాలి. ఇందుకోసం ప్రామాణిక పుస్తకాల ద్వారా ప్రిపరేషన్ సాగిస్తూ ప్రాక్టీస్ చేయాలి. నిమ్‌సెట్ గత ప్రశ్నపత్రాల సాధన కూడా సానుకూల ఫలితానికి దోహదం చేస్తుంది.

కంప్యూటర్ అవేర్‌నెస్

కంప్యూటర్ బేసిక్ నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌కు సంబంధించి బేసిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా డేటా రిప్రజెంటేషన్ అంశాలపైనా పట్టు సాధించాలి.

జనరల్ ఇంగ్లిష్

ఇంగ్లిష్‌లో మంచి మార్కులు పొందడానికి కాంప్రహెన్షన్, వొకాబ్యులరీ, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం కాంపిటీటివ్ ఇంగ్లిష్ టెస్ట్ బుక్స్‌ను చదవడం ఉపకరిస్తుంది. వీటితోపాటు కాంప్రెహెన్షన్ కోసం ఇంగ్లిష్ దినపత్రికలను చదవడం కూడా లాభిస్తుంది.

ప్రాక్టీస్ ప్రధానం

నిమ్‌సెట్‌లో విజయానికి ప్రాక్టీస్ ఎంతో ప్రధానమని గుర్తించాలి. ప్రతి రోజు తాము చదివిన అంశాలకు సంబంధించి ప్రశ్నార్హమైన అంశాలను గుర్తించి సెల్ఫ్ టెస్ట్‌లు రాసుకోవాలి. అదే విధంగా మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లు రాయడం కూడా ఎంతో మేలు చేస్తుంది. వీటివల్ల ఇంకా దృష్టి పెట్టాల్సిన అంశాల విషయంలో అవగాహన వచ్చి.. ప్రిపరేషన్‌పై మరింత స్పష్టత లభిస్తుంది.

ఉమ్మడి కౌన్సెలింగ్

తొమ్మిది ఎన్ఐటీలు ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపు ప్రక్రియ చేపడతాయి. అభ్యర్థులు నిమ్‌సెట్ ర్యాంకు ఆధారంగా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ దరఖాస్తు పూర్తి చేయాలి. ప్రాధాన్యతా క్రమంలో తమకు ఆసక్తి ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లను పేర్కొనాలి. ఆ తర్వాత అభ్యర్థులకు వచ్చిన ర్యాంకు, ఎంచుకున్న ఇన్‌స్టిట్యూట్‌లు, అందుబాటులో ఉన్న సీట్లు ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీట్ అలాట్‌మెంట్ చేస్తారు.

ఆ రెండు క్యాంపస్‌ల్లో ఎగ్జిట్ అవకాశం

నిట్‌లలో ఎంసీఏ కోర్సు వ్యవధిని మూడేళ్లుగా పేర్కొన్నారు. అయితే నిట్-వరంగల్, జంషెడ్‌పూర్ క్యాంపస్‌ల్లో మాత్రం ఎగ్జిట్ అవకాశం అందుబాటులో ఉంది. రెండేళ్ల వ్యవధి పూర్తి చేసుకున్నాక ఎగ్జిట్ ఆప్షన్ ఎంచుకున్న వారికి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ సర్టిఫికెట్‌ను అందిస్తారు. అయితే అభ్యర్థులు తొలి రెండేళ్ల పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

కొలువులు ఖరారు

నిట్‌ల్లో ఎంసీఏ కోర్సు పూర్తి చేసుకుంటే.. భవిష్యత్తు అవకాశాలు ఉజ్వలంగా ఉంటాయనడంలో సందేహం లేదు. కోర్సు బోధనలో భాగంగా ఆయా నిట్‌లు అనుసరిస్తున్న ప్రమాణాలు, నాణ్యతే ఇందుకు కారణం. గత మూడేళ్ల గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఎన్ఐటీల్లో ఎంసీఏ పూర్తి చేసుకున్న వారిలో నూటికి తొంభై శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఖరారయ్యాయి. అదే విధంగా వేతనాలు కూడా సగటున రూ.ఆరు లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఉంటున్నాయి.

నిమ్‌సెట్.. ముఖ్యాంశాలు

- నిమ్‌సెట్ స్కోర్ ఆధారంగా తొమ్మిది ఎన్ఐటీల్లో ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం.
- అందుబాటులో 813 సీట్లు.
- బీఎస్సీ వంటి సంప్రదాయ డిగ్రీ విద్యార్థులకు ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో చేరే అవకాశం.
- ఎన్ఐటీ-వరంగల్, జంషెడ్‌పూర్ క్యాంపస్‌లలో రెండేళ్ల తర్వాత ఎగ్జిట్ అవకాశం.
- నిట్‌లలో ఎంసీఏ పూర్తి చేసిన వారికి ఆకర్షణీయ వేతనాలతో ఐటీ సంస్థల్లో క్యాంపస్ ఆఫర్స్.
- సగటున రూ. 8 లక్షల వార్షిక వేతనం లభిస్తున్న పరిస్థితి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** మార్చి 5 - ఏప్రిల్ 10, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** ఏప్రిల్ 13-ఏప్రిల్ 17, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** జూన్ 1 - జూన్ 11, 2023
- **నిమ్‌సెట్ పరీక్ష తేదీ:** జూన్ 11, 2023
- **ఫలితాల వెల్లడి:** జూన్ 26, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, విజయవాడ
- **వెబ్‌సైట్:** https://www.nimcet.in

బుద్ధవనంలో రాతియుగపు ఆనవాళ్లు

నాగార్జునసాగర్: బుద్ధవనం, బౌద్ధపర్యాటక వార సత్వథీమ్ పార్కులో పాతరాతియుగపు ఆనవాళ్లు బయటపడ్డాయి. బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య నేతృత్వంలో కృష్ణాతీరం వెంట సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేసేందుకు సోమవారం సర్వే నిర్వహిస్తుండగా పురావస్తు పరిశోధకుడు బుద్ధవనం బౌద్ధవిషయ నిపుణుడు ఈమని శివనాగిరెడ్డి వాటిని గుర్తించారు. నదిలో దొర్లిన బింగిరాయిని పాత రాతియుగపు ఆదిమ మానవుడు పనిముట్టుగా తయారు చేసుకున్నాడని శివనాగిరెడ్డి తెలిపారు. ఇలాంటి పనిముట్లను 'అచూలియన్' తరగతికి చెందినవిగా పురావస్తు శాస్త్రవేత్తలు పేర్కొంటారన్నారు. గతంలో కొత్తరాతి యుగపు ఆనవాళ్లు గుర్తించిన బుద్ధవనంలో పాత రాతి యుగపు పనిముట్లు బయల్పడటంతో బుద్ధ వనం చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు.


ఇండియన్‌థాయ్ బౌద్ధబిక్షువు అరుణోధేర, మల్లేపల్లి లక్ష్మయ్యలకు పాతరాతియుగంలో పనిముట్లుగా వాడిన రాళ్లను చూపిస్తున్న శివనాగిరెడ్డి


లభ్యమైన రాతి పనిముట్లు

డిస్కంలకు రూ.11,500 కోట్ల సబ్సిడీ ఇస్తాం

ఈఆర్సీకి సర్కారు వెల్లడి • 16,107 కోట్ల ట్రూఅప్ చార్జీలను ప్రతిపాదించిన డిస్కంలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌తో పాటు వివిధ వర్గాలకు రాయితీపై విద్యుత్‌ను సరఫరా చేసేందుకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్క)లకు రూ.11,500 కోట్లను సబ్సిడీగా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి తాజాగా లేఖ రాసింది. 2023–24లో రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు రూ.54,060 కోట్ల వ్యయం అవుతుందని, ప్రస్తుత చార్జీలను యథాతథంగా అమలుచేస్తే రూ.43,525 కోట్లు మాత్రమే వస్తాయని ఉత్తర, దక్షిణ డిస్కంలు ఈఆర్సీకి నివేదించాయి. రూ.10,535 కోట్ల లోటు వస్తుండగా.. ఆ మేరకు విద్యుత్ సబ్సిడీలను ప్రభుత్వం అందిస్తుందని, వచ్చే ఏడాది టారిఫ్‌ను పెంచకుండా ప్రస్తుత చార్జీలనే కొనసాగించాలని కోరాయి. అయితే, 2016–17 నుంచి 2022–23 మధ్య కాలానికి రూ.12,015 కోట్ల పవర్ పర్చేజ్ ట్రూఅప్ చార్జీలు, 2006–21 కాలానికి రూ.4,092 కోట్ల డిస్ట్రిబ్యూషన్ ట్రూఅప్ చార్జీలు కలిపి మొత్తం రూ.16,107 కోట్ల ట్రూఅప్ చార్జీల భారాన్ని విని యోగదారులపై మోపాలని డిస్కంలు ప్రతిపాదించాయి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.